PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 148 | విజయవాడ, మంగళవారం 30 డిసెంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No Vijayawada, Tuesday 30 December 2025 Rs

నిర్బంధం నడుమ బంద్

- ఎస్.రాయవరం, నక్కపల్లిల్లో భారీగా పోలీసుల మోహరింపు
- లోకనాథం, కోటేశ్వరరావు సహా 26 మంది అరెస్టు

2

శ్రామిక ఉత్సవ్‌లో మాట్లాడుతున్న సుద్దాల అశోక్ తేజ, వేదికపై డి.రమాదేవి, ఎలమరం కరీం, సిహెచ్.నర్సింగరావు, తపన్‌సేన్, టిపి.రామకృష్ణన్ తదితరులు

ఇక 28 జిల్లాలు

కొత్తగా మార్కాపురం, పోలవరం • మదనపల్లె కేంద్రంగా అన్నమయ్య జిల్లా

- నెల్లూరుకు గూడూరులోని మూడు మండలాలు
- కొత్త వాహనాలకు 10శాతం రోడ్డు భద్రత పన్ను
- అప్పు కోసం ప్రీపెయిడ్ మీటర్లకు గ్రీన్ సిగ్నల్
- ఆమోదం తెలిపిన మంత్రివర్గం

మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జిల్లాల సంఖ్య పెరగనుంది. ప్రస్తుతం ఉన్న 26 జిల్లాలకు అదనంగా రెండు జిల్లాల ఏర్పాటుకు రాష్ట్రమంత్రివర్గం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొత్తగా మార్కాపురం, పోలవరం జిల్లాలను ఏర్పాటుచేస్తూ సోమవారం నిర్ణయం తీసుకుంది. ఈ సమావేశ నిర్ణయాలను రెవెన్యూ, పౌరసరఫరాల, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రులు అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్ విలేకరులకు వివరించారు. జిల్లాల పునర్విభజనపై నవంబర్ 17న ఇచ్చిన ప్రాథమిక నోటిఫికేషన్‌పై వచ్చిన పలు అభ్యతరాలను పరిశీలించి తుది నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. రంపచోడవరం నియోజకవర్గాన్ని పోలవరం జిల్లాగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పోలవరం గ్రామాన్ని అభివృద్ధి చేసి రెవెన్యూ డివిజన్‌గా భవిష్యత్తులో ఏర్పాటు చేస్తామన్నారు. కనిగిరి, ఎర్రగొండపాలెం, గిద్దలూరును కలిపి మార్కాపురం జిల్లాగా ఏర్పాటు చేస్తామన్నారు. మదనపల్లె కేంద్రంగా అన్నమయ్య జిల్లా ఉంటుందని తెలిపారు. రాయచోటి నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా ఏర్పాటు చేయలేమని కాబట్టి దీనిని అన్నమయ్య జిల్లాలోనే ఉంచినట్లు వివరించారు. కొత్త జిల్లాల ఏర్పాటుకు సంబంధించిన తుది నోటిఫికేషన్‌ను ఈ నెల 31వ తేదిన విడుదల చేస్తామన్నారు. గూడూరు నియోజకవర్గంలోని గూడూరు, కోట, చిల్లకూరు మండలాలను నెల్లూరు జిల్లాలో కలుపుతున్నట్లు చెప్పారు. మిగిలిన రెండు మండలాలను తిరుపతి జిల్లాలోనే ఉంచుతున్నట్లు తెలిపారు.

కొత్తగా కొనుగోలు చేసే వాహనాలకు రోడ్డు భద్రత పన్ను వసూలు చేసేందుకు ఆమోదం తెలిపింది. లైఫ్ ట్యాక్స్ చెల్లించే నగదులో 10శాతం ఈ పన్ను కింద వసూలు చేసేలా ఆర్డినెన్స్ జారీ చేసేందుకు నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ప్రతి నెలా సుమారు 73వేల కొత్త వాహనాలు రిజిస్ట్రేషన్ అవుతాయని, ఈ పన్ను ద్వారా నెలకు రూ.22.5 కోట్లు, ఏడాదికి రూ.270 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేసింది. రాజధాని అమరావతిలో వివిధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అమలు కోసం నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డు) నుంచి నాబార్డు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ అసిస్టెన్స్ (ఎన్‌ఐడిఎ) స్కీం కింద రూ.7387.70 కోట్ల అప్పు పొందేందుకు సిఆర్‌డిఎ కమిషనర్‌కు అనుమతి ఇచ్చింది. జిఎస్‌డిపిలో 0.50శాతం వరకు అదనపు రుణాన్ని పొందేందుకు అన్ని ప్రభుత్వ భవనాల్లో స్మార్ట్ ప్రిపెయిడ్ మీటర్లను అమర్చనుంది. ఎపి పవర్ కోఆర్డినేషన్ కమిటీ (ఎపిపిసిసి) సభ్యుల కన్వీనర్ చేసిన ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

స్వర్ణ సచివాలయాలు

గ్రామ, వార్డు సచివాలయాల పేర్లను స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాలుగా మార్పు చేయాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. ఇ-కోర్ట్సు ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని 13 జిల్లా కోర్టుల్లో 13 సిస్టమ్ ఆఫీసర్ పోస్టులు, 26 సిస్టమ్ అసిస్టెంట్ పోస్టుల కల్పనకు ఆమోదం తెలపడంతో పాటు ప్రస్తుతం కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న సిబ్బందిని ఈ కొత్త పోస్టుల్లో విలీనం మిగతా 7లో

భూ కేటాయింపులు

- బాపట్ల మండలంలోని వెస్ట్ బాపట్ల గ్రామంలో రెండెకరాల ప్రభుత్వ భూమిని టిడిపి జిల్లా కార్యాలయం నిర్మాణానికి ఏడాదికి రూ.1000 చొప్పున 33 ఏళ్ల పాటు లీజుకు అప్పగించేందుకు నిర్ణయం తీసుకుంది.
- విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం, గుడివాడ గ్రామంలో 18.57 ఎకరాల ప్రభుత్వ భూమిని రాష్ట్రీయ సేవా సమితికి బదిలీ చేసేందుకు ఆమోదం తెలిపింది.
- అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన గ్రామం, 9.88 ఎకరాల భూమిని వేదాంత లిమిటేడ్‌కు లీజు పద్ధతిలో కేటాయింపు.
- నెల్లూరు జిల్లా దామవరం గ్రామంలో 418.14 ఎకరాలను దగదర్తి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు అభివృద్ధి కోసం సేకరించేందుకు ఎపి ఎయిర్‌పోర్ట్సు డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు అనుమతి ఇచ్చింది.
- తిరుపతి జిల్లా దామినేడు గ్రామంలో 28.37 ఎకరాల ప్రభుత్వ భూమిని జిల్లా స్పోర్ట్స్ ఆథారిటీ తిరుపతి స్థానంలో శాప్‌కు ఉచితంగా బదిలీ చేసేందుకు ఆమోదం.
- ఏలూరు జిల్లా నూజివీడులో 9.96 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్ స్థాపన కోసం హార్టికల్చర్ అండ్ సెరికల్చర్ డైరెక్టర్‌కు 33 ఏళ్లపాటు లీజు ప్రాతిపదికన బదిలీ.

శ్రామిక జన సంస్కృతిపై మనువు విసిరిన బల్లెం

- కార్పొరేట్ మతతత్వ రాజకీయాలపై సుద్దాల అశోక్ తేజ
- ప్రజల తిరుగుబాటు, ధిక్కార స్వరమే స్ఫూర్తి
- కనుల పండుగగా 'శ్రామిక ఉత్సవ్'

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

శ్రామిక జన సంస్కృతిపై మనువు విసిరిన బల్లెంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్పొరేట్, మతతత్వ రాజకీయాలను ప్రముఖ కవి, సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ అభివర్ణించారు. సిఐటియు మహాసభ సందర్భంగా సోమవారం సాయంత్రం విశాఖ సాగర తీరంలోని ఎయు కన్వెన్షన్ సెంటర్ వెనుకగల ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో 'స్త్రీ, పురుష సమానత్వం' అనే థీమ్‌తో జరిగిన 'శ్రామిక ఉత్సవ్' సభకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్వేగ భరితంగా మాట్లాడిన ఆయన ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు అమలుచేస్తున్న విచ్ఛిన్నకర పోకడలను కవితాత్మకంగా, తీవ్రంగా విమర్శించారు. మానవాళి మనుగడకు కీలకమైన భూగోళం పుట్టుకలోనే భిన్నత్వం ఉన్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. 'భూగోళ మట్టిలోనే భిన్నత్వంలో ఏకత్వం ఉంది. మనల్ని మాత్రం ఏక మత గుత్తాధిపత్యంలో మగ్గమంటున్నారు. ఇది చెల్లదు' అని చెప్పారు. ఈ మాటలు అన్నందుకు కొన్ని శక్తులు దాడులు చేసే అవకాశం కూడా ఉందని చెప్పారు. 'నేడో, రేపో, ఆ మర్నాడో ఎప్పుడైనా దాడులు జరిగే అవకాశం ఉంది. అయితే, అటువంటి వాటికి ప్రజా కవులు, రచయితలు భయపడరు, వెనకడుగు వేయరని అన్నారు. అణచివేతపై ప్రజల తిరుగుబాటు, ధిక్కార స్వరమే ప్రజా రచయితలకు స్ఫూర్తి నిస్తుందని, తనకు కూడా అంతేనని చెప్పారు. ఈ సందర్భంగా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు ఏళ్ల తరబడి చేస్తున్న పోరాటాన్ని ఆయన ప్రస్తావించారు. తాను రాసిన 'ఎవడురా అమ్మేది... ఎవడురా కొనేది' పాటకు ఆ కార్మికుల పోరాటమే స్ఫూర్తినిచ్చిందని అన్నారు. ఆ పోరాటానికి సంబంధించిన అనేక విషయాలను సిఐటియు నేత సిహెచ్ నర్సింగరావు తనకు మూడు రోజుల పాటు వివరించారని చెప్పారు. ప్రజల తిరుగుబాటు, శ్రమజీవులు, మహిళల ధిక్కార స్వరాలనే అక్షరాలుగా మలచి తను ఎన్నో పాటలు రాసినట్లు తెలిపారు. సమాజంలో జరిగే దోపిడీ, పీడనలపై ప్రజా కవులు కచ్చితంగా స్పందిస్తారని అన్నారు. మిగతా కవుల్లో 'సిరా' మాత్రమే ఉంటుందని, ప్రజాకవుల్లో మాత్రమే రక్తం, చెమట సిరాగా మారి పాటైనా, గేయమైనా బయటకొస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన బాల్యాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. 'హైదరాబాద్‌లో ఇంటర్ చదువుకునే రోజుల్లో భవన నిర్మాణ పనులకు వెళ్తుండే వాడిని. ఆ భవన నిర్మాణ కార్మికునిగా ఇక్కడకు వచ్చాను" అని చెప్పారు. 'కన్ను మూసేదాక.. పెన్ను మూసేది లేదు' అంటూ ఉత్తేజభరితంగా ప్రసంగించారు. తన తండ్రి సుద్దాల హనుమంతు, తల్లి జానకమ్మ స్వాతంత్ర్య సమరయోధులుగా తనకు గొప్ప శ్రమజీవుల వారసత్వాన్ని అందించారని గుర్తుచేసుకున్నారు.

కరతాళ ధ్వనులతో ప్రతిస్పందించిన జనం

ఈ సందర్భంగా ఒసేయ్ రాములమ్మ, కొమరం భీముడో, ఒకటే జననం ఒకటే మరణం... గెలుపు పొందువరకూ.. అలుపు లేదు మనకు' వంటి అనేక గీతాలను స్వయంగా వేదికపై సుద్దాల అశోక్‌తేజ పాడి ఉర్రూతలూగించారు. చిన్నా, పెద్దా అనకుండా సభికులంతా కరతాళ ధ్వనులతో సందడి చేశారు. ఈలలు, చప్పట్లతో సాగర తీర ప్రాంగణం అంతా మార్మోగిపోయింది. ఐద్వా జాతీయ కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ ఒకవైపు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల మిగతా 5లో

మహాధర్నాకు వేలాదిగా తరలివచ్చిన పిఎసిఎస్ ఉద్యోగులు

పిఎసిఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- వేలాదిగా తరలివచ్చిన ఉద్యోగులు • పలు పార్టీలు, ప్రజా సంఘాల మద్దతు

7

రెండోదశ పూలింగుకు 3న నోటిఫికేషన్!

ముహూర్తం ఖరారు చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి రాజధాని విస్తరణలో భాగంగా రెండోదశ పూలింగు నోటిఫికేషన్‌ను జనవరి 3న విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. గత టిడిపి పాలనలో రాజధాని ప్రక్రియ జనవరిలోనూ మొదలైందని, ఇప్పుడు కూడా జనవరిలోనే ప్రారంభించాలని భావిస్తున్నట్లు సమాచారం. దీనిలో భాగంగా పల్నాడు జిల్లా అమరావతి, గుంటూరు జిల్లా తుళ్లూరు పరిధిలో ఏడు గ్రామాల నుండి భూసమీకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది.

నవంబరు 27న జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఏడు గ్రామాల్లో భూ సమీకరణ అధికారాన్ని సిఆర్‌డిఎ కమిషనర్‌కు అప్పగించిన విషయం తెలిసిందే. తాజా నోటిషికేషన్ ద్వారా 16,562.56 ఎకరాల పట్టా భూమి, 104.01 ఎకరాలు మొత్తం 16,666.57 ఎకరాలు సమీకరించనున్నారు. దీంతోపాటు ప్రభుత్వ భూమి 3828.56 ఎకరాలు తీసుకోనున్నారు. దీనికి సంబంధించి కాంపిటెంట్ అథారిటీకి అవసరమైన అధికారులను ఎంపిక చేసింది. కార్యాలయాలూ తీసుకుంది. డిసెంబర్లోనే నోటిఫికేషన్ ఇవ్వాలని నిర్ణయించినా వేర్వేరు కారణాలతో ఆలస్యమైంది. తుళ్లూరు మండలంలోని పెదపరిమి, వడ్డమాను, హరిశ్చంద్రాపురం గ్రామాలు, అమరావతి మండలంలోని వైకుంఠపురం, పెదమద్దూరు, యండ్రాయి, కర్లపూడి లేమల్లెలో భూసమీకరణకు సంబంధించిన వివరాలను రెవెన్యూ అధికారులు సేకరించి నివేదికలు తయారుచేసి ఆయా జిల్లాల కలెక్టర్లకు పంపించారు. కొన్ని గ్రామాల్లో రైతులు ఇప్పటికే భూములు ఇస్తామని చెప్పి వారి భూముల పట్టాలను మంత్రి నారాయణకు అందజేశారు. వడ్డమానులో రైతులతో సమావేశం సందర్భంగా నాలుగేళ్లలో అభివృద్ధి చేసి ఇవ్వాలని లేనిపక్షంలో రైతుకు ఐదు లక్షలు పరిహారం ఇచ్చేలా ఒప్పంద పత్రంలో చేర్చాలని కోరారు. దీనిపై గతంలోనే గ్రామసభలూ నిర్వహించిన సంగతి తెలిసిందే. జనవరి మూడోతేదీన నోటిఫికేషన్ ఇచ్చి ఫిబ్రవరి 28వతేదీలోపు ప్రక్రియను ముగించేలా అధికారులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది.

దట్టమైన పొగమంచుతో విమాన సర్వీసులు రద్దు

న్యూఢిల్లీ : ఉత్తరాది రాష్ట్రాల్లో దట్టమైన పొగమంచుతో విమాన కార్యకలాపాలు అంతరాయం కలిగింది. దృశ్యమానత భారీగా తగ్గడంతో ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సోమవారం మధ్యాహ్నం వరకూ సుమారు 130 సర్వీసులను రద్దు చేశారు. మరికొన్ని సర్వీసుల షెడ్యూల్‌ను మార్పు చేశారు. మరికొన్నింటినీ దారి మళ్లించారు. ఈ నెల 31 వరకూ ఇదే పరిస్థితి కొనసాగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. 'నిరంతర దట్టమైన పొగమంచు కారణంగా విమాన కార్యకలాపాలు క్లిష్ట పరిస్థితుల్లో కొనసాగుతున్నాయి. దీని ఫలితంగా విమానాల రద్దు, ఆలస్యం జరగవచ్చు' అని ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రయాణీకులు విమానాశ్రయానికి బయలుదేరే ముందు తమ విమాన స్థితిని తనిఖీ చేసుకోవాలని పేర్కొంది. అలాగే, ప్రయాణానికి అదనపు సమయం కేటాయించుకోవాలని తెలిపింది. విమానయాన సంస్థలు కూడా ఇదే విషయాన్ని తెలిపాయి. సోమవారం ఉదయానికి రన్‌వే విజువల్ పరిధి (ఆర్‌విఆర్) దాదాపు 50 మీటర్లకు పడిపోయింది. దీంతో వాతావరణ శాఖ ఢిల్లీలో రెడ్ అలెర్ట్ జారీ చేసింది. తీవ్రమైన పొగమంచు కారణంగా వందేభారత్, జనశతాబ్ది , రాజధాని ఎక్స్‌ప్రెస్‌తో సహా పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి.

విశాఖ పోర్టు డిప్యూటీ చైర్‌పర్సన్‌గా రోష్ని అపరంజి కోరాటి

- తొలిసారి మహిళా ఐఎఎస్ అధికారి నియామకం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ (విశాఖ)

విశాఖపట్నం పోర్ట్ అథారిటీ డిప్యూటీ చైర్‌పర్సన్‌గా రోష్ని అపరంజి కోరాటి (2011 ఐఎఎస్) సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం పోర్ట్‌లో ఈ పదవిని చేపట్టిన తొలి మహిళా ఐఎఎస్ అధికారిణిగా ఆమె చరిత్ర సృష్టించారు. అస్సాం, మేఘాలయ కేడర్‌కు చెందిన రోష్ని అపరంజి కోరాటి విశాఖపట్నానికి చెందినవారు. ఆమె తన విద్యాభ్యాసమంతా విశాఖలోనే పూర్తి చేశారు. ఆమె తండ్రి విశాఖపట్నం పోర్ట్ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించారు. తండ్రి సేవలందించిన సంస్థకు ఆమె డిప్యూటీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించారు.

ఉన్నావో అత్యాచార కేసులో సుప్రీం స్టే

- ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులను పక్కనపెట్టిన ధర్మాసనం
- జైల్లోనే కుల్దీప్ సింగ్ సెంగార్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఉన్నావో రేప్ కేసులో బిజెపి మాజీ ఎమ్మెల్యే కుల్దీర్ సింగ్ సెంగార్‌కు ఢిల్లీ హైకోర్టు జారీ చేసిన బెయిల్‌పై సుప్రీంకోర్టు స్టే విధించింది. 2017లో ఉత్తరప్రదేశ్లోని ఉన్నావోలో నాటి బిజెపి ఎమ్మెల్యే కుల్దీర్ సింగ్ సెంగార్ అత్యాచార ఘటన సంచలనమయింది. ఆయనకు జీవిత ఖైది శిక్షను న్యాయస్థానం విధించింది. అయితే సెంగార్‌కు విధించిన జీవిత ఖైదు శిక్షను రద్దు చేస్తూ ఢిల్లీ కోర్టు గతవారం ఆదేశాలు ఇచ్చింది. ఈ తీర్పుపై విమర్శలు వెల్లువెత్తాయి. అటు బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులు, మహిళా సంఘాలు, విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. మరోవైపు ఢిల్లీ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ న్యాయవాదులు అంజలే పటేల్, పూజా శిల్పర్, సిబిఐ వేర్వేరుగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. సోమవారం ఈ పిటిషన్లను సిజెఐ జస్టిస్ సూర్య కాంత్, న్యాయ మూర్తులు జస్టిస్ జెకె.మహేశ్వరి, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసిహ్ లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. బాధితురాలి భద్రతకు సంబం ధించిన అంశాలతో సిబిఐ ప్రస్తా వించిన అంశాలను ధర్మాసనం ఏకీభవిం చింది. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఉత్తర్వులను నిలిపివేయడంతో పాటు నిందితుడు కుల్దీప్ సెంగార్ కు నోటీసులు జారీ చేసింది. బెయిల్ రద్దు పిటిషన్‌పై నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆయన్ని ఆదేశించింది. అలాగే డిసెంబర్ 23న ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల జైలు నుంచి విడుదల చేయొద్దని కూడా తెలిపింది. లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం (పోక్సో చట్టం) సెక్షన్ 5 మిగతా 7లో

ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో మంటలు

- రెండు ఎసి బోగీలు ఆహుతి
- మంటల్లో చిక్కుకొని ఒకరు మృతి

మంటల్లో కాలిపోతున్న రైలు బోగీలు (ఇన్‌సెట్‌లో) చంద్రశేఖర్ (ఫైల్)

ప్రజాశక్తి- యలమంచిలి టౌన్ (అనకాపల్లి జిల్లా), అమరావతి బ్యూరో

టాటానగర్ నుండి ఎర్నాకుళం వెళ్తున్న ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ రైలులో అనకాపల్లి జిల్లా యలమంచిలి రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున మంటలు వ్యాపించి రెండు ఎసి బోగీలు అగ్నికి ఆహుతయ్యాయి. బయటకు రాలేక ఒకరు మృతి చెందగా, మిగిలిన ప్రయాణికులందరూ క్షేమంగా దిగిపోయారు. సౌత్ సెంట్రల్ డిఆర్ఎం మోహిత్ సోనాకియా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... టాటా నగర్ నుంచి ఎర్నాకుళం వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు (18189)లో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత (సోమవారం వేకువజామున) సుమారు ఒంటిగంట సమయంలో యలమంచిలి రైల్వే స్టేషన్‌కు సమీపంలోకి వచ్చేసరికి బి1, ఎం2 బోగీల్లో మంటలు వ్యాపించాయి. దీంతో, అప్రమత్తమైన ప్రయాణికులు చైన్ లాగారు. అదే సమయంలో పొగలు రావడం గమనించిన లోకో పైలెట్, గార్డ్ యలమంచిలి రైల్వే స్టేషన్లో రైలును నిలిపివేశారు. మంటలు వ్యాపించిన రైలు బోగీలను లోకో పైలెట్లు రైలు నుంచి విడదీసి రైలును దూరం చేశారు. రైలులోని బి1 బోగీలో 76 మంది, ఎం2 బోగీలో 82 మంది ప్రయాణికులు ఉన్నారు. అందరు క్షేమంగా దిగిపోగా, బి1లో ప్రయాణిస్తున్న విజయవాడకు చెందిన సుందర్ చంద్రశేఖర్ (70) రైలు దిగలేక బోగీలో ఉండిపోయి మంటల్లో కాలిపోయి మృతి చెందారు. రైలు బోగీలకు వ్యాపించిన మంటలను యలమంచిలి, నక్కపల్లి, అనకాపల్లి నుంచి నాలుగు అగ్నిమాపక వాహనాలు సుమారు నాలుగు గంటల పాటు కష్టపడి అదుపులోకి తీసుకొచ్చాయి. అనంతరం సుమారు తెల్లవారుజామున 5.30 గంటలు సమయంలో బి1, ఎం2 బోగీలను, వాటిలో ప్రయాణికులను అక్కడే వదిలేసి రైలు బయలుదేరి వెళ్లింది. ఆ కాలిన బోగీలను యలమంచిలి రైల్వే యార్డ్‌కు తరలించారు. ఈ రెండు బోగీల్లోని ప్రయాణికులను బస్సుల్లో సామర్లకోట వరకు తరలించి, అక్కడ ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌కు రెండు అదనపు బోగీలను అమర్చి ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చే ఏర్పాట్లు చేసినట్లు డిఆర్ఎం తెలిపారు. చంద్రశేఖర్ మృతదేహాన్ని యలమంచిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని కుటుంబానికి రూ.5 లక్షలు పరిహారం మిగతా 7లో

నిర్బంధం నడుమ బంద్

ఆందోళనకారులను అరెస్టు చేసి వ్యాన్‌లో ఎక్కించిన దృశ్యం

- ఎస్.రాయవరం, నక్కపల్లిల్లో భారీగా పోలీసుల మోహరింపు
- దుకాణాలు తెరవాలని యజమానులకు బెదిరింపులు
- బంద్‌కు మద్దతుగా పలు గ్రామాల నుండి తరలివచ్చిన ప్రజలు
- లోకనాథం, కోటేశ్వరరావు సహా 26 మంది అరెస్టు

ప్రజాశక్తి- నక్కపల్లి, ఎస్.రాయవరం (అనకాపల్లి జిల్లా)

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజును ప్రభుత్వం పీడీ యాక్ట్ పెట్టి అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల్లో చేపట్టిన బంద్ పోలీసు నిర్బంధం మధ్య జరిగింది. బంద్‌కు ప్రజలు, దుకాణాల యజమానులు స్వచ్ఛందంగా సహకరించగా, పోలీసులు నిర్బంధాన్ని ప్రయోగించారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథంతోపాటు పలువురు పార్టీ, ప్రజా సంఘాల నాయకులు, అసంఘటిత రంగ కార్మికులు బంద్ నిర్వహణకు నక్కపల్లి సిపిఎం కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరగా డిఎస్‌పి శ్రీనివాసరావు, సిఐ జె.మురళి ఆధ్వర్యంలో పోలీసులు వారిని అడ్డుకున్నారు. చట్టానికి లోబడే బంద్ చేపడతామని, స్వచ్ఛందంగా బంద్ చేపట్టేందుకు షాప్ యజమానులు, ప్రజలు ముందుకు వచ్చారని, శాంతియుతంగానే బంద్ నిర్వహిస్తామని లోకనాథం పోలీసులకు చెప్పినా డిఎస్‌పి, సిఐ ఒప్పుకోలేదు. ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డులో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. మహిళా నేతలను అడ్డుకునే తరుణంలో ఇరుపక్షాల మధ్య తీవ్రవాదోపవాదాలు, తోపులాటలు జరిగాయి. అనంతరం వేర్వేరు ప్రాంతాల్లో లోకనాథం, జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, ఆర్.శంకర్‌రావు, గంటా శ్రీరామ్, గనిశెట్టి సత్యనారాయణ, ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం సహా 26 మందిని అరెస్టు చేసి ఎస్.రాయవరం పోలీసు స్టేషన్‌కు తరలించారు.

సోమవారం తెల్లవారుజాము నుంచే పోలీసులు బంద్‌ను విఫలం చేయడానికి తీవ్ర ప్రయత్నాలు చేశారు. అప్పలరాజు స్వగ్రామం ధర్మవరంలో ఎవరూ బయటకు రాకుండా పోలీసులు భయభ్రాంతులకు గురి చేశారు. రాజయ్యపేట గ్రామంలో మత్స్యకారులు బంద్‌లో పాల్గొనకుండా ముందస్తుగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సిఐలు మురళి, అప్పన్న ఆ గ్రామానికి వెళ్లి సిపిఎం మండల కార్యవర్గ సభ్యులు మైలపల్లి మహేష్‌తోపాటు కాశీరావు, చేపల సోమేష్‌లను గృహ నిర్బంధం చేశారు. పలు గ్రామాల నుండి మహిళలు బంద్‌లో పాల్గొనేందుకు బయలుదేరగా, బంద్‌లో ఎవరైనా పాల్గొంటే వారిపై కేసులు పెడతామని పోలీసులు బెదిరించారు. అన్నిదారుల్లోనూ పోలీస్ పహారా ఏర్పాటు చేశారు. అడ్డరోడ్డు, నక్కపల్లి ప్రాంతంలో 30 యాక్ట్ అమల్లో ఉందని, ఎవరైనా ర్యాలీలు, నిరసనలు చేస్తే అరెస్టులు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. బంద్‌కు ఎవరూ సహకరించవద్దని, షాపులు తెరవాలని పోలీసులు ప్రతి దుకాణానికి వెళ్లి షాపు యజమాలను బెదిరించారు. విద్యా సంస్థలను నడపాలంటూ డిఇఒ, ఎంఇఒలు వాటి యాజమాన్యాలకు మెసేజ్‌లు పెట్టారు. సిపిఎం నక్కపల్లి కార్యాలయం వద్ద పోలీస్ పహారా పెట్టి అక్కడకు చేరిన కార్యకర్తలను అక్కడకక్కడే అరెస్టు చేశారు. వివిధ గ్రామాల నుంచి బంద్‌లో పాల్గొనడానికి వస్తున్న మహిళలను సైతం ఎక్కడకక్కడ అరెస్టు చేశారు. గ్రామాల్లో మైకు ద్వారా ప్రచారం చేసి బంద్‌కు ఎవరూ వెళ్లొద్దని, వెళ్లిన వారిపై కేసులు పెడతామని హెచ్చరించారు.

కార్పొరేట్ రాజ్యం చేసేందుకే అప్పలరాజును అరెస్ట్ చేశారు : వి.శ్రీనివాసరావు

పాయకరావుపేట నియోజకవర్గాన్ని కార్పొరేట్ రాజ్యంగా చేసేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, అందుకే పీడీ యాక్స్ పెట్టి ఎం.అప్పలరాజును పోలీసులు అరెస్ట్ చేశారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. బంద్ సందర్భంగా పోలీసులు అరెస్టు చేసిన సిపిఎం నాయకులను పోలీసు స్టేషన్లో ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇలాంటి నిర్బంధాలు, అణచివేతలతో ఉద్యమం ఆగదని, పీడీ యాక్టులు పెట్టి ఎంత మందిని అరెస్టు చేసినా ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వామపక్షాలు, ఇతర పక్షాలతో అఖిలపక్ష భేటీవేసి తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

బంద్‌పై నిర్బంధం, అరెస్టులకు ఖండన

- సిపిఎం రాష్ట్ర కమిటీ
- విజయవంతం చేసిన పార్టీలు, ప్రజా సంఘాలకు ధన్యవాదాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అనకాపల్లి జిల్లా బంద్‌పై పోలీసులు నిర్బంధం ప్రయోగించడాన్ని, నాయకులను అరెస్టు చేయడాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. రైతు నాయకులు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజుపై పిడి యాక్టు పెట్టి అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం బంద్ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల్లో సిపిఎం శ్రేణులు, సాధారణ ప్రజలపై తీవ్ర నిర్బంధం ప్రయోగించడాన్ని ఖండించారు. ఎస్.రాయవరం పోలీసుస్టేషన్లో ఉన్న నాయకులను కలుసుకుని పరామర్శించారు. అప్పలరాజు అరెస్టును నిరసించిన ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని తెలిపారు. రైతుల భూములను కార్పొరేట్లకు కట్టబెట్టడానికి చట్టాలను తుంగలో తొక్కి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని వివరించారు. విశాఖ ఉక్కును తాకట్టుపెట్టి మిట్టల్ ఫ్యాక్టరీ కోసం ప్రభుత్వం తాపత్రయపడుతోందని విమర్శించారు. బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా పోరాడుతున్న రాజయ్యపేట గ్రామస్తులను మభ్యపెట్టి భూములు స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారని, బల్క్‌డ్రగ్ ఫ్యాక్టరీని పెట్టబోమని నోటిమాటగా హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి ఇప్పటికీ నోటిఫికేషన్ ఉపసంహరించుకోకపోవడం కపటనీతిని ఎత్తి చూపుతోందని తెలిపారు. వారి కుట్రలకు అడ్డుగా నిలుస్తున్నారనే అప్పలరాజుపై పిడి యాక్టు పెట్టారని పేర్కొన్నారు. అరెస్టు చేసిన వారిని తక్షణం విడుదల చేయాలని కోరారు. నిర్బంధాన్ని అధిగమించి బంద్‌ను జయప్రదం చేసిన కార్యకర్తలకు, వివిధ పార్టీలకు, ప్రజా సంఘాలకు సిపిఎం రాష్ట్ర కమిటీ తరుపున ధన్యవాదాలు తెలిపారు.

జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నాలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ఇనుమూరు గిరిజనులపై తప్పుడు కేసులు ఎత్తివేయాలి

- ఆదివాసీ గిరిజన, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం (ఏలూరు జిల్లా)

గిరిజనులపై దాడి చేయడమే కాక, ఆపై పెట్టిన తప్పుడు కేసులను ఎత్తి వేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం ఇనుమూరు గిరిజనుల భూసమస్యలు పరిష్కరించాలని ఆదివాసీ గిరిజన సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. గిరిజన సంఘం జిల్లా నాయకులు మొడియం నాగమణి అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇనుమూరులో 57 గిరిజన కుటుంబాలు సాగు చేసిన మొక్కజొన్న పంటలను ధ్వంసం చేసి, గిరిజనుల పైన, గిరిజన మహిళలపైనా దాడికి పూనుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని, దాడికి పాల్పడ్డ తహశీల్దార్, ఎస్ఐ, భూస్వాములపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇనుమూరు, ఏజెన్సీ ప్రాంత గిరిజన భూసమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా అన్ని సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ఇనుమూరు భూముల సమస్యపై హైకోర్టులో కేసు నడుస్తోందని గుర్తు చేశారు. ఏజెన్సీ భూసమస్యల్లో పోలీసులు జోక్యం చేసుకోకూడదని జిఒ నెం.1049/28-7-2007 ఉన్నా వారు జోక్యం చేసుకుని గిరిజనులు, పేదలపై నిర్బంధాన్ని ప్రయోగించి దాడులు చేస్తున్నారన్నారు. దీనిపై పోలీసు అధికారులను ప్రశ్నిస్తే ఆర్‌డిఒ భూస్వాములకు అనుకూలంగా ప్రొటెక్షన్ ఆర్డర్ ఇచ్చినందుకే దాని అమలుకు తాము వచ్చామని చెప్పారన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతంలో ఆర్‌డిఒ, తహశీల్దార్లకు ప్రొటెక్షన్ ఆర్డర్లు ఇచ్చే అధికారం లేకున్నా జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఇచ్చిన ప్రొటెక్షన్ ఆర్డర్ వల్లే ఈ ఘటన చోటుచేసుకుందని తెలిపారు. ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజా రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పివి.రామకృష్ణ మాట్లాడారు. అనంతరం కార్యాలయ సూపరింటెండెంట్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు తామా ముత్యాలమ్మ, వివిధ సంఘాల జిల్లా నేతలు, గిరిజనులు పాల్గొన్నారు.

అమరవీరుల చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, వామపక్షాల నాయకులు

బలమైన ఉద్యమాలకు అమరవీరులు స్ఫూర్తి

- విజయనగరం జిల్లా అమరవీరుల చరిత్ర పుస్తకావిష్కరణలో వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

సమ సమాజం కోసం, సోషలిజం కోసం అమరవీరులు చేసిన పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బలమైన ఉద్యమాలకు అమరవీరులు స్ఫూర్తిగా నిలుస్తారని అన్నారు. సిపిఎం విజయనగరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు రాసిన జిల్లా అమరవీరుల చరిత్ర పుస్తకాన్ని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం వామపక్ష పార్టీల నాయకులతో కలిసి వి.శ్రీనివాసరావు ఆవిష్కరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ చరిత్రను అర్థం చేసుకుంటూనే భవిష్యత్‌ను రూపొందించుకోవాలని సూచించారు. రెడ్డి శంకరరావు రాసిన పుస్తకం విజయనగరం జిల్లా అమరవీరుల చరిత్ర కాదు... ఉత్తరాంధ్ర జిల్లాల చరిత్ర అని అన్నారు. ప్రజల కోసం నిస్వార్థంగా భూమి కోసం, భుక్తి కోసం పోరాటాలు చేసిన కమ్యూనిస్టులు, కవులు, కళాకారుల గురించి రాయడం అభినందనీయమని పేర్కొన్నారు. నాడు, నేడు సామాజిక న్యాయం కోసం, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడుతున్నది కమ్యూనిస్టులేన్నారు. చివరకు ట్రంప్ లాంటి వారు తమకు కమ్యూనిస్టులే పోటీ అని చెప్పడం వెనుక నాటి నుంచి నేటి వరకు కమ్యూనిస్టుల పాత్ర ఏ విధంగా ఉందో అర్థమవుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో పరిశ్రమలు పెడతామని రైతుల నుంచి భూములు సేకరించి ఒక్క పరిశ్రమ కూడా పెట్టడం లేదని, అందుకు వ్యతిరేకంగా పోరాడుతున్న అనకాపల్లి జిల్లా సిపిఎం నాయకుడిపై పీడీ చట్టం నమోదు చేశారంటే కమ్యూనిస్టులు అంటే పాలకులకు ఎంత భయమో అర్థమవుతోందన్నారు. 2047 విజన్ అని చెప్పి ఈ ఐదేళ్లలో ఏమి చేస్తారో చెప్పకుండా దోపిడీ పాలన సాగిస్తున్నారన్నారు. కమ్యూనిస్టులు అభివృద్ధికి వ్యతిరేకం అని చెబుతున్న పాలకులు ఎవరైనా రాష్ట్ర అభివృద్ధికి విశాలాంధ్రలో ప్రజారాజ్యం లాంటి పుస్తకాలు రాయగలిగారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిపిఎం విజయనగరం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, సిపిఐఎంఎల్ (లిబరేషన్) విజయనగరం జిల్లా కార్యదర్శి బెహారా శంకరరావు, పుస్తక రచయిత రెడ్డి శంకరరావు మాట్లాడారు.

పోలీస్ స్టేషన్‌లో రమేష్

సిపిఎం నెల్లూరు జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అరెస్ట్

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

కిసాన్‌సెజ్‌లో మంగళవారం జరగనున్న ఇథనాల్ పరిశ్రమ ప్రజాభిప్రాయ సేకరణ నిలుపుదల చేయాలని కోరుతూ ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం నెల్లూరు జిల్లా కార్యదర్శి మూలం రమేష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కొడవలూరు మండలం, రేగడచెలిక వద్ద సోమవారం రాత్రి పోలీసులు అయనను అడ్డుకున్నారు. ప్రచారం నిర్వహించొద్దని, ఇక్కడకు ఎందుకు వచ్చారని పోలీసులు వాదనకు దిగారు. రమేష్ ఇక్కడ నుంచి వెళ్లిపోవాలని నెల్లూరు రూరల్ డిఎస్‌పి శ్రీనివాసరావు కోరారు. ఇంతలో నెల్లూరు రెండో నగర పోలీసులు రమేష్‌కు నోటీసులు ఇవ్వాలని చూశారు. తాను ఎందుకు తీసుకోవాలని, ఏం తప్పుచేశానని పోలీసులను ఆయన ప్రశ్నించారు. నోటీసులు తీసుకోకపోతే అరెస్ట్ చేయాల్సి ఉంటుందని ఆయనను జీపు ఎక్కించారు. అక్కడ నుంచి నెల్లూరు రెండో నగర పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం పూచీకత్తుపై విడుదల చేశారు.

ఆర్‌టిఐ చీఫ్ కమిషనర్‌గా వజ్జా శ్రీనివాస్?

- మరో నలుగురు కమిషనర్ల ఎంపిక పూర్తి!

అమరావతి : సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) కమిషనర్ల ఎంపిక దాదాపు ఓ కొలిక్కి వచ్చినట్లు తెలిసింది. చీఫ్ కమిషనర్, నలుగురు కమిషనర్ల ఎంపికను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నేతృత్వంలోని కమిటీ సోమవారం పూర్తిచేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఆర్‌టిఐ చీఫ్ కమిషనర్‌గా హైకోర్టు న్యాయవాది వజ్జ శ్రీనివాస్‌ను, కమిషనర్లుగా సీనియర్ పాత్రికేయుడు విఎస్‌కె చక్రవర్తి, ముగ్గురు న్యాయవాదులు గాజుల ఆదెన్న (అనంతపురం), రవి యాదవ్ (కడప), పి.ఎస్.నాయుడు (విశాఖ)ను ఎంపిక చేసినట్లు తెలిసింది.

జిల్లా కేంద్రంగా పోలవరం కోరుతూ బంద్ విజయవంతం

ప్రజాశక్తి- పోలవరం

పోలవరం జిల్లాకు పోలవరం జిల్లా కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన పోలవరం బంద్ విజయవంతమైంది. పోలవరంలోని ఎస్‌బిఐ, ప్రభుత్వ కార్యాలయాలన్నీ మూతపడ్డాయి. వ్యాపారులు తమ దుకాణాలను స్వచ్ఛందంగా మూసేసి బంద్‌లో పాల్గొన్నారు. దీంతో, పోలవరంలోని ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో జిల్లా సాధన సమితి కన్వీనర్ నాళం గాంధీ, బుగ్గ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వాలు పోలవరం ప్రాంతవాసులకు తీరని అన్యాయం చేస్తున్నాయన్నారు.

వడ్డీ ఎక్కువ వచ్చే చోటే పెట్టుబడులు

- బ్యాంకు డిపాజిట్లపై ప్రభుత్వ రంగ సంస్థలకు ఆదేశాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించి బ్యాంకు డిపాజిట్లపై ఆర్థికశాఖ తాజా మార్గదర్శకాలు జారీచేసింది. కార్పొరేషన్లు, సొసైటీలు, బోర్డులు, ట్రస్టులు, సంస్థలు, విశ్వవిద్యాలయాలు, స్పెషల్ పర్పస్ వెహికల్స్ వంటివి బ్యాంకుల్లో డిపాజిట్ చేసే నిధులకు సంబంధించి బ్యాంకుల నుంచి వడ్డీ రేట్లనూ ఆర్థికశాఖ ప్రస్తావించింది. ప్రస్తుతం ఐదు నుంచి ఏడు శాతం వరకు వడ్డీ వస్తోందని, ఈ నేపథ్యంలోనే బ్యాంకులతో వ్యవహరించాల్సిన విధానాలను కూడా ఆర్థికశాఖ స్పష్టంగా పేర్కొంది. అధిక వడ్డీ వచ్చే బ్యాంకులతో సంప్రదించి ప్రస్తుత ఖాతాలను ఆయా బ్యాంకులకు బదలాయించాలని, లేదా వడ్డీలపై సంప్రదించి ఖాతాలను పునఃప్రారంభించాలని (రీఎలకేషన్) ఆర్థికశాఖ సూచించింది.

రాయచోటి పైనే రగడ

- రాజంపేట నుంచి వ్యతిరేకత
- ఏడ్చేసిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కొత్త జిల్లాల ఏర్పాటులో గందరగోళం మంత్రివర్గ భేటీలో కూడా కొనసాగింది. ప్రధానంగా రాయచోటిపైనే ఎక్కువగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా అక్కడి మంత్రి రాంప్రసాదరెడ్డి కన్నీళ్లు పెట్టుకున్నట్లు తెలిసింది. తన ప్రజలకు సమాధానం చెప్పుకోలేని పరిస్థితి నెలకొందని ఆయన ముఖ్యమంత్రి ఎదుటే ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. అయితే చివరకు రాయచోటి నియోజకవర్గాన్ని మదనపల్లిలోనే కొనసాగించేందుకు తుది నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఇదే సమయంలో 2025లో ప్రభుత్వ పాలన, సాధించిన విజయాలను కూడా చర్చించారు.

ఇటీవల కాలంలో విస్తృత చర్చనీయాంశంగా మారిన జిల్లాల పునర్విభజన అంశంపై తాజాగా మంత్రివర్గ భేటీ అనంతరం చర్చ జరిగింది. అన్నమయ్య జిల్లా కేంద్రంగా ఉన్న రాయచోటిని మదనపల్లి జిల్లాలోకి మార్చడంపై జరిగిన చర్చ సందర్భంగానే రాంప్రసాదరెడ్డి కన్నీటి పర్యంతమైనట్లు తెలిసింది. ఈ మార్పు చేయకపోతే పాలనాపరమైన సమస్యలు ఉత్పన్నమవుతాయని చంద్రబాబు చెప్పినట్లు సమాచారం. రాయచోటి అభివృద్ధిని తాను స్వయంగా చూసుకుంటానని కూడా మంత్రికి హామీనిచ్చినట్లు తెలిసింది. ఒక్క నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా ప్రకటించడం సాధ్యం కాదుకదా.. అని చంద్రబాబు వ్యాఖ్యానించారని సమాచారం. రాజంపేట వాసులు కడపలోకి, రైల్వే కోడూరువాళ్లు తిరుపతిని కోరుకుంటున్నందున రాయచోటి మార్పు తప్పడం లేదని చంద్రబాబు వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

పోలవరం పేరు ఒక జిల్లాకు పెట్టడంపైనా చర్చ జరిగింది. పోలవరం లేని ప్రాంతానికి ఆ పేరు పెట్టడంపై జనసేనకు చెందిన ఒక మంత్రి ప్రస్తావించగా, పోలవరం నిర్వాసితులు ఉండడం వల్లనే ఆ పేరు పెట్టాలని నిర్ణయించినట్లు చంద్రబాబు వివరణ ఇచ్చారు. ఎన్‌టి రామారావు గ్రామం లేకుండా ఎన్‌టిఆర్ జిల్లా పేరు ఉంది కదా అని కూడా గుర్తు చేసినట్లు సమాచారం. మండలాల, డివిజన్లపైనా చర్చ జరిగింది. గతంలో మూడు కొత్త మండలాలను ఏర్పాటుచేయాలని ప్రతిపాదించగా, దానిని ఇప్పుడు రెండు మండలాలకే పరిమితం చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఆదోని మండలాన్ని రెండుగా విభజించే అంశంపై చర్చ జరగ్గా నెల్లూరు డివిజన్‌లో రెవెన్యూ, పోలీస్ కేంద్రాలు వేరేవేరే ప్రాంతాల్లో ఉండడంపైనా చర్చ జరిగింది.

అధికారులపై అసంతృప్తి

కొంతమంది అధికారులు మంత్రివర్గ భేటీకి ఆలస్యంగా రావడంపైనా ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. తమ సబ్జెక్ట్ ఉన్నప్పుడే వస్తామంటే ఎలా అని ప్రశ్నించినట్లు తెలిసింది. ఇకపై అలా జరగకుండా చూసుకోవాలని స్పష్టం చేయడం విశేషం. ఇక రాష్ట్రంలో వివిధ పోర్టులపైనా చర్చ జరగ్గా, ప్రతి జిల్లాకు ఒక ఎయిర్‌పోర్టు ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మాత్రం విమానాశ్రయ ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని మంత్రులకు సూచించారు. 2025 సంవత్సరంలో జరిగిన అభివృద్ధిపైనా మంత్రులతో చర్చించారు. అన్నిరంగాల్లో అభివృద్ధిని సాధిస్తున్నామని, ఆర్థికంగా సమస్యలు ఉన్నా కూడా అభివృద్ధి ఆగడం లేదని మంత్రులకు వివరించారు. ఇదే వేగంతో 2026లో కూడా పనిచేయాలని సూచించారు. వచ్చే ఏడాది ఐక్యరాజ్య సమితి నిర్వహించే క్వాంటం సదస్సు అమరావతిలోనే జరుగుతుందని, అప్పటికి మన క్వాంటం కంప్యూటర్ కూడా తయారవుతుందని చంద్రబాబు వివరించారు.

అన్ని ఆలయాల్లో శ్రీవారి సేవకుల తరహా విధానం

- ఆర్‌టిజిఎస్ సమీక్షలో సిఎం చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో శ్రీవారి సేవకుల తరహా విధానాన్ని అవలంబించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దేవాదాయశాఖ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో సోమవారం ఆయన ఆర్‌టిజిఎస్ నుంచి వివిధ శాఖలను సమీక్షించారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో స్థానికంగా వాలంటీర్లను నియమించుకోవాలన్నారు. శ్రీవారి సేవకుల తరహాలోనే అన్ని దేవాలయాల్లో సేవలు చేసే వారిని గుర్తించి వారి జాబితాలను సిద్ధం చేయాలన్నారు. ఇదే విధానాన్ని శ్రీశైలంలోనూ కొనసాగిస్తున్నారని చెప్పారు. పిహెచ్‌సి, సిహెచ్‌సిలు మొదలు జిల్లా ఆసుపత్రుల్లో మెరుగైన సౌకర్యాలు ఉండాలన్నారు. కలెక్టర్లు రెగ్యులర్ అంశాలపై ఫోకస్ చేస్తూనే కీలకమైన శాఖలు, విభాగాలపై మరింత శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రజలు నిత్యం సందర్శించే ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వాసుపత్రుల్లో క్షేత్రస్థాయి పని తీరును ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ఉండాలన్నారు. సర్వేలు చేపట్టే విషయాల్లో ఎలాంటి తప్పిదాలు జరగకుండా చూడాలని, సర్వేలో పాల్గొనే వారు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చూస్తూ రెవెన్యూ యంత్రాంగం పనిచేయాలన్నారు. రెవెన్యూశాఖ కొన్ని విషయాల్లో ఉన్న చెడ్డపేరును తొలగించుకోవాలన్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. పంటలు ఎలా పండుతాయో వివరించాలన్నారు. రవాణా శాఖ తన పనితీరును మరింత మెరుగు పరుచుకోవాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. అగ్నిమాపక శాఖ పనితీరు బాగుందని సిఎం అభినందించారు.

ఉద్యోగ సంఘాల డైరీలను ఆవిష్కరించిన సిఎం

పలు ఉపాధ్యాయ సంఘాలు రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను సిఎం ఆవిష్కరించారు. ఎపి ఎన్జీవో అసోసియేషన్, ఎపిజెఎసి అమరావతి, ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, ప్రభుత్వ వైద్యుల సంఘం, ఎపిటిఎఫ్, తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం, ఎపి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్, ఎపి డ్రైవర్ల సంఘం, పోలీస్ అధికారుల సంఘం, ఎపిఎస్ ఆర్‌టిసి ఎన్ఎంయు తదితర సంఘాల క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎన్జీవో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డివి రమణ, విద్యాసాగర్, యుటిఎఫ్ అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు, అమరావతి జెఎసి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పి దామోదరరావు, ప్రభుత్వ వైద్యుల సంఘ నాయకులు జయధీర్, ఎపిటిఎఫ్(257) అధ్యక్షులు జి హృదయరాజు, ఎపిటిఎఫ్(1938) అధ్యక్షురాలు సిహెచ్ మంజుల, తెలుగునాడు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, ఆప్టా అధ్యక్షులు కాకి ప్రకాష్‌రావు, ఉపాధ్యక్షులు పూర్ణచందరరావు, ఎపి డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు సంసాని శ్రీనివాసరావు, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు జనుకుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైకుంఠ ద్వార దర్శనానికి తిరుమల ముస్తాబు

- భారీ భద్రత ఏర్పాట్లను చేసిన టిటిడి
- నేటి నుంచి మూడు రోజుల పాటు 1,72,000 మందికి దర్శనాలు
- 30, 31, జనవరి 1 తేదీల్లో సర్వదర్శనాలు రద్దు

ప్రజాశక్తి- తిరుమల

వైకుంఠ ద్వార దర్శనానికి తిరుమల శ్రీవారి ఆలయం ముస్తాబైంది. మంగళవారం వేకువజామున 1.30 గంటలకు వైకుంఠ ద్వారాలు తెరుచుకుంటాయి. ప్రొటోకాల్ విఐపిలతో దర్శనాలు ప్రారంభం అవుతాయి. ఈసారి టిటిడి విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ వింగ్ సిబ్బంది 1800 మంది, 2000 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేశారు. జనవరిలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మరణించిన ఘటన వల్ల తాజాగా భద్రతా చర్యల వెనుక అధికారుల్లో తెలియని కలవరం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 30, 31, జనవరి 1వ తేదీలలో టోకెన్లు పొందిన 1,72,000 మందికి మాత్రమే శ్రీవారి దర్శనం కల్పించనున్నట్లు టిటిడి పేర్కొంది. ఈ మూడురోజులు సర్వదర్శనాలను టిటిడి రద్దు చేసింది. జనవరి రెండు నుంచి సామాన్య యాత్రికులకు సర్వదర్శనం, జనవరి 6, 7, 8 తేదీల్లో రోజుకు ఐదు వేల మంది చొప్పున 15 వేల మంది స్థానికులకు దర్శనం కల్పించనున్నారు.

శ్రీవారి ఆలయంలో యాత్రికులను వైకుంఠ ద్వార దర్శనాలకు ఆహ్వానం పలుకుతూనే టిటిడి ఆంక్షలు విధిస్తోంది. జిల్లా సరిహద్దుల్లో వాహనాల తనిఖీకి చెక్ పోస్టులు, అలిపిరి వద్ద టోకెన్లు లేని వారిని వెనక్కి పంపించే విధంగా చర్యలు ముమ్మరం చేసింది. శ్రీవారి ఆలయంలోకి ప్రవేశించడానికి యాత్రికులకు రూట్ మ్యాప్‌ను కూడా ప్రకటించారు. తిరుమలలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశామని తిరుపతి జిల్లా ఎస్‌పి ఎల్ సుబ్బారాయుడు చెప్పారు. టోకెన్లు ఉన్న యాత్రికులు ప్రశాంతంగా వైకుంఠ ద్వార దర్శనం చేసుకునేలా టిటిడితో సమన్వయం చేసుకుని పోలీసులు విధులు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. తిరుమలలో డిసెంబర్ 30వ తేదీ నుంచి జనవరి ఎనిమిదో తేదీ వరకు పది రోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనం కల్పించడానికి అధికారులు సన్నాహాలు పూర్తి చేశారు.

పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న జెఎసి నాయకులు

అన్నమయ్య జిల్లాను యథాతథంగా కొనసాగించాలి

- అన్నమయ్య జిల్లా సాధన కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం

ప్రజాశక్తి - రాయచోటి (కడప జిల్లా)

అన్నమయ్య జిల్లా కేంద్రంగా ఉన్న రాయచోటిని అలాగే కొనసాగించాలని సోమవారం అన్నమయ్య జిల్లా సాధన కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పార్టీలకు అతీతంగా రాజకీయ మేధావులు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలకు చెందిన వారు పట్టణంలోని చెక్ పోస్ట్ శివాలయం నుంచి నేతాజీ సర్కిల్, జామియా మసీదు సర్కిల్, గాంధీ బజార్, వైఎస్‌ఆర్ సర్కిల్ మీదుగా నేతాజీ కూడలి వరకు ర్యాలీ కొనసాగించారు. అన్నమయ్య జిల్లాను విభజించవద్దు, రాయచోటి జిల్లా కేంద్రంగానే కొనసాగించాలి, మదనపల్లి వద్దు - రాయచోటి ముద్దు, ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు రాయచోటి వాసులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ర్యాలీలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న జిల్లా కేంద్రం మార్పు అంశాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.

మున్సిపల్ వైస్ చైర్మన్ రాజీనామా

రాయచోటి అర్బన్ : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిని తొలగించి మదనపల్లికి మారుస్తూ తీసుకున్న నిర్ణయానికి నిరసనగా మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథ రామిరెడ్డి, 15వ వార్డు కౌన్సిలర్ పోలంరెడ్డి విజయమ్మ తమ పదవులకు రాజీనామా చేశారు. తమ రాజీనామాలను వారు రాయచోటి మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ రవిరెడ్డికి అధికారికంగా సమర్పించారు.

చేయాల్సిందంతా చేసి కన్నీరు కార్చడమెందుకో?
వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాష్ట్ర మంత్రిగా ఉండి, జిల్లాల పునర్విభజనం అంశంపై జరిగిన మంత్రివర్గ సమావేశంలో పాల్గొని అడ్డుచెప్పకపోగా, సమావేశం అనంతరం బయటకు వచ్చి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి కన్నీరు కార్చడంపై వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన ఒక వీడియోను విడుదల చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమాయంలో రాయచోటిలో జరిగిన బహిరంగ సభలో చంద్రబాబు రాయచోటిని జిల్లా కేంద్రంగానే కొనసాగిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారన్నారు. ఇంతవరకు దేశంలో ఏర్పాటైన జిల్లాలను రద్దుచేసిన చరిత్ర లేదని, చంద్రబాబు ఒక్కరే కొత్తగా ఏర్పాటైన అన్నమయ్య జిల్లాను ముక్కలు చేసి రద్దుచేశారంటూ విమర్శించారు. పార్లమెంటు కేంద్రాలను జిల్లాల ఏర్పాటు ప్రాతిపదికంగా నిపుణుల కమిటీ నివేదికతో వైసిపి ప్రభుత్వం హయాంలో జిల్లాను ఏర్పాటు చేశారని తెలిపారు. మదనపల్లె జిల్లా ఏర్పాటును తాము వ్యతిరేకించలేదని, ఏకారణాలతో అన్నమయ్య జిల్లాను రద్దు చేశారో చెప్పవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని అన్నారు. జిల్లా రద్దుపై ప్రభుత్వం తన మొండివైఖరిని వీడకపోతే గట్టి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

మౌలానా అంత్యక్రియలు పూర్తి

నెల్లూరు ప్రతినిధి : ప్రముఖ ఇస్లాం ప్రబోధకులు, ముస్లిం అధ్యాత్మికవేత్త హజ్రత్ మౌలానా ముఫ్తీ అబ్దుల్ వహబ్ సాహెబ్ ఖాసిమీ రషాది అంత్యక్రియలు ముగిశాయి. ఆదివారం రాత్రి ఆయన మృతిచెందారు. సోమవారం ఉదయం 11 గంటలకు బట్వాడిపాళెం వద్ద ఉన్న జామీయా మసీద్‌లో అంత్యక్రియులు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ముస్లిం పెద్దలు, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హాజంయ్యారు. మోలానా భౌతికకాయానికి వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నగర ఇన్‌ఛార్జ్ పి చంద్రశేఖర్‌రెడ్డి సందర్శించి నివాళి అర్పించారు.

ఉయ్యాల - జంపాల

ఊగింది ఊగింది ఉయ్యాల
పాడాలి పాడాలి జోలాల
ఏడవకు ఏడవకు ఈవేళ
జో జో జో జో జోలాల

మామయ్య వస్తాడు ఈవేళ
పండ్లు పూలు తెస్తాడు జోలాల
ఏడవకు ఏడవకు జంపాల
కంట్లో నీళ్ళు చూడలేను బాల

చందమామలొస్తారు సాయంత్రాల
అక్కా, అన్నలంటు పిలవాల
ఏడవకు ఏడవకు ఉయ్యాల
ఇల్లంత చేస్తారు గోలగోల
సూర్యుడాకసాన పోయేవేళ

నాన్న గారు వస్తారు
జోలాల
బొమ్మలెన్నొ తెస్తారు
ఆడాల
నిన్నెత్తుక తిప్పుతారు
జంపాల

అవ్వతాతలొస్తారు
మాపటేల
కథలెన్నొ చెబుతారు ఊకొట్టాల
ఏడవకు ఏడవకు మాబాల
నిన్నాటలాడిస్తారు ఆడాల

ఏడవకు ఏడవకు ఉయ్యాల
నోరెండుక పోతుంది మాబాల
మరోమారు పాలు పట్టాలా
జో జో జో జో జోలాల

- ఆవుల చక్రపాణి యాదవ్,
99633 50973.

పర్యావరణ హితాన్ని కోరుదాం

హాయ్ ఫ్రెండ్స్,

నా పేరు పృథ్వీరాజ్. ప్రగతి స్కూల్లో **10వ తరగతి చదువుతున్నాను.** పర్యావరణానికి తీవ్ర హానికల్గిస్తున్న అంశాల్లో ప్లాస్టిక్ ఒకటి. నిత్య జీవితంలో ముఖ్యంగా వస్తువుల ప్యాకింగ్. ప్రక్రియలో దీని వినియోగం ఎక్కువ. దీనిని కాలిస్తే వచ్చే విషవాయువులు కాలుష్యానికి దారితీస్తున్నాయి. మానవులతోపాటుగా జంతువులు, నీటిలో ఉండే ప్రాణులకు హాని కలుగుతోంది. భూమిపై కాలుష్యంలో కీలక భూమిక పోషించేది ప్లాస్టిక్ సంచులే. ఇవి మానవాళికి పెను సవాల్‌ను విసురుతున్నాయి. ప్లాస్టిక్ మితిమీరిన వాడకంతో పర్యావరణం ప్రశ్నార్థకంగా మారింది. ఇదే కొనసాగితే భవిష్యత్ తరాలు అనారోగ్య సమాజంలో జీవించాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా గోనె (జూట్) సంచుల వాడాలి. ఇందులో ప్రభుత్వాల పాత్రతోపాటుగా ప్రజల భాగస్వామ్యం కూడా ముఖ్యం. ప్లాస్టిక్ వాడకాన్ని ఆపేద్దాం బాధ్యత కలిగిన పౌరుడిగా జీవిద్దాం. ఆ దిశగా ప్రతిజ్ఞ పూనుదాం. ప్లాస్టిక్‌పై ప్రచారానికి గానూ నన్ను క్రిస్మస్ సందర్భంగా అభినందించారు.

- కుక్కమళ్ళ పృథ్వీరాజ్,
10వ తరగతి
ప్రగతి స్కూలు, సుందరయ్యనగర్,
తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా.

నేను గీసిన బొమ్మ

ఎస్.కె.సోహెల్,
6వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
మునుకుళ్ళ, తిరువూరు మండలం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పల్లె గుమ్మంలోకి టెక్నాలజీ

ఇంకొన్ని గంటల్లో ఈ శతాబ్దపు తొలి 25 ఏళ్ల కాలం పూర్తవ్వబోతోంది. ఈ కాలం ఎన్నో అనుభవాలని, మరెన్నో చేదు సంగతులని మనముందుకు తీసుకొచ్చింది. ముఖ్యంగా సాంకేతికత తొలి అడుగులు వడివడిగా మొదలై 'ఎఐ' విశ్వ రూపంతో అంతెత్తున ఎగిసిపడిన కాలం ఇది. పల్లెలు, పట్టణాల్లో సాంకేతికత ప్రభావం కళ్లముందు స్పష్టంగా కనిపిస్తోంది. నగర జీవిత వేగం మరింత దూకుడుగా ముందుకు పోతోంది. పల్లె సీమలు డిజిటల్ వేగంతో, ఆన్‌లైన్ యాప్‌లతో నిండిపోయాయి. ఒక చేతిలో మొబైల్, మరో చేతిలో జీవితం నడిపిస్తున్న రోజులివి. సాంకేతికత ఈ ఏడాది మనల్ని ఎంత దూరం పెట్టింది? ఎంత దగ్గర చేసింది?

ఒకప్పుడు సాంకేతికత పట్టణాలకి సంబంధించినది. గ్రామాలకి ఏమాత్రం పట్టనిది. కానీ ఈ కాలం దాన్ని మార్చేసింది. పల్లె జీవితంలోకి టెక్నాలజీ నెమ్మదిగా ప్రవేశించింది. ఇది గ్రామస్తులకి బ్యాంకు దూరాన్ని తగ్గించింది. అవ్వతాతలకి వేలిముద్రతో పింఛను తీసుకునే సౌలభ్యం కల్పించింది. మండీకి వెళ్లకుండానే పంట ధర తెలుసుకునేంత వెసులుబాటుని రైతుకి ఇచ్చింది.

కొత్త కొత్తగా..

పింఛను కోసం నెల నెలా గ్రామ కార్యాలయం చుట్టూ తిరిగే బాధని దూరం చేసిన టెక్నాలజీ 2025లో పల్లెని మార్చింది. నగరాన్ని పరీక్షించింది. ఒకటి నెమ్మదిగా ఎదుగుతోంది. మరొకటి వేగంగా అలసిపోతోంది. ఆన్‌లైన్ యాప్‌ల ఇబ్బడిముబ్బడి వినియోగం పల్లెకి చేరి తడిసిమోపడయ్యే ఖర్చు తెచ్చింది. నిత్యావసర ధరలు పెరిగి, ఆదాయాలు లేక గ్రామీణ కుటుంబాలపై ఒత్తిడి పెరిగింది. ఈ పరిస్థితుల్లో పల్లె పొదుపుకి దూరమైంది. నగరం పొదుపు కల కల్లగా మారింది. ఒకప్పుడు పల్లెల్లో పోస్టాఫీసుల వద్ద కనిపించిన క్యూలు, ఇప్పుడు బ్యాంకుల దగ్గర ప్రత్యక్షమవుతున్నాయి. ప్రభుత్వ యాప్‌లు, డ్రోన్ స్ప్రేయింగ్, ఆన్‌లైన్ మార్కెట్లు రైతుకు కొత్త దారులు చూపిస్తున్నాయి. ఊరి చర్చల్లో యాప్‌లు, ఆన్‌లైన్ షాపింగ్ ముచ్చట్లు చేరాయి. గ్రామాల్లో ఫోన్‌పే, గూగుల్ పే లేని ఇల్లు వెతకడం కష్టంగా మారింది. సాంకేతికత పల్లె జీవితంలో ఎన్నో మార్పులు తెచ్చింది. స్మార్ట్ ఫోన్లు వచ్చి గ్రామీణ విద్యార్థుల చదువు కలని మరింత ముందుకు తీసుకెళ్లాయి. అయితే అందరికీ అందుబాటులో లేని ఆర్థికలేమి గ్రామాల్లో ఉంది.

నగరాల్లో కొత్త రూపం..

టెక్నాలజీతో ఈ ఏడాది నగరానికి వేగం పెరిగింది. అయితే ఈ వేగం అలసటని మిగిల్చింది. ఆఫీస్, ట్రాఫిక్, నోటిఫికేషన్ల మధ్య రోడ్ల

మీద నలిగిపోయే నగరజీవి ఇప్పుడు వర్క్‌ఫ్రమ్ హోం పేరుతో ఇంట్లోనే ఒత్తిడికి గురవుతున్నాడు. సాంకేతికత అత్యున్నత స్థాయి 'ఎఐ' ఒకపక్క ఆటోమేషన్ ఉద్యోగాలని సులభతరం చేసింది. మరోపక్క భద్రతపై భయాన్ని పెంచింది. 'పని ఉంది.. కానీ స్థిరత్వం లేని' పరిస్థితుల్లో నగర యువత కొట్టుమిట్టాడుతోంది. ఇంటి అద్దె, స్కూల్ ఫీజులు, వైద్య ఖర్చులతో నగర జీవితం ఖరీదైన కలగా మారింది. మంచి జీతాలు ఉన్నవారికి కూడా నెలాఖరు వచ్చేసరికి దిగులు పట్టుకుంటోంది.

మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ

ఈ ఏడాది మానసిక ఆరోగ్యంపై బహిరంగ చర్చ, కౌన్సిలింగ్, థెరపీ వంటి విషయాలు సగటు మనిషిని ఒంటరితనం, ఒత్తిడి నుండి ఉపశమనం కలిగించేంతగా ప్రభావం చూపాయి. ఆరోగ్యం మీద శ్రద్ధ పెరిగింది. మార్నింగ్ వాక్‌లు, యోగా, ఆర్గానిక్ ఫుడ్ సాధారణ విషయాలుగా మారిపోయాయి. టెక్నాలజీ రాకతోనే ఈ మార్పులు చోటుచేసుకున్నాయి.

ప్రశాంతత లేదు

టెక్నాలజీ 2025కి ఆధునికతని ఇచ్చింది. కానీ ప్రశాంతతని ఇవ్వలేకపోయింది. డిజిటల్ యుగాన్ని సాధారణ జీవితంలోకి తీసుకొచ్చిన ఈ ఏడాది గ్రామాన్ని సాంకేతిక ప్రపంచంలోకి తీసుకుపోతుంటే.. నగరాన్ని ఆ లోకంలో ఊపిరాడనీయకుండా చేస్తోంది. సాంకేతికత చదువుని సులభతరం చేసింది. కానీ అందరికీ సమానంగా అందించలేకపోయింది.

ఆఫీస్ ఇంట్లోకి వచ్చింది. ఇంటి ఒత్తిడి ఆఫీస్‌లోకి తెచ్చింది. ఎక్కడా పని ఆగలేదు. కానీ మనసు అలసిపోతోంది. సౌకర్యం పెరిగి ప్రశాంతత తగ్గింది. డిజిటల్ చెల్లింపులు గ్రామాల్లో ఒక విప్లవంలా దూసుకుపోతున్నాయి. నగరాల్లో నగదు దాదాపు కనిపించని పరిస్థితి వచ్చింది. బైక్, ఆటో, బస్, ట్రైన్ ఏ ప్రయాణసాధనమైనా డిజిటల్ పేమెంట్లతోనే నడుస్తోంది.

పని కోల్పోయిన వారి సంఖ్య పెరుగుతోంది

టాప్ టెక్ కంపెనీల్లో భారీ లేఆఫ్స్ పెరిగాయి. ఈ ఏడాదిలో అమెజాన్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థల్లో 'ఎఐ' పై ఆధారపడుతున్న ఆపరేషన్ల కారణంగా లక్షకి పైగా ఉద్యోగులని తొలగించారు. ఈ లేఆఫ్స్ మధ్యతరగతి జీవితాలని ఛిన్నాభిన్నం చేశాయి. 'ఎఐ' వచ్చి పని వేగాన్ని పెంచింది. కానీ మనిషి స్థానంలో నిలబడి అతనికి పని లేకుండా చేసింది. గ్లోబల్ అధ్యయనాలు, ఉద్యోగ మార్కెట్ నివేదికలు 2025లో వైట్ కాలర్ ఉద్యోగాలని గణనీయంగా తగ్గించినట్లు చెబుతున్నాయి. నైపుణ్యాలు మార్చుకోవడం, కోర్సుల మధ్య జీవితంలా సగటు వ్యక్తి విశ్రాంతి లేని ప్రయాణం చేస్తున్నాడు. పనిచేస్తూ స్కిల్స్ నేర్చుకోవడం, వీకెండ్ కోర్సులు చేయడంతో యువతలో ఆందోళన, ఒత్తిడి పెరుగుతోంది. ఒక్క మాటలో చెప్పాలంటే.. 'ఎఐ' రాకతో అభద్రత పెరిగి విశ్రాంత జీవితానికి ముగింపు పడింది.

'మీ సేవలు ఇక అవసరం లేదు'

'ఎఐ' మీ పనిని మరింత వేగంగా పూర్తిచేయగలదు' అని చెప్పి ఉద్యోగులని తొలగించడం ఈ కాలంలో ఎక్కువైంది. మొత్తంగా చూస్తే.. ఈ ఏడాది టెక్నాలజీ మనల్ని మరింత ముందుకు నడిపించింది. అయితే సాంకేతికత మనల్ని నడిపించకూడదు. మన అవసరాలకి అనుగుణంగా మనమే దాన్ని నడిపించాలి. టెక్నాలజీ మనిషి పనులను సులభతరం చేయాలి. మానవజీవితాన్ని సంతోషమయం చేయాలి. ప్రశాంతతని కోల్పోయేంత వేగాన్ని, అనవసరపు ఆందోళనని పెంచకూడదు. అప్పుడే గడిచిన కాలం నాటి చేదు గుర్తులు రాబోయే ఏడాదిలో పునరావృతం కావు.

మా చిరునామా రంగవల్లి

15 చుక్కలు1 వరకు
సరి చుక్కలు

యం. ధనలక్ష్మి
ఎంఐజి-321, ఎపిహెచ్‌బి
కల్లూరిపల్లి, హౌసింగ్ బోర్డ్ కాలనీ
నెల్లూరు - 524004

మెయిల్ ఐడి : jeevanapageps@gmail.com,
వాట్సాప్ : 83329 25496

గెలుపుతో ముగించాలి

క్లీన్‌స్వీప్‌కు చేరువలో హర్మన్‌ప్రీత్ సేన
నేడు శ్రీలంక మహిళలతో చివరి టి20
రాత్రి 7.00గం॥ల నుంచి

తిరువనంతపురం: తొలి నాలుగు టి20ల్లో నెగ్గిన టీమిండియా మహిళలు ఇక క్లీన్‌స్వీప్‌పై గురిపెట్టారు. శ్రీలంక మహిళలలో జరిగే ఐదు టి20ల సిరీస్‌లో భాగంగా ఇప్పటికే నాలుగు టి20ల్లో గెలిచి 4-0 ఆధిక్యతలో నిలిచిన హర్మన్‌ప్రీత్ సేన.. చివరి మ్యాచ్‌లో గెలిస్తే క్లీన్‌స్వీప్ చేయనుంది. ఐసిసి వన్డే ప్రపంచకప్ చేజిక్కించుకున్న అనంతరం భారత మహిళలజట్టు పటిష్టంగా మారింది. అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్ విభాగాలతోపాటు అన్నిట్లోనూ బలీయంగా ఉంది. బౌలింగ్‌లో రేణుకా సింగ్ ఠాకూర్, దీప్తి శర్మతోపాటు స్పిన్నర్లు వైష్ణవి శర్మ, శ్రీచరణి అదరగొడుతున్నారు. మరోవైపు బ్యాటింగ్‌లో ఓపెనర్ షెఫాలీ వర్మ వరుసగా మూడు టి20ల్లోనూ అర్ధసెంచరీలతో మెరుస్తోంది. ఆదివారం జరిగిన నాల్గో టి20లో అర్ధసెంచరీతో రాణించిన మరో ఓపెనర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన ఫామ్‌లోకి రావడం శుభ పరిణామం. ఇప్పటికే సిరీస్‌ను కైవసం చేసుకున్న భారతజట్టు రెండో మార్పులతో ఐదో టి20లో బరిలోకి దిగనుంది. స్టార్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ స్థానంలో హర్లీన్ డియోల్.. పేసర్ క్రాంతి గాడ్ స్థానంలో అరుంధతి రెడ్డి తుది జట్టులో చోటు దక్కించుకున్నారు. చివరి 3టి20లు జరిగే తిరువనంతపురంలో నాల్గో మ్యాచ్‌లో టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారతజట్టు 20 ఓవర్లలో 2వికెట్ల నష్టానికి 221 పరుగుల భారీ స్కోర్ చేసింది. కానీ శ్రీలంక మహిళలు తొలి మూడు టి20ల్లో చిత్తుగా ఓడినా.. ఈ మ్యాచ్‌లో టీమిండియా నిర్దేశించిన భారీ లక్ష్యానికి చేరువయ్యారు. నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి 6వికెట్లు కోల్పోయి 191 పరుగులు చేశారు. దీంతో కనీసం ఐదో టి20లోనైనా నెగ్గి టీమిండియా చేతిలో వైట్‌వాష్ బారినుంచి తప్పించుకోవాలని చూస్తున్నారు. దీంతో ఇరుజట్ల మధ్య జరిగే ఐదో టి20 హోరాహోరీగా సాగడం ఖాయం.

జట్లు(అంచనా)...

భారత మహిళలు : హర్మన్‌ప్రీత్(కెప్టెన్), మంధాన, షెఫాలీ వర్మ, హర్లీన్ డియోల్, రీచా ఘోష్(వికెట్ కీపర్), దీప్తి శర్మ, అమన్‌జ్యోత్ కౌర్, స్నేహ్ రాణా, వైష్ణవి శర్మ, అరుంధతి రెడ్డి, శ్రీచరణి.

శ్రీలంక మహిళలు : ఆటపట్టు(కెప్టెన్), గుణరత్నే, పెరీరా, సమరవిక్రమ, నీలాక్షి డి-సిల్వ, కవిషా దిల్హారి, కౌశని సత్యంగణా(వికెట్ కీపర్), ఇనోకా రణవీర, మాధర, కావ్య కావింది, శశినీ గిమ్హా.

ఒడిశా చేతిలో ఆంధ్ర ఓటమి

- విజయ్ హాజారే వన్డే టోర్నమెంట్

బెంగళూరు: విజయ్ హజారే వన్డే టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు ఆశించిన స్థాయిలో రాణించలేకపోతోంది. ఈ టోర్నీలో ఆడిన మూడు మ్యాచుల్లో రెండు మ్యాచుల్లో ఓటమిపాలైంది. తొలి మ్యాచ్‌లో ఢిల్లీ చేతిలో, తాజాగా ఒడిశా చేతిలో ఆంధ్రజట్టు పరాజయాన్ని చవిచూసింది. సోమవారం ఒడిశాతో జరిగిన మూడో లీగ్ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు 6వికెట్ల తేడాతో ఓడింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర జట్టు ఒడిశా బౌలర్ల ధాటికి 49.2ఓవర్లలో కేవలం 221 పరుగులకే ఆలౌటైంది. ఆంధ్ర బ్యాటర్లు నాగవరప్రసాద్(66), సౌరభ్ కుమార్(47) మాత్రమే రాణించగా.. ఒడిశా బౌలర్లు బిప్లబ్ సమంత్రే, గోవింద పొద్దార్ మూడేసి వికెట్లతో రాణించారు. ఆ లక్ష్యాన్ని ఒడిశా జట్టు కేవలం 43.4ఓవర్లలో 4వికెట్లు మాత్రమే కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. ముండే(91), గోవింద పొద్దార్(89) బ్యాటింగ్‌లో రాణించారు. ఆంధ్ర బౌలర్లు సత్యనారాయణరాజుకు రెండు, నితీశ్‌కుమార్, మారంరెడ్డికి ఒక్కో వికెట్ దక్కాయి. ఈ ఓటమితో ఆంధ్రప్రదేశ్ జట్టు ఎలైట్ గ్రూప్-డిలో 3మ్యాచుల్లో ఒక గెలుపు, రెండు ఓటములతో సహా కేవలం 4పాయింట్లతో 7వ స్థానంలో ఉంది.

ఖాతా తెరవని హైదరాబాద్

ఎలైట్ గ్రూప్-బిలో హైదరాబాద్ జట్టు వరుసగా మూడో ఓటమిని చవిచూసింది. అస్సాంతో సోమవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ 4వికెట్ల తేడాతో పరాజయంపాలైంది. సౌరాష్ట్ర క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 310 పరుగులు చేసింది. రాహుల్ సింగ్(79), అభిరథ్‌రెడ్డి(54), నితీశ్ రెడ్డి(53) అర్ధసెంచరీలతో రాణించారు. అనంతరం అస్సాం జట్టు మరో 3బంతుల్లో మిగిలి ఉండగానే 314 పరుగులు చేసి విజయం సాధించింది. సికిందర్ రాయ్(112నాటౌట్), సౌరభ్ దిహిగ్యా(91), డేనిస్ దాస్(54) బ్యాటింగ్‌లో రాణించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సికిందర్ రాయ్‌కు దక్కింది. బుధవారం జరిగే నాల్గో లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు సౌరాష్ట్రతో, హైదరాబాద్ జట్టు బరోడాతో తలపడనున్నాయి.

మరికొన్ని మ్యాచ్‌లు ఆడనున్న కోహ్లి..

విజయ్ హజారే ట్రోఫీలో సెంచరీ, అర్ధ శతకంతో మెరిసిన విరాట్.. మరికొన్ని మ్యాచ్‌లు ఆడేందుకు సిద్ధమయ్యాడు. ఈ విషయాన్ని ఢిల్లీ క్రికెట్ సంఘం అధ్యక్షుడు రోహన్ జైట్లీ సోమవారం వెల్లడించాడు. తొలి మ్యాచ్‌లో ఆంధ్రపై సెంచరీ బాదిన కోహ్లి.. రెండో మ్యాచ్‌లో గుజరాత్‌పై 77 పరుగులతో రాణించాడు. ఢిల్లీ జట్టు బుధవారం ఒడిషాతో నాల్గో మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్‌లో కోహ్లి బరిలో దిగే ఛాన్స్ ఉంది. సోమవారం జరిగిన మూడో లీగ్ మ్యాచ్‌లో ఢిల్లీ జట్టు సౌరాష్ట్ర నిర్దేశించిన 321 పరుగుల భారీ లక్ష్యాన్ని మరో 7బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది.

టి20ల్లో భూటాన్ బౌలర్ 8వికెట్లతో రికార్డు పుటల్లోకి..

థింపూ(భూటాన్): టి20ల్లో పెను సంచలనం నమోదైంది. ఈ ఫార్మాట్‌లో తొలిసారి ఒక బౌలర్ ఏకంగా 8వికెట్లు పడగొట్టి చరిత్రపుటల్లోకెక్కాడు. మయన్మార్‌తో సోమవారం జరిగిన మూడో టి20లో భూటాన్ ఎడమచేతి వాటం స్పిన్ బౌలర్ సోనమ్ ఎషే 8వికెట్ల సంచలన ప్రదర్శనతో అదరగొట్టాడు. ఈ మ్యాచ్‌లో సోనమ్ 4ఓవర్లలో కేవలం 7పరుగు లిచ్చి 8వికెట్లు పడగొట్టాడు. ఇందులో ఒక ఓవర్ మెయిడెన్ కూడా ఉంది. సోనమ్ చారిత్రాత్మక ప్రదర్శనతో భూటాన్ జట్టు 82పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భూటాన్ 127 పరుగులు చేయగా.. ఛేదనలో మయన్మార్ 9.2ఓవర్లలో 45పరుగులకే కుప్ప కూలింది. ఈ గెలుపుతో భూటాన్ ఐదు టి20ల సిరీస్‌లో 3-0తో సిరీస్‌ను కైవసం చేసుకుంది.

టి20ల్లో అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు..

సోనమ్ ఏషే(బూటాన్): మయన్మార్‌పై (8/7)
శ్యాజ్రుల్ ఇద్రుస్(మలేషియా) : చైనాపై (7/8)
అలీ దావూద్(బహ్రెయిన్): బూటాన్‌పై (7/19)
హర్ష భరద్వాజ్(సింగపూర్) : మంగోలియాపై (6/3)
పీటర్ అహో(నైజీరియా): సియెర్రా లియోన్‌పై (6/5)
దీపక్ చాహర్(భారత్): బంగ్లాదేశ్‌పై (6/7)

రామారావు కుటుంబానికి

న్యాయం చేయకుంటే ఆందోళన ఉధృతం

- రాయపూడి సిఆర్‌డిఏ కార్యాలయం వద్ద ధర్నాలో సిపిఎం నేత బాబూరావు

సిఆర్‌డిఏ కార్యాలయం వద్ద ధర్నాలో పాల్గొన్న సిహెచ్ బాబూరావు

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

రాజధాని ప్రాంతం, మందడం గ్రామానికి చెందిన రైతు దొండపాటి రామారావు కుటుంబానికి న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించినప్పటికీ ఎలాంటి పరిహారమూ అందలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు అన్నారు. రామారావు కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని, రాజధాని రైతులు, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో రాజధాని అమరావతిలోని రాయపూడి సిఆర్‌డిఏ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ, రామారావు కుటుంబానికి న్యాయం చేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మూడేళ్లలో చేస్తామని చెప్పి 11 ఏళ్లయినా ప్లాట్ల అభివృద్ధి జరగలేదని, తొలివిడత ఇచ్చిన భూములను అభివృద్ధి చేయకుండా మలివిడత భూ సమీకరణకు ప్రభుత్వం సిద్ధం కావడం లాంటి చర్యలు రైతులను అందోళనకు గురి చేస్తున్నాయని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 11 ఏళ్ల తరువాత జరీబు భూముల నిర్ధారణకు కమిటీ ఏర్పాటు సిగ్గుచేటన్నారు. ఎన్నికలకు ముందు మాట మాత్రం చెప్పకుండా, అధికారంలోకి రాగానే మళ్లీ 44 వేల ఎకరాల భూములు సమీకరిస్తామని ప్రకటించడం రైతులను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోందని తెలిపారు. భూములిచ్చిన రైతులకు బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదని, బడా కంపెనీలకు మాత్రం భూములు, రుణాలు దక్కుతున్నాయని అన్నారు. వాగులు, చెరువుల్లో ప్లాట్లు, బడా కంపెనీలకు మాత్రం సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన ఇస్తారా.. ఇదే రామారావు ఆవేదనకు కారణమని తెలిపారు. రామారావు మరణాన్ని కొందరు రాజకీయం చేస్తున్నారని జరుగుతున్న ప్రచారాన్ని బాబూరావు ఖండించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో రైతులు మరణిస్తే ఆందోళనలు చేయలేదా.. వారు చేస్తే న్యాయం... ఇంకొకరు చేస్తే రాజకీయమా.. అని ప్రశ్నించారు. భూములను తీసుకోవాల్సిన అనివార్య పరిస్థితుల్లో రోడ్ల నిర్మాణానికి ఇళ్లు, గుడులు తొలగించకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూడాలని, రైతులు కోరుతున్న చోట ఇళ్ల ప్లాట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం సిఆర్‌డిఏ అదనపు కమిషనర్ ఎ.భార్గవ తేజకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం రాజధాని కార్యదర్శి ఎం.రవి, నాయకులు జొన్నా శివశంకరరావు, రైతు సంఘం నాయకులు కంచుమాటి అజయ్ కుమార్, బూరుగ వెంకటేశ్వర్లు, మృతి చెందిన రైతు కుటుంబ సభ్యులు చుండూరు నరేంద్ర పాల్గొన్నారు.

కార్గో ఎయిర్‌పోర్టు ప్రతిపాదనలు రద్దు చేయాలి

- జనవరి 7 నుంచి 13 వరకు గ్రామాల్లో ప్రతిజ్ఞ
- 14న భోగి మంటల్లో ప్రతులు దహనం

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - పలాస (శ్రీకాకుళం జిల్లా)

కార్గో ఎయిర్‌పోర్టు ప్రతిపాదనలు రద్దు చేయాలని, బలవంతపు భూసేకరణ ఆపాలని కార్గో కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ డిమాండ్ చేసింది. జనవరి 7 నుంచి 13 తేదీ వరకు గ్రామాల్లో 'మా ఊరు, మా భూములు కాపాడుకుంటాం' అంటూ ప్రతిజ్ఞ పూనాలని, 14వ తేదీన కార్గో ఎయిర్‌పోర్టు ప్రతిపాదిత గ్రామాల్లో పత్రాలను భోగి మంటల్లో వేసి దహనం చేయాలని పిలుపునిచ్చింది. పోరాట కమిటీ అధ్యక్షులు కొమర వాసు అధ్యక్షతన శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో సోమవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ కార్యదర్శి జోగి అప్పారావు, సిపిఎం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, లిబరేషన్ జిల్లా సహాయ కార్యదర్శి మద్దిల రామారావు, రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె మోహనరావు, జనశక్తి నాయకులు కె రమేష్ మాట్లాడారు. కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో పచ్చని ఉద్దాన ప్రాంతాన్ని ఎందుకు విధ్వంసం చేసేందుకు పూనుకుంటున్నారని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుని ప్రశ్నించారు. మూడుసార్లు ఎంపిగా, ప్రస్తుతం కేంద్ర మంత్రిగా ఉన్న ఆయన ఉద్దానంలో కిడ్నీ వ్యాధుల నివారణ కోసం ఏ రోజైనా చర్యలు తీసుకున్నారా అని ప్రశ్నించారు. జీడికి గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతాంగం తీవ్ర దోపిడీకి గురవుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. జీడి బోర్డు ఏర్పాటు చేసి, ఆయా రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి చివర భూములకు సాగునీరు ఇస్తామని చెప్పి గుక్కెడు నీళ్లైనా ఇవ్వలేకపోయారని, అలాంటి వారు అభివృద్ధి కోసం మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కాకరాపల్లిలో ముగ్గురిని బలిగొని 2020 ఎకరాలు సేకరించి ఎంత అభివృద్ధి చేశారో, ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పోరాట కమిటీ నాయకులు జుత్తు భూపతి, పౌర హక్కుల సంఘం నాయకులు పత్తిరి దానేషు, ఎన్ పరుశురాం, బి సాంబమూర్తి, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులకు, స్వేచ్ఛకు విఘాతం

వైసిపి లీగల్‌సెల్ అధ్యక్షులు మనోహర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పౌరుల హక్కులు, స్వేచ్ఛను కూటమి ప్రభుత్వం హరిస్తోందని, అంబేద్కర్ రాజ్యాంగం అమలు కావడం లేదని వైసిపి లీగల్ సెల్ అధ్యక్షులు మనోహర్‌రెడ్డి అన్నారు. తాడేపల్లి లోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. పౌరుల గోప్యతను పోలీసులు హరించడం సుప్రీంకోర్టు తీర్పునకు పూర్తి విరుద్ధమని చెప్పారు. దీనిపై న్యాయపోరాటం చేస్తామని అన్నారు.

టిడిపి నాయకులకు వర్తించవా : అవుతు

రోడ్లపై జంతు బలులు చేస్తే ఊరుకోబోమని హోమ్‌మంత్రి వంగలపూడి అనిత చెప్పిన మాట తెలుగుదేశం నాయకులకు వర్తించదా అని వైసిపి ఆర్‌టిఐ విభాగం అధ్యక్షులు అవుతు శ్రీధర్‌రెడ్డి ప్రశ్నించారు. టిడిపి నాయకుల పుట్టినరోజు వేడుకల్లో జంతు బలులు ఇచ్చారని, పొట్టేళ్ల తలకాయలతో దండలు వేశారని, వారికి ఈ కేసులు ఎందుకు వర్తించవో చెప్పాలని అన్నారు. వైసిపి కార్యకర్తలను వేధించాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం ఇలాంటి చర్యలకు దిగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సంపాదకీయం

అమరావతిలో విషాదం

రాజధాని అమరావతికి భూములిచ్చిన రైతుల గోసకు దశాబ్దం దాటినా ఏలికల నుంచి సరైన భరోసా లభించకపోవడం అతి పెద్ద విషాదం. తమ చెంత రాజధాని అవతరించి తాము అభివృద్ధి చెందుతామని ఈ ప్రాంత రైతులు ఎంతగానో ఆశపడగా, పాలకుల నిర్లక్ష్యం వలన వారి బతుకులు దినదినగండం నూరేళ్ళాయుష్షు అన్న చందంగా తయారవడం ఆందోళన కలిగిస్తుంది. ఆ కొనసాగింపే తుళ్లూరు మండలం మందడం గ్రామంలో ఎన్-8 రోడ్డు విస్తరణలో తన ఇల్లు పోతుందని ఆవేదన చెందిన రైతు దొండపాడు రామారావు హఠాన్మరణం. శుక్రవారం సిఆర్‌డిఎ కాంపిటెంట్ అథారిటీ కార్యాలయంలో మున్సిపల్ మంత్రి, స్థానిక ఎంఎల్‌ఎ, అధికారులు నిర్వహించిన సమావేశానికి సదరు రైతు వెళ్లి తన గోడు వెళ్లబోసుకుంటూ అక్కడే కుప్పకూలిపోయారు. చనిపోయిన రైతు రాజధానికి గతంలో తన రెండెకరాలూ ఇవ్వగా, వాగు ముంపు ప్రాంతంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయ ప్లాటు కేటాయించింది. ఆ అనుభవంతో ప్రస్తుత రోడ్డు విస్తరణలో తన ఇల్లు పోతే తన గతేంటని ఆందోళన చెందారు. ఎక్కడో కాకుండా సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన తమకు ఇల్లివ్వాలని అభ్యర్థించారు. కుదరదని తెగేసి చెప్పడంతో గుండెలదిరి స్పాట్‌లోనే ప్రాణాలు విడిచి ప్రభుత్వ కర్కశానికి బలయ్యారు.

గత టిడిపి, తర్వాతొచ్చిన వైసిపి, ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వాలు రాజధాని రైతుల పట్ల అనుసరిస్తున్న తప్పుడు విధానాలు, తీవ్ర నిర్లక్ష్యం రైతు రామారావు మరణంతో మరొకసారి బయట పడింది. భూములిచ్చిన రైతుల త్యాగాన్ని స్తుతించడమే తప్ప వారు పడుతున్న ఇబ్బందులకు, లేవనెత్తుతున్న అభ్యంతరాలకు, వినతుల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి నిర్దిష్ట చర్యల్లేవు. అందుకు ఎన్-8 రోడ్డు విస్తరణ బాధితులే ఉదాహరణ. ఇప్పటికి మూడు భేటీలు వేసిన మున్సిపల్ మంత్రి ఇళ్లు కోల్పోతున్న బాధితుల మాట చెవికెక్కించుకోలేదు. ఈ ఒంటెత్తు పోకడ వల్లనే రైతు నిండు ప్రాణం మంత్రి చూస్తుండగానే పోయింది. చనిపోయిన రైతు కుటుంబానికి సాయపడాలని స్వయాన ముఖ్యమంత్రి ఆదేశించగా, అందులోనూ నిర్లక్ష్యమే. అంతేనా, చనిపోయిన రైతుకు సక్రమంగానే ప్లాటిచ్చాం, రోడ్డు విస్తరణకు అంగీకరించాడు, తమ తప్పేమీ లేదు, తప్పంతా రైతుదేనని నెపం వేసి ప్రకటనలు చేయడం గర్హనీయం. అన్నీ బాగుంటే చనిపోవడం రైతులకేమన్నా సరదానా? గ్రామ కంఠాలు, ముంపు, రుణ సదుపాయం వంటి అభ్యంతరాలు రాలేదనడం పచ్చి అబద్ధం. మొదట టిడిపి సర్కార్ రాజధానికి భూములివ్వాలని రైతులను చాలా చోట్ల నయాన భయాన బలవంతపెట్టగా అప్పుడూ కొంత మంది రైతుల గుండెలాగాయి. అనంతరం వైసిపి ఎత్తుకున్న మూడు రాజధానులతో ఇంకొందరి గుండెలు కొట్టుకోలేదు. ఇప్పుడేమో, ఒక వైపు ప్రత్యామ్నాయ ప్లాట్లు అందక మరోవైపు రోడ్లు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో తమ ఇళ్లు, భూములు కోల్పోవాల్సి వస్తుందని రైతుల గుండెలాగుతున్నాయి. ఆ పర్యవసానంగా స్థానికుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది.

అమరావతి కథకు ముగింపు లేకుండా చేస్తున్నది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే. విభజన చట్టంలో పేర్కొన్నట్లు రాజధానికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన మోడీ ప్రభుత్వం నిధులివ్వకుండా రాష్ట్రాన్ని తన తిప్పలు తాను పడమంటోంది. బాహుబలి రాజధానిని తలకెత్తుకున్న టిడిపి సర్కార్, నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి చేయట్లేదు సరికదా, కేంద్రం సూచనల మేరకు అప్పులబాట పట్టింది. ఈ లాలూచీ ఉండగానే... ఇప్పటికే అమరావతికి 33 వేల ఎకరాలను సమీకరించిన టిడిపి, రెండవ దశలో మరో 20 వేల ఎకరాలను సమీకరిస్తోంది. అవసరమైతే ఇంకో 20 వేల ఎకరాలంటోంది. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించాలని రైతులు నిలదీస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టత ఇవ్వడంలేదు. రోడ్లు, ప్రాజెక్టుల పేరిట ఇళ్లు, భూములు కోల్పోయే రైతులకు వారు కోరుకున్న చోట ప్రత్యామ్నాయాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత. సాధ్యమైనంత వరకు ఇళ్లు, భూములకు నష్టం జరక్కుండా ప్రత్యామ్నాయాలు అన్వేషించాలి. తప్పని పరిస్థితి అయితే ఉదారంగా నష్టపరిహారం చెల్లించాలి. బాధితులకు సంతృప్త స్థాయిలో పరిష్కారాలు చూపకుండా ఇళ్లు, భూములు లాక్కోవడం ప్రజాస్వామ్య ప్రభుత్వాలకు తగదు. ముందుకేనంటే... ప్రజాగ్రహం తప్పదు.

మంచి మాట



అత్యధిక శాతం జనాభా నిరుపేదలుగా వున్న సమాజం వర్ధిల్లదు. అటువంటి సమాజంలో సుఖశాంతులు పరిఢవిల్లవు.

- ఆడమ్ స్మిత్

Adam Smith

భారత రాజ్యాంగం మీద దౌర్జన్యపూరిత దాడి

ప్రభాత్ పట్నాయక్

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కన్నా ముందు వివిధ రాష్ట్రాల్లో చాలా రకాల ఉపాధి పథకాలు అమలు అవుతూ వుండేవి. అయితే అవి చాలా పరిమితంగా ఉండేవి. వాటికి ఆర్థిక వనరుల లేమి కూడా ఉండేది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2005లో వచ్చినప్పుడు అది దేశమంతటా ఒకే విధంగా అమలు జరిగేలా, ఉపాధి అవసరమైన వారికందరికీ వర్తించేలా రూపొందింది. దానికి నిధులు సమకూర్చే బాధ్యత కేంద్రం వహించింది. ప్రతీ ఇంటికీ ఒకరికి ఏడాదిలో కనీసం 100 రోజులు పని దొరికేలా ఈ పథకం రూపొందింది. ఒకవేళ అలా పని చూపలేకపోతే, పని కల్పించాలని కోరిన వ్యక్తికి ప్రభుత్వమే పరిహారం చెల్లించాలి. ఇలా కోరినవారికందరికీ పని ఒక హక్కుగా కల్పించే పథకం రూపొందింది. ప్రజలకు పని ఒక హక్కుగా ఈ పథకం ప్రవేశపెట్టింది. భారత రాజ్యాంగం ఆర్థిక హక్కులను ప్రాథమిక హక్కులుగా కాక, ఆదేశ సూత్రాలలో చేర్చింది. వాటిని ఆచరించే దిశగా నడవాలని మాత్రం ప్రభుత్వాలను నిర్దేశించింది. ఉపాధి హామీ పథకం ఈ లోపాన్ని సరిదిద్ది, పాక్షికంగానైనా, రాజ్యాంగం దార్శనికతకు అనుగుణంగా ముందడుగు వేసింది.

ఈ ఉపాధి హామీ పథకం గురించి నెలల తరబడి బహిరంగ వేదికల మీద చర్చలు నడిచాయి. ఒక పార్లమెంటరీ కమిటీ అనేక తరగతుల ప్రజలనుండి అభిప్రాయాలను స్వీకరించింది. చివరికి అనేక అంశాలమీద ఏకాభిప్రాయం కుదిరాక ఈ చట్టం ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. ఆ విధంగా ఈ చట్టం మన దేశ ప్రజల దృఢ నిశ్చయాన్ని ప్రతిబింబించింది. రాజ్యాంగం ఊహించిన ఒక హక్కును ప్రజలకు వాస్తవంగా కల్పించింది. ఇటువంటి చట్టాన్ని రద్దు చేయడం అంటే అది రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించడమే ఔతుంది. సాంకేతికపరంగా కాకపోవచ్చు కాని రాజ్యాంగ స్ఫూర్తి ప్రకారం ఇది రాజ్యాంగ ఉల్లంఘనే.

ఈ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడినది స్వయంగా ఎన్డీయే ప్రభుత్వమే. పార్లమెంటులో మూజువాణి ఓటు ద్వారా ఒక తీర్మానాన్ని ఆమోదించి ఏకంగా ప్రజలకు సంక్రమించిన ఒక హక్కునే కాలరాసింది. ఇది పూర్తిగా దౌర్జన్యపూరిత చర్య. తాను పూనుకుంటున్నది ఎంతటి అనుచితమైన చర్యో కేంద్రానికి గ్రహింపు ఉన్నట్టుంది. అందుకే గుట్టుచప్పుడు కాని పద్ధతిలో డిసెంబర్ 15న మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టం స్థానంలో మరొక చట్టాన్ని ప్రతిపాదించింది. 17వ తేదీ రాత్రి దానిమీద చర్చించింది. 18న మూజువాణి ఓటుతో దానిని ఆమోదించింది. కనీసం పార్లమెంటరీ కమిటీకి కూడా నివేదించడానికి అంగీకరించలేదు. నిజానికి గ్రామీణ వ్యవహారాల పార్లమెంటరీ కమిటీ చైర్‌పర్సన్ అలా నివేదించమని రాతపూర్వకంగా కోరారు కూడా. కాని దానిని తిరస్కరించింది ప్రభుత్వం. పైగా ఆ బిల్లుకు ఎటువంటి సవరణలూ ప్రతిపాదించడానికి కూడా అనుమతించలేదు. ఇది చాలా ఆశ్చర్యకరం. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం మీద పెద్ద దాడి. దీనిని బట్టి చూస్తే ప్రజలకు సంబంధించి ఎటువంటి హక్కునైనా, అది రాజ్యాంగబద్ధంగా వారికి సంక్రమించినా, దానిని ఏ క్షణంలోనైనా పార్లమెంటులో ఒక మూజువాణి ఓటుతో రద్దు చేసేయవచ్చు అన్నమాట! ఎంత అన్యాయం!

తనదైన శైలిలో ఇప్పుడు ప్రభుత్వం ఈ కొత్త చట్టంలో ఉన్న అంశాల గురించి సాధ్యమైనంత గందరగోళాన్ని సృష్టించే పనిలో రాత్రీపగలూ తలమునకలై వుంది. కొత్త చట్టం ఏడాదికి 125 రోజులు పని కల్పించే విధంగా రూపొందింది కనుక ఇది మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టం కన్నా గొప్పది అని చెప్పుకుంటోంది. ఈ 25 రోజుల పని అనేది మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టం కల్పించిన 100 రోజులకి అదనంగా కాదు. అందులో పని కల్పించమని కోరిన వారందరికీ పని ఒక హక్కుగా కల్పించారు. ఇప్పుడు కొత్త చట్టంలో పని కల్పించడం అనేది కేంద్ర ప్రభుత్వపు హక్కుగా మారిపోయింది. ఇప్పుడు పని కల్పించాలా వద్దా అన్నది కేంద్రం ఇష్టం.

మొదటిది: ఇంతవరకూ గ్రామీణ భారతంలో ఎక్కడ ఉన్నవారికైనా కోరితే పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. కొత్త చట్టం ప్రకారం కేంద్రం ఎంచుకున్న కొన్ని ప్రాంతాలలో మాత్రమే పని కల్పిస్తారు. అంటే ప్రతీ గ్రామీణ కుటుంబానికీ కనీసం ఒక 100 రోజుల పాటు పని కల్పించాలన్న నియమం ఇప్పుడు ఎగిరిపోయింది. అందుచేత అదనంగా మరో 25 రోజులు కల్పించడం అన్న ప్రసక్తి ఎక్కడుంటుంది? ఆ 100 రోజుల పనికే దిక్కు లేకుండా చేశారు.

రెండవది: కొత్త పథకం ప్రకారం రాష్ట్రాలకు ఎంతెంత నిధులు ఇవ్వాలన్నది కేంద్రం నిర్ణయిస్తుంది. అంతే తప్ప పాత చట్టంలో మాదిరిగా ఏ రాష్ట్రంలో ఎంతమంది పనులు కల్పించాలని కోరితే అందరికీ నిధులు ఇచ్చే ప్రసక్తి లేనే లేదు.

మూడవది: ఇప్పుడు రాష్ట్రాలు 40 శాతం నిధులు ఇస్తే ఆ తర్వాత కేంద్రం 60 శాతం నిధులను మంజూరు చేస్తుంది. పాత చట్టంలో 90 శాతం నిధులను కేంద్రం భరించేది. పైగా ఎంత మొత్తంలో నిధులు ఇవ్వాలన్నది ఎందరు పనులు కల్పించాలని కోరారు అన్నదానిని బట్టి ఉండేది. ఇప్పుడు అలా కాదు. ఉదాహరణకి ఒక రాష్ట్రం తన దగ్గర నిధుల కొరత ఉన్న కారణంగా, తాను కల్పించాల్సిన రూ.40కి బదులు రూ.20 మాత్రమే అందించగలిగిందనుకోండి. అప్పుడు కేంద్రం ఇచ్చేది కూడా రూ.60కి బదులు వెంటనే రూ.30కి తగ్గిపోతుంది. అంటే సగానికి సగం ఎగిరిపోయిందన్నమాట. ఇది పథకాన్ని పూర్తిగా దెబ్బ తీస్తుంది. అంతేకాదు, ఇప్పుడు కేంద్రం తప్పుకోడానికి ఓ సాకు దొరికింది. రాష్ట్రం కేటాయించవలసిన వాటా కేటాయించలేకపోయింది కనుక తానూ మంజూరు చేయడం సాధ్యపడలేదని చెప్పి తప్పంతా రాష్ట్రం మీదకే నెట్టేయవచ్చు.

అందుచేత పని రోజులను 125కి పెంచినట్టు చెప్పుకోవడంలో అర్థం లేదు. కొత్త పథకం పని కావాలని కోరుకున్నవారందరికీ పని గ్యారంటీ చేసేది కాదు. పాత చట్టం ఒక హక్కుగా కల్పించినదానిని ఈ కొత్త చట్టం రద్దు చేస్తోంది.

ఎన్డీయే ప్రభుత్వం రాజ్యాంగం మీద చేస్తోన్న దాడి కేవలం ఒక హక్కును రద్దు చేయడానికే పరిమితం కాలేదు. అది ఫెడరలిజం మీద కూడా దాడి చేస్తోంది. రాష్ట్రాలన్నీ ఆర్థిక వనరుల కొరతతో ఇబ్బందులు పడుతున్న సంగతి కేంద్రానికి బాగా తెలుసు. కాని, ఉన్నట్టుండి ఊడిపడ్డట్టుగా, రాష్ట్రాలను ఏమాత్రమూ ముందుగా సంప్రదించకుండానే, ఏకపక్షంగా రాష్ట్రాల వాటాను ఏకంగా 40 శాతానికి పెంచేసింది! ఇంతవరకూ అది 10 శాతం మాత్రమే ఉండేది. అంతేకాదు, ఏ రాష్ట్రంలో ఈ పథకం కింద ఎంత ఖర్చు చేయాలో అది కూడా ఇప్పుడు కేంద్రమే నిర్ణయించబోతోంది. కేంద్రం నిర్దేశించినదానికన్నా ఎక్కువగా ఖర్చు చేయాలని ఏ రాష్ట్రమైనా అనుకుంటే దానికి కూడా కేంద్ర అనుమతి కావలసిందే.

అంటే ఉన్నట్టుండి రాష్ట్రాలు అదనంగా ఖర్చు భరించాల్సి వస్తోంది. అంతేగాక, ఈ పథకానికి సంబంధించి కేంద్రం నిర్ణయించినట్టుగా మాత్రమే రాష్ట్రాలు ఖర్చు చేయాలి. అంటే రాష్ట్రాలకు ఇక ఏ స్వంత ప్రతిపత్తీ లేదన్నమాట. అవి కేవలం కేంద్రానికి లొంగివుండే సామంతుల మాదిరిగా నడుచుకోవాలన్నమాట. ఫెడరలిజం గురించి రాజ్యాంగం నిర్దేశించినదానికి ఇది పూర్తి విరుద్ధం.

రాష్ట్రాల పాత్ర మాత్రమే కాదు, స్థానిక సంస్థల పాత్రను కూడా కొత్త చట్టం కుదించి వేస్తోంది. ఇంతవరకూ పాత చట్టం ప్రకారం ఉపాధి హామీ పనులను స్థానిక సంస్థలు ప్లాను చేసేవి. ఇప్పుడు ఎలా చేయాలో వాటిని కేంద్రమే ఆదేశించబోతోంది. ఇది 73వ రాజ్యాంగ సవరణ రూపొందించిన ప్రజాస్వామిక వికేంద్రీకరణకు పూర్తి విరుద్ధం.

దేశంలో కడుపేదలు గ్రామాల్లోనే ఉన్నారు. వారి మీద ఈ కొత్త చట్టం రూపంలో దాడి జరుగుతోంది. అంతేగాక భారత రాజ్యాంగం మీద బహుముఖ దాడిగా ఇది జరుగుతోంది. పేదలమీద జరిగే ఈ దాడి ప్రభావం స్పష్టమే. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం గ్రామాల్లో లక్షలాది మంది పేదల ప్రాణాలను నిలబెట్టిన పథకం. మరీ ముఖ్యంగా కరోనా మహమ్మారి కాలంలో వేలాదిమంది వలస కార్మికులు పనులను పోగొట్టుకుని గ్రామాలకు ఈసురోమంటూ కాలినడకను చేరుకున్నప్పుడు వారు ఆ గ్రామాల్లో బతకగలిగారంటే కేవలం అది ఈ పాత చట్టం వల్లే. అటువంటి చట్టం కల్పించిన హక్కు మీద ఇప్పుడు దాడి చేయడం అంటే అది మొత్తం రాజ్యాంగం మీద దాడి చేయడమే.

పాత చట్టం రద్దు అవడంతో ఇంతవరకూ తమకు హక్కు ఉందన్న ఆత్మగౌరవంతో బతికిన గ్రామీణ పేదలు ఇకముందు కేంద్రం దయాదాక్షిణ్యాల మీద అడుక్కునేవారి మాదిరిగా ఆధారపడాలన్నమాట. వాళ్ళ పరిస్థితి మరీ దయనీయంగా మారిపోతే అప్పుడు బహుశా కేంద్రం ముందుకువచ్చి వారికేదో కొంత సాయం చేయవచ్చు. అది కూడా నరేంద్ర మోడీ గారి ఫొటోలతో. ఏం చేసినా ఆ పేదల పరిస్థితి పాతచట్టం ఉన్నప్పుడు మాదిరిగా ఇకముందు ఉండదు కదా. పైగా ఈ దిగజారిన పరిస్థితికి వారంతా నరేంద్ర మోడీ గారికి రుణపడి వుండాలన్నమాట! ఇలా పౌరుల్ని ముష్టివాళ్ళ స్థితికి దిగజార్చడం అనేది అన్ని ఫాసిస్టు మూకల అంతిమ లక్ష్యంగా ఉండేదే. ఎందుకంటే వాళ్ళు ఒక మహా నేతను సృష్టించి అతడినే ఆరాధిస్తూ ప్రజలంతా బతకాలని కోరుకుంటారు. మరి ముష్టివాళ్ళు అయినప్పుడే కదా ఆ మహా నేతను ప్రజలు దేబిరించి 'మహాప్రభూ' అంటూ అడుక్కునేది?

రాజ్యాంగం మీద దాడి కూడా ఈ క్రమంలో అంతర్భాగమే. మన రాజ్యాంగం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటం నుండి వచ్చింది. అది ప్రజలు ఈ దేశానికి సర్వాధికారులు అని పేర్కొంది. ఏ ప్రభుత్వమైనా రాజ్యాంగం ప్రకారం ఈ ప్రజలకే సేవ చేయాల్సి వుంది. కాని ఫాసిస్టులు ఆ ప్రజలే తమ నాయకుడికి సేవ చేసేవారిగా ఉండాలని కోరుకుంటారు. అతడినే మళ్ళీ మళ్ళీ ఎన్నుకుంటూ వుండాలని కూడా కోరుకుంటూ వుంటారు. అది జరగాలంటే ప్రజలకున్న హక్కులన్నీ ఒక్కొక్కటిగా రద్దవుతూ వుండాలి. ఏ హక్కులూ లేకుండా ప్రజలందరూ తమ మహా నేతను కొద్దిపాటి దయ చూపమని ప్రాధేయపడుతూ వుండాలి. ఈ విధంగా జరగాలంటే, ప్రజాస్వామ్య వ్యవస్థ నుండి నియంతృత్వ దశగా మారాలంటే, రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడం అందులో ఒక భాగమే. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని, అంటే ప్రపంచంలోనే అతి పెద్ద ఉపాధి పథకాన్ని రద్దు చేయడం అనేది ఈ దిశగా పడిన ఒక పెద్ద ముందడుగు!

(స్వేచ్ఛానుసరణ)

> మన రాజ్యాంగం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటం నుండి వచ్చింది. అది ప్రజలు ఈ దేశానికి సర్వాధికారులు అని పేర్కొంది. ఏ ప్రభుత్వమైనా రాజ్యాంగం ప్రకారం ఈ ప్రజలకే సేవ చేయాల్సి వుంది. కాని ఫాసిస్టులు ఆ ప్రజలే తమ నాయకుడికి సేవ చేసేవారిగా ఉండాలని కోరుకుంటారు. అతడినే మళ్ళీ మళ్ళీ ఎన్నుకుంటూ వుండాలని కూడా కోరుకుంటూ వుంటారు. అది జరగాలంటే ప్రజలకున్న హక్కులన్నీ ఒక్కొక్కటిగా రద్దవుతూ వుండాలి. ఏ హక్కులూ లేకుండా ప్రజలందరూ తమ మహా నేతను కొద్దిపాటి దయ చూపమని ప్రాధేయపడుతూ వుండాలి. ఈ విధంగా జరగాలంటే, ప్రజాస్వామ్య వ్యవస్థ నుండి నియంతృత్వ దశగా మారాలంటే, రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడం అందులో ఒక భాగమే. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని, అంటే ప్రపంచంలోనే అతి పెద్ద ఉపాధి పథకాన్ని రద్దు చేయడం అనేది ఈ దిశగా పడిన ఒక పెద్ద ముందడుగు!

డేటా బ్యాంక్‌లతో జనజీవన విధ్వంసం

వెన్నెలకంటి రామారావు

'కృత్రిమ మేధ' విప్లవం భూగోళాన్ని వేగంగా కమ్ముకుంటోంది. దాన్ని బలోపేతం చేసేందుకు సాగుతున్న గ్లోబల్ పరుగులో అగ్రభాగాన నిలిచేందుకు ఇండియా చేస్తున్న ప్రయత్నంలో భాగంగా, అందుకవసరమైన భారీ డేటా సెంటర్ల నిర్మాణం కోసం రాష్ట్రాలు పోటీ పడుతున్నాయి. ఇప్పటికే నీటి కొరతలో కొట్టుమిట్టాడుతున్న ప్రాంతాల్లో డేటా సెంటర్లు నెలకొల్పుతున్నారు. దీనివల్ల దేశంలో డిజిటల్ బూమ్‌కు సమాంతరంగా నీటి కరవు తాండవిస్తుందనే ఆందోళనలు పెరుగుతున్నాయి. ఈ డిజిటల్ వికాసం జనజీవన వినాశనానికి దారితీస్తోంది. ఆసియాలో మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిన ఇండియా అంతర్జాతీయ డేటా సెంటర్ల ఏర్పాటుకు కూడలిగా మారబోతోంది. ఆ క్రమంలో రాష్ట్ర పాలకులు, ప్రభుత్వం అభివృద్ధి పేరుతో చట్టాలు, నిబంధనలు పాటించని అనేక పరిశ్రమలను (రోగ్ ఇండస్ట్రీస్) ప్రజల పన్నుల సొమ్ముతో అనేక రాయితీలు కల్పించి ఏర్పాటు చేస్తున్నారు. ప్రజా జీవనాన్ని, ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని ఫణంగా పెట్టి కార్పొరేట్ కేంద్రిత ఆర్థిక, ద్రవ్య విధానాలను కేంద్రం దన్నుతో అమలు చేస్తుండడం రాష్ట్ర ప్రజలకు శాపంగా పరిణమించనుంది. కాలుష్య కారక, కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను కలిగించే ఘన, ద్రవ, వాయు వ్యర్థాలను యథేచ్ఛగా వెదజల్లే ఫ్యాక్టరీలకు విచ్చలవిడిగా అనేక రుణాలు, సబ్సిడీలు, మౌలిక వసతుల కల్పనతో రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోవడమనే లక్ష్యంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం...వాతావరణ ప్రతికూల ప్రభావాలను కల్గించే, ప్రాథమికంగా పెద్దఎత్తున విద్యుత్‌ను, నీటిని వినియోగిస్తూ, వేడిని, ఈ-వ్యర్థాలను వెదజల్లుతూ స్థానిక వనరులు ధ్వంసం చేసే, కర్బన ఉద్గారాలను అరాచకంగా వెదజల్లే...నీటి కరువు, తీవ్ర శీతోష్ణస్థితి మార్పులు, మానసిక, శారీరక రుగ్మతలతో ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే...అత్యంత ప్రమాదకరమైన ఈ కేంద్రాల నిర్మాణం క్షమించరాని దారుణం. 2030 నాటికి 6 గిగావాట్ సామర్థ్యంగల డేటా సెంటర్ల ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే 7 డేటా సెంటర్లు రాష్ట్రంలో నడుస్తున్న వాటికి తోడుగా, వైజాగ్ కేంద్రంగా గూగుల్, రిలయన్స్, సిఫీ కార్పొరేట్ సంస్థలు పెద్ద ఎత్తున డేటా కేంద్రాలను నిర్మాణం చేపట్టనున్నాయి. అదే విధంగా విజయవాడ సమీపంలోని ఐ.టి పార్క్‌లో 60 మెగా వాట్ల సామర్థ్యంగల డేటా సెంటర్లను 'పై డేటా సెంటర్స్' అనే సంస్థ ఒక హబ్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ డేటా సెంటర్ల నిర్మాణం ద్వారా ఉపాధి అవకాశాలను కల్పిస్తామని, ఆర్థికాభివృద్ధిని తీసుకొస్తామని పాలకులు గోబెల్స్ ప్రచారం చేస్తూ ప్రజల్ని మభ్యపెడుతున్నారు.

ఇండియాలో డేటా సెంటర్ మార్కెట్ విజృంభిస్తోంది. 130-153 డేటా సెంటర్లు దేశవ్యాప్తంగా 31 ప్రాంతాల్లో విస్తరించడమే కాకుండా, రాబోయే కొన్ని సంవత్సరాల్లో ఆ సంఖ్య రెట్టింపు కావొచ్చుననే అంచనాలు జోరుగా సాగుతున్నాయి. మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఎన్.టి.టి గ్లోబల్ సెంటర్లు, టెలీ మీడియా గ్లోబల్, ఐరన్ మౌంటైన్, ఈక్వినాక్స్ అనే గ్లోబల్ డేటా సెంటర్ల ఆపరేటర్లు, కంట్రోల్ ఎస్, పై డేటా సెంటర్లు, బి.ఎస్.ఎన్.ఎల్ (నెక్స్ట్ జెనరేషన్ ఇన్ఫినైట్), వెబ్ వర్క్స్, ఎయిర్‌టెల్, అదానీ కనెక్స్, సిఫీ టెక్నాలజీలస్ అనే జాతీయ సంస్థలు డేటా సెంటర్లను నడుపుతున్నాయి. కొత్తగా గూగుల్ (అదానీ కనెక్స్ సహకారంతో), టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, రిలయన్స్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థలు కొత్తగా భారీ డేటా సెంటర్ల ఏర్పాటుకు రంగం సిద్ధం చేసుకున్నాయి. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రాయితీలతో అత్యంత ప్రమాదకర డేటా సెంటర్ల ఏర్పాటు కోసం పోటీ పడుతున్న వాటిలో ఆంధ్రప్రదేశ్ అగ్రభాగాన నిలిచేందుకు దారుణమైన రీతిలో ప్రజారోగ్యం, పర్యావరణం, ఆర్థిక వ్యవస్థలను ఫణంగా పెడుతోంది. సంప్రదాయ డేటా సెంటర్ ఏడాదికి 10-25 మెగావాట్ల విద్యుత్‌ను ఖర్చు చేస్తే, ఎ.ఐ తో నడిచే డేటా సెంటర్ ఏడాదికి 100 మెగావాట్ల విద్యుత్‌ను వినియోగిస్తుంది. ఇది ఒక లక్ష కుటుంబాలు ఏడాదికి వినియోగించే విద్యుత్‌కు సమానం. సర్వర్లు (60 శాతం), సమాచార నిల్వ వ్యవస్థలు (దాదాపు 5 శాతం), నెట్ వర్కింగ్ పరికరాల సంధానం (5 శాతం), ఐటీ పరికరాల వినియోగం (7-30 శాతం) విద్యుత్ వినియోగం పెద్ద ఎత్తున జరిగి స్థానిక విద్యుత్ వ్యవస్థకు పెద్ద అడ్డంకిగా మారుతుంది. విద్యుత్ వినియోగంలో అధిక భాగం ఉష్ణం (వేడి)గా మారుతుంది. దాంతో డేటా సెంటర్లను చల్లబరచవలసి ఉంటుంది. అందుకోసం చల్లగాలి జనరేటర్లను వాడుతున్నప్పటికీ, ప్రధానంగా ఆ ఉష్ణాన్ని నీటి ద్వారా తొలగించడం పరిపాటి. ఒక మెగావాట్ డేటా సెంటర్ కోసం ఏడాదికి 26 మిలియన్ల (రెండు కోట్ల అరవై లక్షల) లీటర్లను వినియోగించాల్సి వస్తుంది. 30 మెగావాట్ల డేటా సెంటర్ కోసం ఏడాదికి 780 మిలియన్ లీటర్ల (అంటే రోజుకు 2,19,700 లీటర్ల) నీటిని వినియోగించాలి. ఇండియాలో పట్టణ ప్రాంతాల్లో రోజుకు తలసరి 135 లీటర్ల నీరు అవసరం. అందువల్ల రోజుకు 1630 మందికి అవసరమయ్యే నీటిని ఖర్చు చేయవలసి వస్తుంది. గూగుల్ 1 గిగావాట్ (వెయ్యి మెగావాట్లు), రిలయన్స్ 1 గిగావాట్, సిఫీ-500 మెగావాట్లు, మెటా-500 మెగావాట్లు, పై-60 మెగావాట్లు లక్ష్యంగా డేటా సెంటర్లను ఏర్పాటు చేయబోతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 6 గిగావాట్ సామర్థ్యం గల డేటా సెంటర్లు 2030 నాటికి రాబోతున్నాయి. అంటే, రోజుకు 4,39,40,000 లీటర్లకు పైగా నీటిని డేటా సెంటర్లు వినియోగించబోతున్నాయి. దాంతో డేటా సెంటర్లున్న ప్రాంతాలలో పెద్ద ఎత్తున తాగు/సాగు నీటి కొరత ఏర్పడి ప్రజా జీవనాన్ని అల్లకల్లోలంగా మార్చుతుంది. 2024లో గ్లోబల్ విద్యుత్ వినియోగంలో 1.5 శాతంగా ఉన్న డేటా సెంటర్ల విద్యుత్ వినియోగం, గత ఐదేళ్లలో ఏడాదికి 12 శాతం చొప్పున పెరిగింది. అదే సమయంలో ఇప్పటికీ విద్యుత్ ఉత్పత్తిలో బొగ్గు వినియోగం 30 శాతం, గ్యాస్ 26 శాతం, అణు శక్తి 15 శాతంగా ఉంది. డేటా సెంటర్లు 27 శాతం విద్యుత్తును ఖర్చు చేస్తుండడంతో, అది మరింత వేగంగా పెరుగుతుండడం, ఇతర పారిశ్రామిక, ప్రజా అవసరాల కోసం గ్లోబల్ విద్యుదుత్పత్తిని పెంచక తప్పని పరిస్థితి. ఇప్పటికే శిలాజ ఇంధనాల నుంచి వెలువడుతున్న హరిత వాయువులను తగ్గించుకోలేని పరిస్థితి కొనసాగుతుండగా, ఈ డేటా సెంటర్ల వల్ల కర్బన ఉద్గారాలు మరింతగా పెరిగే దుస్థితి ఏర్పడుతుంది. పెరుగుతున్న భూతాపాన్ని తగ్గించే లక్ష్యంతో వివిధ దేశాలు కార్బన్ క్రెడిట్ల లక్ష్యం కోసం అణు విద్యుత్‌పై ఆధారపడవలసిన పరిస్థితి. రాబోయే డేటా సెంటర్ల విద్యుత్ అవసరాలను తీర్చే ఉద్దేశంతో పౌర అణు విద్యుత్ రంగంలోకి ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలను అనుమతించేందుకు కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకొంది. లాభాల కోసం ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలు (భోపాల్ గ్యాస్ మారణహోమం ఉదంతం) ప్రాణాంతక అణు విద్యుత్ ఉత్పత్తి రక్షణ నియమాలను తుంగలోకి తొక్కి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడతాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

అత్యధిక విద్యుత్ వినియోగం, భారీగా నీటి వినియోగం, పెద్దఎత్తున డేటా సెంటర్ పరిసరాల్లో ఉష్ణం వ్యాపించడం, ప్రమాదకరమైన ఈ వ్యర్థాలు అనూహ్యమైన స్థాయిలో ఉత్పత్తి కావడం, భరించలేని శబ్ద కాలుష్యం, పర్యావరణ, ప్రజారోగ్య సమస్యలు తలెత్తడం, ఉపాధి కల్పన పరిమితంగా వుండడంతో అమెరికాలో ప్రజలు డేటా సెంటర్ల నిర్మాణానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమించారు. దానివల్ల దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో 64 బిలియన్ డాలర్లు పైగా మదుపుతో పెట్టబోయే డేటా సెంటర్ల నిర్మాణం రద్దయింది.

> రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోవడమనే లక్ష్యంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం...వాతావరణ ప్రతికూల ప్రభావాలను కల్గించే, ప్రాథమికంగా పెద్దఎత్తున విద్యుత్‌ను, నీటిని వినియోగిస్తూ, వేడిని, ఈ-వ్యర్థాలను వెదజల్లుతూ స్థానిక వనరులు ధ్వంసం చేసే, కర్బన ఉద్గారాలను అరాచకంగా వెదజల్లే...నీటి కరువు, తీవ్ర శీతోష్ణస్థితి మార్పులు, మానసిక, శారీరక రుగ్మతలతో ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే... అత్యంత ప్రమాదకరమైన ఈ కేంద్రాల నిర్మాణం క్షమించరాని దారుణం. 2030 నాటికి 6 గిగావాట్ సామర్థ్యంగల డేటా సెంటర్ల ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వీటి నిర్మాణం ద్వారా ఉపాధి అవకాశాలను కల్పిస్తామని, ఆర్థికాభివృద్ధిని తీసుకొస్తామని పాలకులు గోబెల్స్ ప్రచారం చేస్తూ ప్రజల్ని మభ్యపెడుతున్నారు.

అయితే ప్రజా ఉద్యమాల ధాటికి ఉత్పత్తి, ఖర్చును మించిన వ్యర్థాల పరిరక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయవలసి వస్తుంది. దీంతో లాభాల మార్జిన్ల కోసం అలాంటి 'రోగ్' పరిశ్రమలను బహుళజాతి సంస్థలు దక్షిణాది వ్యవసాయ దేశాలకు, పేద దేశాలకు తరలిస్తాయి. వెనుకబడిన, వర్ధమాన దేశాల ప్రజలకు ఆయా సంస్థల వల్ల కలిగే దుష్ప్రభావాల గురించిన సమాచారం కొరవడడం, ప్రభుత్వాలు, పాలక వర్గాలు వ్యర్థ నియంత్రణ వ్యవస్థల ఏర్పాటును పెద్దగా పట్టించుకోక పోవడం వంటివి ఇలాంటి పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన పరిస్థితి కల్పిస్తుంది. పైగా రాష్ట్ర పాలకులు పెద్ద ఎత్తున విదేశీ మదుపులను ఆకర్షిస్తున్నట్లుగా, అభివృద్ధి, ఉపాధి కల్పన, ఆర్థిక వికాసాన్ని తీసుకొస్తున్నట్లుగా ఫోజులు కొట్టేందుకు అవకాశం ఉంటుంది.

ప్రజారోగ్యాన్ని, వ్యవసాయ-పారిశ్రామిక రంగాలను, పర్యావరణాన్ని ధ్వంసం చేసే డేటా సెంటర్లు, ఇథనాల్ ఫ్యాక్టరీలు, పెట్రో కెమికల్ రసాయనాల తయారీ, అణు విద్యుత్ కేంద్రాల ఏర్పాటు, సోలార్ ప్యానల్ తయారీ ఫ్యాక్టరీ తదితర 'రోగ్ ఫ్యాక్టరీ'ల ఏర్పాటుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రయత్నాలను ప్రజలు సంఘటితంగా తిప్పికొట్టవలసిన తరుణమిది. తస్మాత్ జాగ్రత్త.

/ వ్యాసకర్త సెల్ : 9550367536 /

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

క్రిస్మస్ డెకరేషన్స్‌ను ధ్వంసం చేసిన బజరంగ్‌దళ్ గూండాలకు బెయిల్ తిరస్కృతి

రాయ్‌పూర్ : చత్తీస్‌ఘడ్ రాజధానిలో గత వారం ఒక మాల్‌లో క్రిస్మస్ డెకరేషన్స్‌ను ధ్వంసం చేసినందుకు శనివారం అరెస్టయిన ఏడుగురు బజరంగ్‌దళ్ కార్యకర్తలకు రాయ్‌పూర్ కోర్టు బెయిల్ నిరాకరించింది. బుధవారం ఈ దాడి జరగగా, అదే రోజు రాత్రి 30, 40మంది గుర్తు తెలియని వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదైంది. కాగా సంఘ్‌పరివార్ గ్రూపులకు చెందిన ఏడుగురిని శనివారం అరెస్టు చేశారు. వారిని మేజిస్ట్రేట్ కోర్టు ఎదుట హాజరు పరచగా, వారిని జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. ఇతర నిందితులను గుర్తించే ప్రక్రియ సాగుతోందని పోలీసు అధికారి ఒకరు తెలిపారు. వారిని సోమవారం కోర్టు ముందుకు తీసుకురాగా బెయిల్ తిరస్కరించారు. కాగా ఈ చర్యకు నిరసనగా దాదాపు 300మంది బజరంగ్ దళ్ కార్యకర్తలు 9గంటల పాటు ట్రాఫిక్‌ను దిగ్బంధించారు. రాష్ట్రంలో మత మార్పిడులు జరుగుతున్నాయంటూ క్రిస్మస్ నాడు రోజంతా బంద్‌కు బజరంగ్ దళ్ కార్యకర్తలు పిలుపిచ్చారు. కర్రలు పట్టుకుని అల్లరిమూక మాగ్నెటో మాల్‌లోకి చొరబడి అక్కడ చేసిన క్రిస్మస్ డెకరేషన్లను ధ్వంసం చేశారు. మాల్‌లోని భద్రతా సిబ్బంది అడ్డుకోవడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. గత 16ఏళ్ళలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితులు చూడలేదని మాల్ ఉద్యోగులు పేర్కొన్నారు.

తైవాన్‌కు అమెరికా ఆయుధాల విక్రయాన్ని ఖండించిన క్యూబా

హవానా : తైవాన్‌కు ఆయుధాల అమ్మకాల ప్యాకేజీకి ట్రంప్ ఆమోద ముద్ర వేయడాన్ని క్యూబా ఖండించింది. క్యూబా విదేశాంగ మంత్రి బ్రూనో రోడ్రిగ్జ్ ఆదివారం ఎక్స్‌లో పోస్టు చేశారు. చైనా సార్వభౌమాధికారం, ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో శాంతి, సుస్థిరతకు ముప్పు కలిగించే విధంగా తైవాన్‌కు భారీ ఆయుధాలను విక్రయించాలన్న అమెరికా నిర్ణయాన్ని తాము తిరస్కరిస్తున్నామని పేర్కొన్నారు. 'ఒకే చైనా'అనే సూత్రానికి క్యూబా కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

PUB/1674
ప్రెస్ నోటిఫికేషన్
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పౌర విమానయాన మంత్రిత్వ శాఖ
రైల్వే భద్రతా కమిషన్
విజయవాడ (BZA) డివిజన్‌లోని VSKP BZA విభాగంలోని ఎలమంచిలి (YLM) స్టేషన్‌లోని టిఆర్. నం. 18189 (TATA-ERS) యుపి ఎక్స్‌ప్రెస్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై 29.12.2025న చట్టబద్ధమైన విచారణ జరుగుతుంది,
సివిల్ ఏవియేషన్ మంత్రిత్వ శాఖ నుండి సికింద్రాబాద్‌లోని సౌత్ సెంట్రల్ సర్కిల్ రైల్వే సేఫ్టీ కమిషనర్ శ్రీమతి మాధవి, పైన పేర్కొన్న సంఘటనపై 31.12.2025 మరియు 01.01.2026 తేదీలలో "ఎలక్ట్రిక్ ట్రాక్షన్ ట్రైనింగ్ సెంటర్ (ETTC), విజయవాడ"లో చట్టబద్ధమైన విచారణను నిర్వహిస్తారు.
పైన పేర్కొన్న ప్రమాదం మరియు దానికి సంబంధించిన విషయాలకు సంబంధించి జ్ఞానం ఉన్న ప్రజా సభ్యులు మరియు ఆధారాలు అందించాలనుకునే వారు విచారణ తేదీన పైన పేర్కొన్న స్థలంలో అలా చేయవచ్చు లేదా ఈ క్రింది అధికారిక చిరునామాకు రాయవచ్చు.
రైల్వే సేఫ్టీ కమిషనర్, దక్షిణ మధ్య సర్కిల్, రైల్వే నిర్మాణ్ భవన్, సరోజిని దేవి రోడ్డు, సికింద్రాబాద్ 500025 లేదా ఆమెను 040-27820104 ఫోన్ నంబర్‌లో సంప్రదించండి.
జారీ చేసినది
చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్,
దక్షిణ మధ్య రైల్వే
A2130

SMFG IndiaCredit
ఎస్ఎంఎఫ్‌జి ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్
కార్పొరేట్ కార్యాలయం : 10వ అంతస్తు, కార్యాలయం నం.101, 102 మరియు 103, 2 నార్త్ ఎవెన్యూ, మేకర్ మ్యాక్సిటీ, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (తూ), ముంబై-400051
స్వాధీనతా నోటీసు
(స్థిరాస్తి కొరకు)
(సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(1) క్రింద)
[illegible]
తేది: 26-12-2025
ప్రదేశం: విజయవాడ
సం/- అధీకృత అధికారి
ఎస్ఎంఎఫ్‌జి ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్

హిందుజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
HINDUJA HOUSING FINANCE LIMITED
కార్పొరేట్ ఆఫీస్: 167-169, 2వ అంతస్తు, లిటిల్ మౌంట్, సైదాపేట్, చెన్నై-600 015.
అనుబంధం-4 స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)
[illegible]
Loan Account Nos. AP/VWD/BENZ/A000000133
ప్రదేశం: విజయవాడ
తేది: 29.12.2025
సం/- అధీకృత అధికారి
హిందుజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరుపున

గిరిజనుల్లో విద్యుత్ గు'బిల్లు'

- వేల రూపాయల్లో బిల్లులు రావడంతో ఆందోళన
- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి–పార్వతీపురం

రాష్ట్రంలో 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించిన ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచిత విద్యుత్ పథకాన్ని గత కొంతకాలంగా ప్రభుత్వం అమలు చేస్తోంది. కొమరాడ మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో గిరిజనులకు వేలాది రూపాయల బిల్లులు చెల్లించాలంటూ నోటీసులు అందాయి. ఒక్కో గిరిజన కుటుంబానికి రూ.5 వేల నుంచి 21 వేల వరకు బిల్లు కట్టాలంటూ విద్యుత్ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో లబోదిబోమంటూ గిరిజనులు సోమవారం జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌కి హాజరయ్యారు. తమ ఇళ్లల్లో ఒక బల్బు, ఒక ఫ్యాను మాత్రమే వాడుతున్నామని, వేలాది రూపాయల బిల్లులు ఎలా వచ్చాయని వారు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని గుడ్డాం, దేరుపాడు, సంకేషు, వనకాబడి, జీమేషు, కోషు, లొడ్డ, ఉల్లింద్ర గ్రామాలకు చెందిన గిరిజనులకు పెద్ద మొత్తాల్లో విద్యుత్ బిల్లులు అందాయి. తన ఇంట్లో ఒక ఫ్యాన్, ఒక బల్బు వినియోగిస్తున్నామని, కానీ బిల్లు రూ.10 వేలపైనే వచ్చిందని ఊయక అప్పయ్య చెప్పారు. ఈ విధంగా పార్వతీపురం డివిజన్‌లో 11 వేల మంది ఎస్‌సి, ఎస్‌టిలకు నోటీసులు జారీ చేశారు. 200 యూనిట్లు దాటి విద్యుత్ వినియోగించిన ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచిత విద్యుత్ పథకం వర్తించదు. అయితే కొంతమంది నిర్దేశించిన పరిమితికి పైబడి విద్యుత్ వినియోగించినా తాము ఎస్‌సి, ఎస్‌టిలమనే ధీమాతో బిల్లులు చెల్లించడం లేదని విద్యుత్తు అధికారులు చెబుతున్నారు.

200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించినప్పటికీ ఎస్‌సి, ఎస్‌టిలు ప్రతినెలా 25 రూపాయల సర్‌ఛార్జీ చెల్లించాల్సి ఉంటుంది. ఈ సర్‌ఛార్జీ మొత్తాన్ని ఏళ్ల తరబడి చెల్లించక పోయినా వేలాది రూపాయల బిల్లులు వచ్చే అవకాశం ఉంది. డివిజన్ పరిధిలో 11 వేల ఎస్‌సి, ఎస్‌టిల విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి బకాయి రూ.5 కోట్ల వరకు ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

బిల్లులో లోపాలుంటే సరిచేస్తాం

ఎస్‌సి, ఎస్‌టిలకు సంబంధించి విద్యుత్ బిల్లుల జారీలో లోపాలున్నా, బిల్లులు తీసే సిబ్బంది తప్పులున్నా సరి చేస్తాం. ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచిత విద్యుత్ పథకం కింద 200 యూనిట్లలోపు వినియోగించాలి. దాటితే ఈ పథకం వర్తించదు. ఉచిత విద్యుత్ వర్తించినా ప్రతినెలా 25 రూపాయల సర్‌ఛార్జీ చెల్లించాలి. ఈ మొత్తాన్ని ప్రతినెలా కొంతమంది చెల్లించకపోవడం, ఏళ్ళతరబడి బకాయి పడడంతో బిల్లు వేలకొద్దీ వచ్చే అవకాశముంది. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించి, 25 రూపాయల సర్‌ఛార్జీ ప్రతినెలా చెల్లించిన వారికి ఎక్కువ బిల్లు వస్తే సరి చేసి బిల్లు తగ్గేలా చూస్తాం.

– గోపాలరావు నాయుడు, ఇఇ, ఇపిడిసిఎల్, పార్వతీపురం

పాదచారులపైకి దూసుకెళ్లిన బస్సు

- ముంబయిలో దారుణం
- నలుగురు మృతి, తొమ్మిదిమందికి తీవ్రగాయాలు

సంఘటనా స్థలంలో సహాయక సిబ్బంది

ముంబయి : మహారాష్ట్ర రాజధాని ముంబయిలో సోమవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. భండూప్ ప్రాంతంలో బృహణ్ ముంబయి ఎలక్ట్రిక్ సప్లై అండ్ ట్రాన్స్‌పోర్టు (బిఇఎస్‌టి) బస్సు రివర్స్ అవుతుండగా ఢీకొనడంతో నలుగురు మృతి చెందారు. మరో తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించారు. బస్సు నియంత్రణ కోల్పోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక బృందాలను సంఘటనా స్థలికి తరలించారు. ట్రాఫిక్‌ను నియంత్రించడానికి భారీ సంఖ్యలో పోలీసులను మోహరించారు.

ఇండోనేషియాలో ఘోరం

- రిటైర్మెంట్ హోమ్‌లో అగ్ని ప్రమాదం • 16 మంది మృతి

జకర్తా : ఇండోనేషియాలో ఘోరం జరిగింది. సులవెసి ద్వీపంలోని ఒక రిటైర్మెంట్ హోమ్‌లో ఆదివారం రాత్రి అగ్నిప్రమాదం జరిగి 16 మంది మృతి చెందారు. వెర్ధా దమై రిటైర్మెంట్ హోమ్‌లో ఈ అగ్నిప్రమాదం జరిగిందని, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు. స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం భవనంలో భారీ ఎత్తున మంటలు చెలరేగి పైవరకూ వ్యాప్తి చెందాయి. భవనం నుంచి వృద్ధులను రక్షించడానికి స్థానికులు సహాయం చేస్తూ కనిపించారు. ఈ హోమ్‌లో ఎక్కువ మంది వృద్ధులే ఉంటున్నారని, అగ్ని ప్రమాదం కారణంగా భవనంలో చిక్కుకునిపోయారని పోలీసులు చెప్పారు. 16 మంది మరణించారని, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు.

వ్యాజ్యాల తగ్గింపునకు నూతన పాలసీ

- మంత్రి ఎన్ఎండి ఫరూక్

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

అనవసరమైన వ్యాజ్యాలను తగ్గించడానికి, న్యాయస్థానాలపై అధిక భారాన్ని నివారించడానికి, పాలనా సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి మంత్రివర్గ ఉపసంఘం సూచనలు చేస్తుందని న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాజ్య విధానం (లిటిగేషన్ పాలసీ – 2025)ను పరిశీలించేందుకు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం సోమవారం సమావేశమైంది. ఈ ఉపసంఘం సమావేశంలో మంత్రి ఫరూక్, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ పాల్గొన్నారు.. ఉపసంఘం సమావేశం అనంతరం మంత్రి ఫరూక్ విలేకర్లతో మాట్లాడుతూ.. ముందస్తు కేసుల నిర్వహణ ద్వారా అప్పీళ్లను న్యాయంగా దాఖలు చేయడానికి, విధానపరమైన జాప్యాలను తొలగించడానికి చర్యలను మంత్రుల కమిటీ సూచిస్తుందని తెలిపారు. ప్రత్యామ్నాయ వివాద పరిష్కారాన్ని సమీక్షించడం, ప్రోత్సహించడం, లోక్ అదాలత్‌లను సంస్థాగతీకరించడం తదితర అంశాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. తదుపరి సమావేశం నాటికి శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు సేకరించాలని న్యాయశాఖ కార్యదర్శికి సూచించినట్లు చెప్పారు. గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల లిటిగేషన్ పాలసీ వివరాలు కూడా తెలియజేయాలని ఆదేశించామన్నారు.

టెన్త్ మార్కుల జాబితాలో ఒకేషనల్ సబ్జెక్టు

- వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు
- సమగ్ర శిక్ష డైరెక్టర్ శ్రీనివాస్

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

వచ్చే విద్యాసంవత్సరం నుంచి పదో తరగతి మార్కుల జాబితాలో ఒకేషనల్ సబ్జెక్టు మార్కులను కూడా చేర్చనున్నామని సమగ్రశిక్ష డైరెక్టర్ బి శ్రీనివాస్ వెల్లడించారు. ఇది విద్యార్థుల గ్రేడింగ్‌లో కీలకపాత్ర పోషిస్తుందని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ హైస్కూళ్లలో ఒకేషనల్ ఎడ్యుకేషన్‌ను ప్రవేశపెట్టేందుకు బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి స్కిల్ కాంపిటేషన్ 2025–26లో భాగంగా 26 జిల్లాల నుంచి 10 ట్రేడుల్లో 260 ప్రాజెక్టుల ప్రదర్శన విజయవాడలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం–2020 స్ఫూర్తితో ఒకేషనల్ ఎడ్యుకేషన్‌ను ఒక అదనపు సబ్జెక్టుగా కాకుండా విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదిగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఒకేషనల్ ట్రైనర్ల ఎంపిక కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ మెరిట్ ప్రాతిపదికన జరుగుతుందని తెలిపారు. ఒకేషనల్ అంటే రేపటితరం ఆటోమొబైల్ ఇంజనీర్లుగా, ఇన్నోవేటర్లుగా తీర్చిదిద్దడమేనని తెలిపారు. విద్యార్థుల్లో కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా పనిచేస్తూ నేర్చుకునే (హ్యాండ్స్ ఆన్ లార్నింగ్) సంస్కృతిని పెంపొందించేందుకు విద్యాశాఖ, సమగ్ర శిక్ష స్కిల్ ఎడ్యుకేషన్ ద్వారా కీలక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. ఫిన్లాండ్ వంటి దేశాల తరహాలో యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌ను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. మార్కుల కోసమే కాకుండా జీవితంలో ఎదురయ్యే చిన్న చిన్న సమస్యలు ట్యాప్ లీకేజ్ అరికట్టడం, సైకిల్ పంచర్ వేయడం వంటివి పరిష్కరించుకోగల నైపుణ్యాన్ని హైస్కూల్ దశలోనే విద్యార్థులకు అందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం ప్రాజెక్టుల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను డైరెక్టర్ అందించారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్ష ఎఎస్‌పిడి ఎంఆర్ ప్రసన్నకుమార్, కె రవీంద్రనాథ్ రెడ్డి, సీమ్యాట్ డైరెక్టర్ మస్తానయ్య, ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కెవి శ్రీనివాసులు రెడ్డి, ఫైనాన్స్ కంట్రోల్ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం : సిపిఎం

న్యూఢిల్లీ : ఉన్నావో అత్యాచార కేసులో సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు సిపిఎం తెలిపింది. ఈ కేసులో బిజెపి మాజీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగర్‌కు బెయిల్ మంజూరు చేస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రజలు వ్యతిరేకించారని తెలిపింది. దీనిపై సుప్రీంకోర్టు స్టే విధించడాన్ని స్వాగతిస్తున్నామని సోమవారం సోషల్ మీడియా ఎక్స్‌లో ప్రకటించింది. చట్ట నియమాలు ప్రలోభాలు, మినహాయింపులకు వ్యతిరేకంగా సిద్ధంగా ఉండాలని పేర్కొంది.

అంటువ్యాధుల నియంత్రణకు టాస్క్‌ఫోర్స్

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అంటువ్యాధుల నివారణ, నియంత్రణ చర్యలను మరింత పటిష్టంగా అమలుచేసేందుకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో అంటువ్యాధులు (డెంగీ, మలేరియా, డయేరియా, టీబి, లెప్రసీ) ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యలు, అకస్మాత్తుగా వ్యాధులు వ్యాప్తి చెందిన సందర్భాల్లో తక్షణమే చేపట్టాల్సిన నియంత్రణ చర్యలపై కమిటీ సమగ్రంగా అధ్యయనం చేసి వ్యూహాత్మక ప్రణాళిక రూపొందిస్తుందని తెలిపారు. ఈ కమిటీ ప్రతి మూడు నెలలకొకసారి సమావేశమవుతుందని పేర్కొన్నారు. ఈ టాస్క్‌ఫోర్స్ కమిటీకి చైర్మన్‌గా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ ఉంటారని, కమిటీలో సెకండరీ హెల్త్ డైరెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ, మున్సిపల్, వ్యవసాయ శాఖల కమిషనర్లు సంపత్‌కుమార్, మంజీర్ జిలానీ తదితరులుంటారని వివరించారు.

తొలి 7 లెవల్ 'క్వాంటం'కు రష్యా రూపకల్పన

మాస్కో : రష్యా శాస్త్రవేత్తలు మొట్టమొదటి క్వాంటం కంప్యూటర్‌ను రూపొందించినట్లు రష్యన్ క్వాంటం సెంటర్ (ఆర్‌క్యూసి) సోమవారం ప్రకటించింది. ఈ కొత్తరకం క్వాంటం యూనిట్‌ను వినియోగించి, ఏడవ స్థాయిలో పనిచేసే మొదటి అయాన్ ఆధారిత కంప్యూటర్‌ను తయారు చేసినట్లు తెలిపింది. ఈ కొత్త సాంకేతికత కంప్యూటర్‌ను 72 క్విట్ క్వాంటం ప్రాసెసర్‌తో సమానంగా చేస్తుందని, ముఖ్యమైన గణనలను అధిక కచ్చితత్వంతో నిర్వహించేందుకు అనుమతిస్తుందని పేర్కొంది. శాస్త్రవేత్తలు ఈ బహుళ స్థాయి విధానాన్ని 2021లో చాలా చిన్న వ్యవస్థతో పరీక్షించడం ప్రారంభించి, నాలుగేళ్లలో పూర్తి చేశారని ఆర్‌క్యూజెడ్ డైరెక్టర్ మాగ్జిమ్ ఓస్ట్రాస్ పేర్కొన్నారు.

నేడు, రేపు 'ప్రజల సేవలో ప్రభుత్వం'

- టిడిపి నేతలంతా పాల్గొనాలన్న పల్లా

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

'ప్రజల సేవలో ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వం సాధించిన విజయాలను వివరించాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, మంత్రి కె అచ్చెన్నాయుడు ఆ పార్టీ నేతలను ఆదేశించారు. టిడిపి ముఖ్య నేతలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పార్లమెంట్ అధ్యక్షులతో సోమవారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో వారు ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఎన్నికల హామీలన్నీ వేగంగా అమలు చేశామని చెప్పారు. తల్లికి వందనం, స్త్రీ శక్తి, వికలాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, అన్నదాత సుఖీభవ, దీపం పథకం, ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లతోపాటు మత్స్యకారులు, ఆటో డ్రైవర్లు, నేతన్నలకు అమలుచేసిన సంక్షేమ పథకాలను, ఇతర పథకాలను వివరించాలన్నారు.

శ్రామిక జన సంస్కృతిపై మనువు విసిరిన బల్లెం

(మొదటిపేజి తరువాయి)

గురించి చెబుతూ, మరోవైపు దేశంలో పలుచోట్ల స్త్రీ మూర్తులపై అత్యాచారాలకు పాల్పడటం సిగ్గుచేటని అన్నారు. ఈ పరిస్థితుల్లో సమానత్వం అన్న భావన కనుచూపు మేరలో కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అధ్యక్షత వహించారు. ఈ వేదికపై సిఐటియు అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్, కేరళ మాజీ ఎంపీ ఎలమరం కరీమ్, మాజీ మంత్రి టిపి రామకృష్ణన్, డైరెక్టర్ యాద్‌కుమార్ తదితరులు ఉన్నారు. సుద్దాల అశోక్ తేజను సభానంతరం ఘనంగా సన్మానించారు.

HDFC BANK
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్
డిమాండ్ నోటీసు
[illegible]
ప్రదేశం: విజయవాడ
తేది: 26-12-2025
సం/- అధీకృత అధికారి
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్

HDFC BANK
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్
CIN: L65920MH1994PLC080618
www.hdfcbank.com
[illegible]
తేది: 26.12.2025
సం/- అధీకృత అధికారి
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్

MANAPPURAM HOME FINANCE LTD.
మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
సిఐఎన్ : U65923KL2010PLC039179
స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)
ఏదైతే, దిగువసంతకందారు అయిన మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (...) ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ (...) రూల్స్, 2002 యొక్క రూల్ 9 తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన (...) పిలుస్తు నోటీసులో పేర్కొన్న మొత్తం సదరు నోటీసు తేది నుండి 60 రోజుల (...) మొత్తాన్ని చెల్లించుటలో విఫలమైనందున, సదరు రూల్స్ లోని చెప్పబడిన (...) సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ సంతకందారు (...) ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమైనది. [illegible]
ప్రదేశం: విజయవాడ, తేది: 30-12-2025

భౌతిక స్వాధీనత నోటీసు
ICICI Bank
శాఖ కార్యాలయం : ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10 ప్లాటినా టవర్, బొమ్మన హళ్లి హోసూర్ మెయిన్ రోడ్, బెంగళూరు-560068
దిగువసంతకందారు అయిన ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుతూ [illegible]
LBVJW00005529921/ LBVJW00005529933
15.04.2024 Rs. 25,23,095.00/-
తేది : 30 డిసెంబర్, 2025 ప్రదేశం : విజయవాడ
అధీకృత సంతకం
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరుపున

నిధుల వినియోగంలో నిర్లక్ష్యాన్ని సహించం : మంత్రి డోలా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధుల వినియోగంలో అలసత్వం మహిస్తే సహించేది లేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధుల వినియోగంపై సోమవారం నిర్వహించిన నోడల్ ఏజెన్సీల సమావేశంలో ఆయన ప్రసంగించారు. పేద, బలహీన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషికి అధికారులు సహకరించాలన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధుల వినియోగంపై శాఖల వారీగా అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏడాది ముగుస్తున్నా కొన్ని శాఖలు సబ్‌ప్లాన్ నిధుల వినియోగంలో ఎందుకు వెనకబడి ఉన్నాయని అధికారులను ప్రశ్నించారు.

నిధులను నూరుశాతం వినియోగించాలని ఆదేశించారు. సబ్‌ప్లాన్ నిధుల వినియోగంపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి నిర్దిష్టమైన ప్రణాళికలతో అంచనాలు రూపొందించాలని, ఊహాగానాలతో లెక్కలు వేయొద్దని అన్నారు. ఎస్‌సి కాలనీల్లో సిసి రోడ్లు, తాగునీటి సౌకర్యాలపై మరింత దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.

హెచ్ఒడిల గైర్హాజరుపై ఆగ్రహం

ఈ సమావేశానికి నోడల్ ఏజెన్సీల హెచ్‌ఒడిలు హాజరు కాకపోవడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద, బలహీన వర్గాల ప్రజల పట్ల నిర్లక్ష్యానికి ఈ చర్య అద్దం పడుతోందన్నారు. తదుపరి సమావేశాలకు హెచ్‌ఒడిలు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు.

చెవిరెడ్డి బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పు వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

మద్యం ముడుపుల కేసులో బెయిల్ ఇవ్వాలంటూ వైసిపి నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి సోమవారం ప్రకటించారు. మద్యం ఉత్పత్తి కంపెనీల నుంచి నెలకు రూ.60 కోట్ల నుంచి రూ.70 కోట్లు వసూలు చేశారని, వీటిని అట్టపెట్టెల్లో పెట్టి చట్టసభ ఎన్నికలకు ఖర్చు పెట్టారని సిఐడి సిట్ తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా హైకోర్టులో వాదించారు. చెవిరెడ్డి అండతో తరలిస్తున్న కంటైనర్‌లో రూ.8 కోట్లు సొమ్మును అధికారులు సీజ్ చేశారని చెప్పారు. ఈ కేసు సిట్‌కు బదిలీ అయ్యిందన్నారు. మద్యం ముడుపుల సొమ్మును ఎన్నికల సమయంలో రాష్ట్రంలోని వేర్వేరు నియోజకవర్గాలకు తుడా వాహనాల్లో తరలించడంలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కీలక పాత్ర పోషించారని చెప్పారు. వాహనాలను మరోప్రాంతంలో ఉన్నట్లు లాగ్ బుక్ తప్పుగా రికార్డు చేశారని, హైవే టోల్ ప్లాజా సిసి కెమెరాల రికార్డులను పరిశీలిస్తే ఈ విషయం బహిర్గతమైందని తెలిపారు. చెవిరెడ్డి వ్యక్తిగత సెక్యూరిటీ గార్డులుగా ఉన్న కానిస్టేబుళ్ల వాంగ్మూలం ఇచ్చారని తెలిపారు. ఈ ఆధారాలను పరిశీలించిన తరువాతే కింది కోర్టు చెవిరెడ్డికి బెయిల్ నిరాకరించిందని, హైకోర్టు కూడా బెయిల్ మంజూరు చేయవద్దని కోరారు. చెవిరెడ్డి తరపున సీనియర్ న్యాయవాది ఆర్.బసంత్ వాదనలు వినిపిస్తూ, పర్సనల్ సెక్యూరిటీ అధికారి వాంగ్మూలం ఆధారంగా నిందితుడిగా చేయడం అన్యాయమన్నారు. సొమ్ము పిటిషనరుకు చేరినట్లు ఏ ఆధారాలు లేవని, సొమ్ము సీజ్ కూడా చేయలేదని చెప్పారు. సిట్ చార్జిషీట్ దాఖలు చేసినందున బెయిల్ ఇవ్వాలని కోరారు. ఇరుపక్షాల వాదనల తర్వాత హైకోర్టు తీర్పును వాయిదా వేసింది.

'ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ' కొనసాగించాలి

- 'విబి-జి ఆర్‌ఎఎం జి' రద్దు చేయాలి
- సమాలోచన సదస్సులో వక్తల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని అవసరమైన మార్పులు చేసి కొనసాగించాలని పలువురు వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రం కొత్తగా తీసుకువచ్చిన 'విబి-జి ఆర్‌ఎఎం జి' పథకాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో ఉపాధి హామీ పథకంపై సమాలోచన సదస్సు పిసిసి ఉపాధ్యక్షులు కొలనుకొండ శివాజి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ.. ఉపాధి హామీ చట్టం ఒక చట్టబద్ధమైన హక్కు అని తెలిపారు. ప్రజలు పని కల్పించాలని కోరితే.. పని కల్పించడం, లేని పక్షంలో పరిహారం చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం ఈ పథకం పేరు మార్చడం వెనుక దీనిని నిర్వీర్యం చేసే కుట్ర దాగి ఉందని తెలిపారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు పొందిన చట్టమని అన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, భూగర్భ జలవనరుల పెంపుతో ఉత్పాదకతను పెంచిందని వెల్లడించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరు మార్చి జాతిపిత మహాత్మా గాంధీకి కేంద్రం తీరని ద్రోహం చేసిందన్నారు. ఈ పథకంలో గత చట్టంలో ఉన్న విధంగా అన్ని హక్కులు ఉంటాయని ప్రకటించడం అర్థరహితమని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి విబి జి ఆర్‌ఎఎం జిగా ఆర్‌ఎస్‌ఎస్‌కి, కార్పొరేట్‌లకు అనుకూలమైన చట్టాన్ని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఇది పేద ప్రజలు దశాబ్దాలపాటు పోరాడి సాధించుకున్న పని హక్కుపై దాడేనని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ చట్టాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

సిడబ్ల్యుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి మాట్లాడుతూ.. యుపిఎ ప్రభుత్వం 2005 తీసుకువచ్చిన ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ చట్టంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. కూలీలే కాకుండా చదువుకున్న యువత, చిన్న సన్నకారు రైతులు కూడా ఈ చట్టం ద్వారా లబ్ధిపొందుతున్నారని, ఈ హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఈ సందర్భంగా సమిష్టి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజు, రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అజయ్‌కుమార్, రామాంజనేయులు, విజయవాడ నగర కాంగ్రెస్ అధ్యక్షులు నరహరిశెట్టి నర్సింహారావు, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మారెడ్డి తదితరులు ప్రసంగించారు.

గుజ్జనగుండ్ల సెంటర్‌లో జాతాను ప్రారంభిస్తున్న సిఐటియు జిల్లా కార్యదర్శి వై నేతాజీ

ఓ కార్మిక.. కదలండి విశాఖకు..

ప్రజాశక్తి - గుంటూరు

గుంటూరులో ప్రచార జాతా చేపట్టారు. నగరంలో కంకరగుంట గేటు, మస్తాన్‌దర్గా సెంటర్, హిందూకళాశాల సెంటర్, పట్నం బజార్, తుపానగర్ తదితర ప్రాంతాల్లో జాతా సాగింది. జాతీయ మహాసభ సందర్భంగా విశాఖలో జనవరి నాలుగున నిర్వహించనున్న ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపిచ్చారు. పల్నాడు జిల్లాలో మాచర్ల, పిడుగురాళ్ల, అమరావతిలో జాతీయ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ బైక్ ర్యాలీలు నిర్వహించారు. ర్యాలీలో కెసిపి, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ జిల్లా కొండపల్లిలో బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న సిఐటియు నాయకులు ఎం.మహేష్

విజయవాడలో ప్రచార జోరు

ప్రజాశక్తి - విజయవాడ, ఇబ్రహీంపట్నం

కార్మిక వర్గంలో చైతన్యాన్ని నింపుతూ విజయవాడలో విస్తృత ప్రచారం చేపట్టారు. మహాసభ ఆవశ్యకతను వివరిస్తూ ప్రకాష్ నగర్, కండ్రిక, సత్యనారాయణపురం, మధురానగర్, గవర్నర్‌పేట, ఏలూరు లాకులు, ఉర్వశి సెంటర్, లెనిన్ సెంటర్, పాత బస్టాండు, వెహికల్ డిపో, రైల్వే స్టేషన్, ఏలూరు రోడ్డు, డోర్నకల్ రోడ్డు, బీసెంట్ రోడ్డు తదితర వాడల్లో బైక్ జాతా ప్రచారం హోరెత్తింది. అరుణ పతాకం చేతబూని కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ కార్మికుల్లో చైతన్యాన్ని నింపారు. ఎన్‌టిఆర్ జిల్లా కొండపల్లి పారిశ్రామిక వాడ, విస్సన్నపేట మండలంలోని 12 గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు.

సాంకేతికతతో 6.17 శాతం నేరాల తగ్గుదల

- 11.6 శాతం పెరిగిన హత్యాయత్నం కేసులు
- మహిళల రక్షణ, గంజాయి, నేరాల నియంత్రణకు ప్రాధాన్యత
- వార్షిక నివేదికపై డిజిపి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆధునిక సాంకేతికతను వినియోగించడం ద్వారా రాష్ట్రంలో నేరాలకు అడ్డుకట్ట వేస్తున్నామని రాష్ట్ర డిజిపి హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. మహిళల రక్షణ, గంజాయి రవాణా జరగకుండా చూడటం, నేరాల నియంత్రణకు తాము అత్యధిక ప్రాధాన్యత నిస్తున్నట్లు చెప్పారు. మంగళగిరిలోని డిజిపి కార్యాలయంలో 2025 శాంతి భద్రతల సమీక్షపై డిజిపి సోమవారం మీడియాకు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా గతేడాదితో పోల్చితే ఈ ఏడాది ఓవరాల్‌గా 6.17 శాతం నేరాలు తగ్గాయని చెప్పారు. 2024లో 1,10,193 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 1,03,397 కేసులు నమోదయ్యాయన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలపై దాడులకు సంబంధించి గతేడాది 2,402 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 1818 కేసులు మాత్రమే నమోద య్యాయని, మొత్తం మీద 24.3శాతం కేసులు తగ్గాయ న్నారు. హత్యాయత్నం కేసులు 2024 జనవరి నుంచి డిసెంబరు వరకు 1403 కేసులు నమోదు కాగా, 2025 జనవరి నుంచి డిసెంబరు వరకు 1566 కేసులు నమోదు కావడంతో 11.6 శాతం పెరిగాయన్నారు. సైబర్ నేరాలకు సంబంధించి చైనా కేంద్రంగా పెద్ద పెద్ద గ్యాంగులు పనిచేస్తు న్నాయని, నేరం జరిగిన వెంటనే ఆ నగదు ఆ దేశానికి వెళ్లిపోతుందని, క్రిప్టో కరెన్సీగా కూడా మారుస్తుండటంతో నగదు రికవరీ కష్టమవుతోందన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని డిజిపి సూచించారు.

పెట్రోలింగ్ వాహనాలు అందుబాటులో లేకనే... నిందితులను రోడ్లపై నడిపిస్తూ....

నిందితులను కోర్టులో హాజరుపరిచే సమయంలో పెట్రోలింగ్ వాహనాలు అందుబాటులో లేకనే కొన్ని ప్రాంతాల్లో నిందితులను రోడ్లపై నడిపిస్తూ కోర్టుకు తీసుకెళ్లినట్లు డిజిపి హరీష్‌కుమార్ గుప్తా చెప్పారు. చట్ట విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. పేకాట క్లబ్‌లు ఎవరు నిర్వహించినా అటువంటి వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు అవసరమైతే పిడి యాక్ట్‌లు కూడా నమోదు చేస్తామన్నారు.

సంక్రాంతి తర్వాత పోలీసులకు రెండు రోజులు వర్క్‌షాప్

సంక్రాంతి పండుగ తర్వాత పోలీసు అధికారులు, కొత్తగా శాఖలోకి వచ్చిన పోలీసులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరాలను ముందస్తుగా ఎలా నియంత్రించవచ్చు, ఇటీవల కేసులను ఎలా పరిష్కరించామన్న అంశాలపై రెండు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించారు. రానున్న పదేళ్లలో పోలీస్ శాఖలో వచ్చే మార్పులకు అనుగుణంగా సాంకేతిక అంశాలపై తర్ఫీదు ఇస్తామని, లీగల్ అంశాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

మావోయిస్టులపై నిరంతరం నిఘా

మావోయిస్టుల కదలికలపై నిరంతర నిఘా కొనసాగుతోందన్నారు. ఇటీవల కొందరు ఇక్కడ సురక్షితమనే ఉద్దేశంతో రాష్ట్రానికి వచ్చారని, వీరిలో అనేకమందిని అరెస్ట్ చేసి జైలుకు పంపామని చెప్పారు. కొందరు నేతలు ఎన్‌కౌంటర్ కూడా అయ్యారన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ఛాంపియన్ చిత్ర బృందం

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారిని 'ఛాంపియన్' చిత్ర బృందం దర్శించుకుంది. సోమవారం విఐపి ప్రారంభ విరామ దర్శన సమయంలో సినిమా హీరో రోషన్, హీరోయిన్ అనస్వర రాజన్, చిత్ర యూనిట్ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. టిటిడి అధికారులు వీరికి దర్శన ఏర్పాట్లను చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం హీరో రోషన్ మాట్లాడుతూ ఛాంపియన్ చిత్రానికి మంచి స్పందన రావడంతో శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనార్థం వచ్చినట్లు తెలిపారు.

తెలంగాణా సిఎంకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం కోసం తెలంగాణ రాష్ట్ర సిఎం రేవంత్ రెడ్డి సోమవారం రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు పలువురు ప్రముఖులు స్వాగతం పలికారు. సోమవారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆయన మంగళవారం తెల్లవారుజామున విఐపి బ్రేక్ దర్శనంలో వైకుంఠ ద్వార దర్శనం చేసుకుంటారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర ఆర్థికశాఖ, వాణిజ్య, ప్రణాళికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్‌పి ఎల్.సుబ్బారాయుడు, చంద్రగిరి ఎంఎల్‌ఎ పులివర్తి నాని, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, శ్రీకాళహస్తి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్య నాయుడు, తదితరులు రేవంత్ రెడ్డికి స్వాగతం పలికారు.

విజయవాడలో మహిళా నైట్ షెల్టర్ హోమ్ ఒక్కటీ లేదా? : హైకోర్టు విస్మయం

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలో ప్రముఖ నగరమైన విజయవాడలో మహిళలకు ప్రత్యేకంగా ఒక్క నైట్ షెల్టర్ హోమ్ కూడా లేకపోవడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. పురుషులతో సమానంగా మహిళలకూ నైట్ షెల్టర్లు అవసరమని చెప్పింది. రాత్రిళ్లు రోడ్డు పక్క ఫుట్‌పాత్‌లపై అనాథలు, నిరాశ్రయులు నిద్రపోతున్నారని, ఈ సమస్యను పరిష్కరించే దిశగా ప్రభుత్వం దృష్టి పెట్టాలని హైకోర్టు సూచించింది. విజయవాడ సహా అన్ని జిల్లా కేంద్రాల్లో షెల్టర్ హోమ్స్ ఏర్పాటు చేస్తామన్న ప్రభుత్వ హామీని హైకోర్టు నమోదు చేసుకుంది. రెండు వారాల్లోగా ప్రభుత్వం తరుపున అఫిడవిట్ దాఖలు చేయాలని మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించింది. ఫుట్ పాత్‌లపై నిద్రపోయే వారి గురించి విజయవాడ మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, ఇందులో ఎన్‌జిఒలకు భాగస్వామ్యం కల్పించాలని సూచించింది. విచారణను ఈ నెల 31కి వాయిదా వేస్తున్నట్లు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ ఇటీవల ఆదేశించింది.

కృష్ణా బ్యారేజ్ పక్కన రాత్రిళ్లు చలిలో నిద్రిస్తున్న అనాథలు, నిరాశ్రయుల సమస్యను పరిష్కరించాలని, పేదరిక నిర్మూలన మిషన్ కింద అర్బన్ హోంలెస్ షెల్టర్ స్కీమ్ కింద వాళ్లకు ఆశ్రయం కల్పించేలా చర్యలు తీసుకోవాలని పిటిషనర్, న్యాయవాది ఎన్. ఆది రామకృష్ణుడు కోరారు. నైట్ షెల్టర్లు ఉన్నప్పటికీ నిరాశ్రయులను తరలించేందుకు కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. కార్పొరేషన్ కౌన్సిల్ వాదనలు వినిపిస్తూ విజయవాడ కార్పొరేషన్ షెల్టర్ హోమ్స్ నిర్వహిస్తోందన్నారు. విజయవాడతోపాటు అన్ని జిల్లా కేంద్రాలలో షెల్టర్ హోమ్స్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

క్రికెట్‌కు బ్రేస్‌వెల్ గుడ్‌బై

- రిటైర్మెంట్ ప్రకటించిన కివీస్ ఆల్‌రౌండర్

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ డౌగ్ బ్రేస్‌వెల్(35) అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. 35ఏళ్ల బ్రేస్‌వెల్ న్యూజిలాండ్ తరపున 2011-23 మధ్యకాలంలో 28టెస్టులు, 21 వన్డేలు, 20 టి20లు ఆడాడు. కుడిచేతి వాటం బ్యాటర్, మీడియం పేసర్ అయిన బ్రేస్‌వెల్ బ్యాటింగ్‌లో కంటే బౌలింగ్‌ల మెరుగ్గా రాణించాడు. టెస్టుల్లో 74వికెట్లు, వన్డేలో 26, టి20ల్లో 20 వికెట్లు పడగొట్టాడు. 2008లో అండర్-19 విభాగం నుంచి జాతీయ జట్టుకు ఎంపికైన బ్రేస్‌వెల్ న్యూజిలాండ్ తరపున ఉత్తమ ఆల్‌రౌండర్‌గా పేరు గడించాడు. అలాగే 2012 ఐపిఎల్‌లో ఢిల్లీ డేర్ డెవిల్స్ తరపున ఆడాడు. 2011 హోబర్ట్‌లో ఆస్ట్రేలియాపై టెస్టుల్లో ఆరు వికెట్లతో అదిరిపోయే ప్రదర్శన అతని కెరీర్‌లో మరచిపోలేనిది. ఈ ప్రదర్శన కారణంగా ఆ మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఏడు పరుగుల తేడాతో ఆసీస్‌పై చారిత్రాత్మక విజయం సాధించింది.

ఇండస్ట్రియల్ పార్క్‌లలో బిసిలకు రాయితీ

- ప్రభుత్వానికి బిసి ఎంటర్‌ప్రెన్యూర్స్ ఫోరం వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ఇండస్ట్రియల్ పార్క్‌లలో బిసిలకు ప్లాట్లు కొనుగోలులో 75 శాతం రాయితీ ఇవ్వాలని ఎపి బిసి ఎంటర్‌ప్రెన్యూర్స్ ఫోరం కోరింది. ఈమేరకు పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్ యువరాజును ఫోరం నాయకులు సచివాలయంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. 2014-19 కాలంలో అన్ని ఇండస్ట్రియల్ పార్కులలో బిసిలకు 50శాతం కొనుగోలు సబ్సిడీ అందించారని, 2019-24 మధ్యకాలంలో ఈ సబ్సిడీ నిలిపేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు 50శాతం ఉన్న సబ్సిడీని 75శాతానికి పెంచిందని, బిసిలకు మాత్రం ఇప్పటికే ఉన్న 50శాతం సబ్సిడీ కూడా అమలు చేయడం లేదని అన్నారు. ఇండస్ట్రియల్, ఎంఎస్ఎంఇ పార్కుల్లో ప్లాట్లు కొనుగోలు చేసే బ్యాక్‌వర్డ్ క్లాసులకు కూడా 75శాతం సబ్సిడీ అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. యువరాజ్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ నాయకులు ఎస్ రామరాజు, ఎం కోటేశ్వరరావు, ఆర్ శ్రీనివాసరావు, చిరంజీవి రాజు తదితరులు ఉన్నారు.

ఎఫ్‌డిసి చైర్మన్‌గిరీకి ప్రముఖుల పోటీ?



ఎంఎం రత్నం

కె.ఎస్.రామారావు

పసుపులేటి వెంకటరమణ

కాట్రగడ్డ ప్రసాద్

ఆంధ్రప్రదేశ్ సినిమా పరిశ్రమ అభివృద్ధి సంస్థ (ఎపిఎఫ్‌డిసి) నూతన చైర్మన్ నియామకం వచ్చే సంక్రాంతికి ముందే వెలువడే అవకాశం కన్పిస్తోంది. ఇప్పటికే ఈ పదవికోసం తెలుగు సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు పోటీపడుతున్న విషయం తెలిసిందే. ప్రముఖ నిర్మాత ఎఎం రత్నం పేరును డిప్యూటీ సిఎం పవన్ ప్రతిపాదించిన విషయం తెలిసిందే. హరిహర వీరమల్లు పరాభవంతో ఆయన తీవ్రంగా నష్టపోయిన క్రమంలో అయిష్టంగా ఉన్నట్లుగా సమాచారం. మరో నిర్మాత కె.ఎస్.రామారావు కూడా తనవంతుగా తీవ్ర ప్రయత్నాలను కొనసాగి స్తున్నారు. ఇంకో నిర్మాత కాట్రగడ్డ ప్రసాద్ కూడా ఈ పదవిని ఆశిస్తున్నారు. తెలంగాణాతో పోలిస్తే ఆంధ్రాలో సినిమా రంగం వెనుకబాటులో ఉంది. ఆంధ్రాకు చెందిన అగ్ర నిర్మాతలు, దర్శకులు, ఇతర సాంకేతిక నిపుణులంతా హైదరాబాద్ కేంద్రంగానే ఉంటున్నారు. ఇప్పుడు ఆంధ్రాలో సినీరంగానికి సేవలందించి, ఆంధ్రాలోనే సినిమా తీసే వారికి ఎఫ్‌డిసి ఇస్తే ఇక్కడ కూడా సినిమా రంగం అభివృద్ధి చెందుతుందనే భావనలో సిఎం సిఎం ఉన్నారనే చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో నిర్మాత, దర్శ కుడు పసుపులేటి వెంకట రమణ పేరు వినబడుతోంది. ఆంధ్రాలో చిత్ర పరిశ్రమ ఆనవాళ్లు మెరుగుపడాలంటే పదవి కోసం కాకుండా పనిచేసే వారికే పదవి ఇస్తే మంచిదనే ఆలోచన సిఎం చేస్తున్నట్లుగా సమాచారం. టిడిపి ఆవిర్భావం నుంచి నేటి వరకూ అదే పార్టీలో కొనసాగుతూ కేవలం ఆంధ్రాలోనే పూర్తి స్థాయిలో సినిమా తీస్తున్న దర్శకుడిగా పసుపులేటి గుర్తింపు పొందారు. ఎన్టీఆర్, చంద్రబాబు బయోపిక్‌లను సైతం రూపొందించారు. ఈ క్రమంలో పసుపులేటికే ఛాన్స్ ఉంటుందనే ఊహాగానాలు ఇండస్ట్రీలో జోరుగా జరుగుతున్నాయి.

'పెద్ది'లో జగపతిబాబు ఫస్ట్‌లుక్



రామ్‌చరణ్ 'పెద్ది' మూవీ చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఇటీవల కొన్ని సీన్లను రాజధాని ఢిల్లీలో తెరకెక్కించారు. ఇందుకు సంబంధించిన కొన్ని ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కూడా అవుతున్నాయి. మార్చి 27న థియేటర్లలో సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నామని చిత్ర యూనిట్ ప్రకటించింది. ఈ సినిమాలో నటిస్తున్న జగపతిబాబు ఫస్ట్‌లుక్‌ను చిత్ర యూనిట్ తాజాగా విడుదల చేసింది. అప్పలసూరి అనే పాత్రలో జగపతిబాబు కనిపించబోతున్నారు. ఆయనది పాజిటివ్ క్యారెక్టరా? నెగిటివా? అనేది ప్రకటించలేదు. 'పెద్ది' చిత్రాన్ని స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ స్టోరీతో తీస్తున్నారు. రామ్‌చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్ కీలక పాత్ర చేస్తున్నారు. బుచ్చిబాబు దర్శకుడు. ఎఆర్ రెహమాన్ సంగీతం.

మార్చి 6న అల్లు శిరీష్-నయనికల వివాహం

అల్లు శిరీష్-నయనికల వివాహం వచ్చే ఏడాది మార్చి 6న జరగనుంది. అక్టోబర్‌లో వీరిద్దరి నిశ్చితార్థం ఘనంగా జరిగిన విషయం తెలిసిందే. తాజాగా తన పెళ్లి తేదీని శిరీష్ ప్రకటించారు. 2026లో తన పెళ్లి జరుగుతుందని ఒక పాటతో చెప్పారు. అల్లు అయాన్, అర్హలతో కలిసి చేసిన ఒక రీల్‌లో ఈ విషయాన్ని అధికా రికంగా ప్రకటించారు. సరదాగా ఉన్న ఆ వీడియోలో బాబాయ్ సంగీత్ ఎప్పుడు? అంటూ అని వారు అడగ్గా.. మనం దక్షిణాది వాళ్లం కాబట్టి అలాంటి వేడుక ఉండదని శిరీష్ చెప్పారు. కానీ, పెళ్లి ఎక్కడ జరుగుతుందనేది మాత్రం చెప్ప లేదు. అల్లు అర్జున్-స్నేహారెడ్డిల వివాహం 2011 మార్చి 6న జరిగింది. శిరీష్ వివాహం కూడా అదే తేదీన జరగనుంది.

సినీరంగం బలోపేతానికి కృషి

ఫిల్మ్ ఛాంబర్ నూతన అధ్యక్షుడు డి.సురేష్‌బాబు



తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచానికి తెలియజేయటానికి, చిత్ర సీమ బలోపేతానికి కృషిచేస్తామని తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి (ఫిల్మ్ ఛాంబర్) అధ్యక్షుడు, ప్రముఖ నిర్మాత డి.సురేష్‌బాబు అన్నారు. తెలంగాణా రాష్ట్రం హైదరాబాద్‌లోని ఫిలిం ఛాంబర్ భవనంలో జరిగిన ఎన్నికల్లో ప్రోగ్రెసివ్ ప్యానెల్ తరపున ప్రదర్శనకారుల విభాగం నుంచి ఈ పదవికి పోటీచేసిన సురేష్‌బాబు విజయం సాధించారు. ఛాంబర్‌లో నిర్మాతలు, ప్రదర్శనకారులు, పంపిణీదారులు, స్టూడియో సెక్టార్‌తో కలిపి నాలుగు విభాగాలు ఉండగా ఈ ఏడాది ప్రదర్శనకారుల విభాగం నుంచి ఛాంబర్ అధ్యక్షుడిగా డి.సురేష్‌బాబు ఎన్నికయ్యారు. నాలుగు విభాగాలకుగానూ 48 మంది కార్యవర్గానికి ఎన్నికలు జరిగాయి. ప్రముఖ నిర్మాతలు డి.సురేష్‌బాబు, దిల్‌రాజు, అల్లు అరవింద్ నేతృత్వంలోని ప్రోగ్రెసివ్ ప్యానెల్; చదలవాడ శ్రీనివాసరావు, టి.ప్రసన్నకుమార్, సి.కల్యాణ్ నేతృత్వంలోని మన ప్యానెల్ బరిలోకి దిగాయి. ప్రోగ్రెసివ్ ప్యానెల్ నుంచి 31, మన ప్యానెల్ నుంచి 17 మంది గెలుపొందారు. అనంతరం నాలుగు విభాగాలు కలిసి ఛాంబర్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నాయి. అధ్యక్షుడిగా డి.సురేష్‌బాబు, ఉపాధ్యక్షులుగా సూర్యదేవర నాగవంశీ, భరత్‌చౌదరి, పి.కిరణ్; కార్యదర్శులుగా కె.అశోక్‌కుమార్ (హైదరాబాద్), కె.వి.వి.ప్రసాద్ (విజయవాడ), కోశాధికారిగా ముత్యాల రామదాసు, సంయుక్త కార్యదర్శులుగా విజేందర్‌రెడ్డి (హైదరాబాద్), మోహన్ వడ్లపట్ల (హైదరాబాద్), జి.వీరనారాయణ బాబు(విజయవాడ), జి.మహేశ్వర రెడ్డి(గుంతకల్లు), ఎన్.నాగార్జున (తిరుపతి), కె.అప్పలరాజు (విశాఖపట్నం)లను ఎన్నుకున్నారు. గెలుపొందిన అనంతరం సురేష్‌బాబు మాట్లాడుతూ తెలుగు సినిమాలను ప్రపంచస్థాయి గుర్తింపునకు తీసుకెళ్లేలా కృషిచేస్తామని అన్నారు. చిత్రసీమలోని నాలుగు సెక్టార్లకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తమవంతుగా పాలకవర్గం కృషిచేస్తుందని అన్నారు.

SMFG India Credit
Pragati Ki Nayi Pehchaan

ఎస్ఎమ్ఎఫ్‌జి ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్

కార్పొరేట్ కార్యాలయం: 10వ అంతస్తు, కార్యాలయం నం.101, 102 మరియు 103, 2 నార్త్ ఎవెన్యూ, మేకర్ మ్యాక్సిటీ, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా(తూ), ముంబై-400051

స్థిరాస్తుల అమ్మకం కొరకు విక్రయ నోటీసు

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8 మరియు 9 నిబంధనలతో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు 15 రోజుల ఇ వేలం విక్రయ నోటీసు.

ప్రత్యేకంగా రుణగ్రహీతలు మరియు హామీదారులు మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, సెక్యూర్డ్ క్రెడిటార్ కు తనఖా/ఛార్జ్ చేయబడిన క్రింద వివరించిన స్థిరాస్తులను ఎస్ఎమ్ఎఫ్‌జి ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్./సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారి స్వాధీనం చేసుకోవడం జరిగింది. క్రింద పేర్కొన్న తేదీ మరియు సమయంలో "ఏది ఉంటే అదే" "ఏమి ఉన్నాయో వాటినే" మరియు "ఎక్కడ ఉన్నాయో అక్కడే" సెక్యూర్డ్ క్రెడిటార్ ద్వారా విక్రయించబడును. క్రింద పేర్కొన్న బకాయిల రికవరీ కోసం మరియు వాటిపై తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు, ఎస్ఎమ్ఎఫ్‌జి ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్/సెక్యూర్డ్ క్రెడిటర్ నుండి రుణగ్రహీతలు మరియు క్రింద పేర్కొన్న హామీదారు(లు) చెల్లించాల్సి ఉంటుంది. రిజర్వ్ ధర, ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఇఎమ్‌డి) మరియు ఇఎమ్‌డి డిపాజిట్ చివరి తేదీ కూడా క్రింద పేర్కొనబడ్డాయి:

రుణగ్రహీత(లు)/ హామీదారు(లు)/రుణ ఖాతా	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం	స్థిరాస్తి యొక్క వివరణ	రిజర్వ్ ధర, ఇఎమ్‌డి మరియు ఇఎమ్‌డి సమర్పణ చివరి తేది	ఇ-వేలం తేది మరియు సమయము
1. శ్రీ దుర్గా కేబుల్ అండ్ స్టార్ నెట్‌వర్క్ 2. సీరామ్ దుర్గా భవాని 3. సీరామ్ లక్ష్మణ్ 4. శ్రీ దుర్గా కేబుల్ అండ్ స్టార్ నెట్‌వర్క్ రుణ ఖాతా నం: 212121310997151	24-08-2023 రూ. 75,06,543/- [డెబ్బై ఐదు లక్షల ఆరు వేల ఐదు వందల నలభై మూడు రూపాయలు మాత్రమే] 24/08/2023 నాటికి	ఆర్.సి.సి.రూఫ్ భవనం యొక్క ఆ భాగం మరియు పార్శిల్ విస్తీర్ణత 140.0చ. గ.లు లేదా 121.3 చ.మీ.లు ఆర్.ఎస్.నం.389/4లో, పన్ను రసీదు ప్రకారం డోర్ నం.12-4/1, మూల్యాంకనం నం.7115 కెపిఎల్ కొండపల్లి గ్రామం మరియు గ్రామ పంచాయతీ, ఇబ్రహీంపట్నం మండలం మరియు కృష్ణాజిల్లా లోని ఇబ్రహీంపట్నం ఎస్.ఆర్.ఒ. పరిమితులు పిన్ - 521456.సరిహద్దులు: తూర్పు: గుండుమేను సత్యనారాయణ మరియు పబ్బతి వెంకటేశ్వరరావు యొక్క ఆస్తి; దక్షిణం: అత్తులూరి జనార్ధనరావు మరియు పాలడుగు వెంకయ్య ఆస్తి; పడమర: విజయవాడ, తిరువూరు రోడ్డు; ఉత్తరం: పూటుకూరి పవన్‌కుమార్ మరియు గిరికుమార్ ఆస్తి	రిజర్వు ధర : రూ.63,04,000/- (అరవై మూడు లక్షల నాలుగు వేల రూపాయలు మాత్రమే) ఇఎమ్‌డి: రూ.6,30,400/- (ఆరు లక్షల ముప్పై వేల నాలుగు వందల రూపాయలు మాత్రమే) ఇఎమ్‌డి డిపాజిట్ చివరి తేదీ: 19-01-2026	తేదీ: 20-01-2026 సమయము: ఉదయం 11:00 నుండి మధ్యాహ్నం 02:00 వరకు (ఒక్కొక్కటి 5 నిమిషాల అపరిమిత పొడిగింపులతో)

అమ్మకానికి సంబంధించిన వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం, దయచేసి సంప్రదించండి 1) శ్రీ ఎస్.కిరణ్: +91-9247330922 2) శ్రీ ఎ.జెగదాష్: +91- 9597959562 3) శ్రీ జి దుర్గా ప్రసాద్: +91-8886851222 లేదా ఎస్ఎమ్ఎఫ్‌జి ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్/సెక్యూర్డ్ క్రెడిటర్ వెబ్‌సైట్ www.smfgindiacredit.com లో అందించిన లింక్‌ను చూడండి.

తేది: 29-12-2025
ప్రదేశం: విజయవాడ

సం/-అధీకృత అధికారి
ఎస్ఎమ్ఎఫ్‌జి ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్

Muthoot Homefin

ముత్తూట్ హోమ్‌ఫిన్ (ఇండియా) లిమిటెడ్.

కార్పొరేట్ ఆఫీస్ : యూనిట్ నెం.19-ఎన్ఇ, ఫ్లోర్, ద రూబి, సెనపతి బాపట్ మార్గ్, రుపేరియల్ కాలేజి దగ్గర, దడార్ (పశ్చిమం), ముంబాయి, మహారాష్ట్ర-400 028.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ మరియు ఫైనాన్షియల్ ఆస్తుల రీకన్‌స్ట్రక్షన్ మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చట్టం 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం, సెక్యురిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3(1)తో కలిపి చదవండి. కింద సంతకం చేసిన వ్యక్తి ముత్తూట్ హోమ్‌ఫిన్(ఇండియా) లిమిటెడ్(ఎమ్‌హెచ్‌ఐఎల్) యొక్క అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 చెప్పబడిన చట్టం కింద ఉన్నారు. సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో కలిపి చెప్పబడిన చట్టంలోని సెక్షన్ 13(2) కింద ఇవ్వబడిన అధికారులను వినియోగించుకుంటూ, అధీకృత అధికారి ఈ చట్టంలోని సెక్షన్ 13(2) కింద డిమాండ్ నోటీసులను జారీ చేశారు. ఈ క్రింద రుణగ్రహీతలు (చెప్పబడిన రుణగ్రహీత) వారికి జారీ చేయబడిన సంబంధిత డిమాండ్ నోటీసులలో పేర్కొన్న మొత్తాలను తిరిగి చెల్లించమని కోరారు. అవి కూడా కింద ఇవ్వబడ్డాయి. పైన పేర్కొన్న వాటికి సంబంధించి, ఈ నోటీసు ప్రచురించబడిన 60 రోజులలోపు, ఇక్కడ క్రింద సూచించబడిన మొత్తాలను పైన పేర్కొన్న డిమాండ్ నోటీసులలో వివరించిన విధంగా, చెల్లింపు తేదీ మరియు లేదా రియలైజ్ చేయబడిన తేదీ వరకు, పైన పేర్కొన్న తేదీలను ఎమ్‌హెచ్‌ఐఎల్‌కి చెల్లించమని, రుణగ్రహీతలకు చెల్లించమని మరోసారి నోటీసు ఇవ్వబడింది. రుణం యొక్క సరైన చెల్లింపుకు భద్రతగా, కింది ఆస్తులను వరుసగా ఎమ్‌హెచ్‌ఐఎల్‌కి తనఖా పెట్టారు.

క్ర. సం.	రుణగ్రహీత(లు)/ సహ-రుణగ్రహీత(లు)/గ్యారంటర్/ లోన్ అకౌంట్ నెం./బ్రాంచ్	మొత్తం బకాయిలు (రూ.)	డిమాండ్ నోటీసు తేదీ	సెక్యూర్డ్ ఆస్తి (స్థిర ఆస్తి) యొక్క వివరణ
1.	అవిరంజన్ గిరీష్ సామల / రాజశ్రీ సామల/ హెచ్‌వైడి-హెచ్ఎల్-000916/ హైదరాబాద్.	రూ.41,52,362/- నలభై ఒక్క లక్షల యాభై రెండు వేల మూడు వందల అరవై రెండు రూపాయలు.	22 డిసెంబర్ 2025	తనఖా పెట్టడానికి ప్రతిపాదించబడిన ఆస్తి 45.19 చ.గ విస్తీర్ణంలో ఉంది, 3వ అంతస్తు, ఫ్లాట్ నెం.304, అన్విత ప్లాజా డో.నెం.19-202, విజయవాడ గ్రామీణ మండలం, ప్రసాదంపాడు గ్రామంలో ఆర్.ఎస్.నెం.66/9, 66/11, గుణదల సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, ఎన్‌టిఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్, అసెస్మెంట్ నెం.5263 వద్ద ఉంది. దీని **సరిహద్దు: తూర్పు:** ఓపెన్ టు స్కై, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **పశ్చిమం:** కారిడర్, **ఉత్తరం:** ఓపెన్ టు స్కై.

పైన పేర్కొన్న విధంగా రుణగ్రహీతలు ఎమ్‌హెచ్‌ఐఎల్ కి చెల్లింపు చేయడంలో విఫలమైతే, ఎమ్‌హెచ్‌ఐఎల్ చట్టంలోని సెక్షన్ 13(4) మరియు వర్తించే నిబంధనల ప్రకారం పైన పేర్కొన్న సెక్యూర్డ్ ఆస్తులపై చర్యలు తీసుకుంటుంది. ఖర్చులు మరియు పరిణామాలకు సంబంధించి పూర్తిగా రుణగ్రహీతల బాధ్యతపై ఎమ్‌హెచ్‌ఐఎల్ ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా, పైన పేర్కొన్న ఆస్తులను అమ్మకం, లీసు లేదా ఇతరత్రా బదిలీ చేయడం ఈ చట్టం ప్రకారం నిషేధించబడింది. ఈ చట్టంలోని నిబంధనలను లేదా దాని కింద రూపొందించిన నీయమాలను ఉల్లంఘించిన లేదా ఉల్లంఘించడానికి ప్రోత్సహించిన ఏ వ్యక్తి అయినా చట్టం ప్రకారం జైలు శిక్ష మరియు లేదా జరిమానాకు గురవుతారు.

తేదీ : డిసెంబర్ 30, 2025
స్థలం : విజయవాడ.

ఎస్‌డి/- అధీకృత అధికారి,
ముత్తూట్ హోమ్‌ఫిన్ (ఇండియా) లిమిటెడ్

ఈశాన్య రాష్ట్రాల విద్యార్థులపై దాడులు ఆపాలి

- తక్షణమే జోక్యం చేసుకోవాలని కేంద్రానికి వినతి

అగర్తలా : ఈశాన్య రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు, యువతపై దేశంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న దాడుల గురించి తక్షణమే జోక్యం చేసుకోవాల్సిందిగా త్రిపుర చక్మా స్టూడెంట్స్ అసోసియేషన్ కేంద్రాన్ని కోరింది. ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో త్రిపుర విద్యార్థి ఏంజెల్ చక్మాపై తీవ్రంగా దాడి చేయడం, ఆ తర్వాత ఆ దెబ్బలతో అతను ఆస్పత్రిలో మరణించిన కేసును చక్మా స్టూడెంట్స్ అసోసియేషన్ ప్రస్తావించింది. ఆదివారం అగర్తలా జరిగిన పత్రికా సమావేశంలో ఈ మేరకు డిమాండ్ చేసింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా చక్మా విద్యార్థి సమాఖ్య నేతలు ప్రభుత్వాన్ని కోరారు. ఈశాన్య ప్రాంతానికి చెందిన వారిపై అవమానకరమైన వ్యాఖ్యలు, విద్వేషపూరితమైన మాటలు, ప్రచారం ఆపాలని డిమాండ్ చేశారు. ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు పునరావృతమైతే తీవ్ర పర్యవసానాలు ఎదుర్కొనాల్సి వస్తుందని సమాఖ్య హెచ్చరించింది. సోమవారం అగర్తలాలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించామని, మంగళవారం ముఖ్యమంత్రికి మాణిక్ సాహాకు మెమోరాండం ఇవ్వనున్నట్లు నేతలు తెలిపారు. ఈ విషయమై త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సాహా ఉత్తరాఖండ్ సిఎం పుష్కర్ సింగ్ దామితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పూర్తి దర్యాప్తు జరిపి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని దామి హామీ ఇచ్చారని తెలిపారు. ఈ విషాదకర ఘటన నేపథ్యంలో త్రిపురలో నిరసనలు పెల్లుబికాయి. ఈ కేసుకు సంబంధించి ఐదుగురిని అరెస్టు చేశారు. మరొకరి కోసం గాలింపు జరుపుతున్నారు.

భారీగా తగ్గిన వెండి ధర

రూ.21వేలు పతనం

బిజినెస్ డెస్క్ : వెండి ధర భారీగా తగ్గింది. ఇప్పటి వరకూ ఆకాశమే హద్దుగా దూసుకెళ్లిన ధరకు బ్రేక్ పడింది. ఫ్యూచర్ మార్కెట్‌లో ఒక్కసారిగా కిందకు పడింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో మార్చి కాంట్రాక్ట్ వెండి కిలో ధర గంటలోనే రూ.21 వేలు మేర తగ్గింది. సోమవారం ఇంట్రాడేలో రూ.2,54,174 వద్ద గరిష్టాన్ని తాకిన కిలో వెండి ధర రూ.2,33,120 వద్ద కనిష్టాన్ని తాకింది. అటు స్పాట్ మార్కెట్‌లో కూడా వెండి ధర దిగి వచ్చింది. రూ.2.50 లక్షలు పైబడి పలికిన కేజీ వెండి ధర హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మధ్యాహ్నం 3 గంటల సమయానికి రూ.2.39 లక్షల స్థాయికి దిగి వచ్చింది. భౌగోళిక అనిశ్చితుల కారణంగా ఇటీవల బంగారం, వెండికి ఎక్కడా లేని డిమాండ్ ఏర్పడింది. ముఖ్యంగా వెండి ఎన్నడూలేని రీతిలో దూసుకెళ్లింది. అంతర్జాతీయ మార్కెట్‌లో 50 డాలర్ల దిగువనే ట్రేడవుతూ వచ్చిన వెండి ఒక్కసారిగా ఇటీవల భారీగా దూసుకెళ్లింది. దీంతో సోమవారం ఓ దశలో 80 డాలర్లు పైకెగిసింది. గరిష్టాల వద్ద ప్రాఫిట్ బుకింగ్ కారణంగా భారీగా దిగి వచ్చింది.

కారణాలు ఇవీ..

రష్యా - ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం విషయంలో కీలక అడుగు పడింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ భేటీ అయ్యారు. శాంతి ఒప్పందం కుదుర్చుకునేందుకు పుతిన్, జెలెన్స్కీ ఇద్దరూ పూర్తి సుముఖంగా ఉన్నట్లు ట్రంప్ ప్రకటించడం యుద్ధానికి తెరపడుతుందన్న అంచనాల వేళ వెండి ధర పతమైంది. ప్రపంచంలో అతిపెద్ద డెరివేటివ్స్ ఎక్స్ఛేంజ్‌లను నిర్వహిస్తోంది. 2026 మార్చి ఫ్యూచర్ కాంట్రాక్ట్‌కు సంబంధించిన మార్జిన్‌ను 20వేల డాలర్ల నుంచి 25వేల డాలర్లకు పెంచింది. దీంతో అధిక రిస్క్ తీసుకునే వారు వెనకడుగు వేయడంతో వెండిలో ఒక్కసారిగా అమ్మకాల ఒత్తిడి పెరగడానికి కారణమని అనలిస్టులు పేర్కొంటున్నారు.

బంగారం ధర కూడా..

బంగారం ధరలు ఎట్టకేలకు తగ్గాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, సోమవారం మధ్యాహ్నం 12.00 గంటల సమయంలో చెన్నైలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.870 తగ్గి రూ.1,42,040కు చేరుకుంది. మరోవైపు, 22 క్యారెట్ గోల్డ్ ధర రూ.800 మేర తగ్గి రూ.1,30,200కు చేరింది బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో కూడా బంగారం ధరలు తగ్గాయి. 24 క్యారెట్ 10 గ్రాముల బంగార ధర రూ.710 మేర తగ్గి రూ.1,41,710కు చేరుకుంది. 22 క్యారెట్ గోల్డ్ ధర కూడా 1,29,900కు చేరింది.

ఆరావళిపై ఉన్నతస్థాయి కమిటీ

- సుప్రీం ప్రతిపాదన
- గతంలో జారీ చేసిన తీర్పు నిలిపివేత

న్యూఢిల్లీ : ప్రపంచంలోనే అత్యంత ప్రాచీనమైన ఆరావళి పర్వత శ్రేణులపై గతంలో (నవంబరు 20న) తాము ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సోమవారం నిలిపివేసింది. దీనిపై పునరాలోచనకు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. వంద మీటర్లు అంతకుమించి ఎత్తుగలిగిన శిఖరాలను, అలాగే 500మీటర్ల పరిధిలో వుండే పర్వత సముదాయాలను మాత్రమే ఆరావళి పర్వతాలుగా గుర్తిస్తామని సుప్రీం ఆనాటి తీర్పులో పేర్కొంది. ఆ తీర్పును ప్రస్తుతం నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఆరావళి పర్వత శిఖరాలకు సంబంధించి ప్రభుత్వం సరికొత్త నిర్వచనం ఇవ్వడంపై తీవ్రమైన ఆందోళనలు చెలరేగాయి. ముఖ్యంగా ఆరావళి పర్వత శ్రేణులు వున్న రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, హర్యానా, ఢిల్లీల్లో ప్రజాందోళనలు పెల్లుబికాయి. ప్రభుత్వం తీసుకున్న చర్య వల్ల పర్వతాల్లో అక్రమ మైనింగ్ పెచ్చరిల్లుతుందని పర్యావరణవేత్తలు, సామాజిక కార్యకర్తలు ఆందోళన తెలిపారు. థార్ ఎడారి తూర్పు దిశగా విస్తరించకుండా గ్రీన్ బారియర్‌గా ఈ పర్వతాలు నిలిచాయి. అలాగే ఢిల్లీ సహా పలు నగరాల్లో కాలుష్యం మరింత విస్తరించకుండా అడ్డుకుంటున్నాయి.

ప్రభుత్వం తీసుకువచ్చిన నిర్వచనాన్ని సుప్రీం కూడా నవంబరు 20న సమర్ధించింది. రాజస్థాన్‌లో మొత్తంగా 12,081 పర్వత శిఖరాలు వుండగా, అందులో వంద మీటర్ల ఎత్తు ఉన్నవే శిఖరాలుగా ఆ నిర్వచనం తెలిపింది. అయితే వంద మీటర్లలోపు ఉన్నవి కేవలం 1048 పర్వతాలు మాత్రమే వున్నాయి. ఈ నేపథ్యంలో తక్కువ ఎత్తుగల పర్వతాలన్నీ ధ్వంసమై పోతాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీం త్రిసభ్య ధర్మాసనం ఈ ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని విచారించి, తాజా ఆదేశాలు వెలువరించింది. సంబంధిత అంశాలను శాస్త్రీయంగా నిర్ధారించాల్సి వుందని అభిప్రాయపడింది. ప్రభుత్వ కమిటీ గతంలో ఇచ్చిన నివేదికపై పున:పరిశీలనకు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు బెంచ్ స్పష్టం చేసింది. ప్రభుత్వ కమిటీ ఇచ్చిన సిఫార్సుల వల్ల కలిగే స్వల్పకాల, దీర్ఘకాల పర్యావరణ ప్రభావాలను పరిశీలించాల్సి వుందని పేర్కొంది. శాస్త్రీయంగా, భౌగోళికంగా అంచనాలన్నింటినీ కూలంకషంగా పరిశీలించి, సమీక్షించిన అనంతరమే ఆరావళి పర్వత శ్రేణి నిర్వచనంపై ఒక అంచనాకు వస్తామని కోర్టు తెలిపింది.

సుప్రీం ఇచ్చిన తాజా తీర్పు ఈ ప్రాంతంలో తాజాగా మైనింగ్ లీజులు జారీ చేయడాన్ని ఆపేసింది. మరికొన్ని వివరణలు అవసరమవుతున్నాయి, స్వతంత్ర నిపుణుల అభిప్రాయాలను తీసుకోవాల్సి వుంది, అన్ని పక్షాలతో చర్చలు జరిపిన తర్వాత వాటిని పరిశీలించాల్సి వుంది. ఇందులోని అస్పష్టతలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా వుంది, అలాగే నిర్దిష్టమైన మార్గదర్శకాలు కూడా అందించాల్సి వుందని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ కేంద్రం తరపున వాదనలు వినిపిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు చెప్పారు. పర్యావరణపరమైన అంశాలపై రాజీపడకుండా ఆరావళి పర్వతాలను నిర్వచించేందుకు నిర్దిష్ట, ప్రత్యేక ప్రామాణికాలు రూపొందించాల్సిన ఆవశ్యకత వుందని బెంచ్ పేర్కొంది. దీనిపై తదుపరి విచారణను జనవరి 21వ తేదీకి వాయిదా వేశారు.

ప్రైవేటు రుణాల సెటిల్‌మెంట్ల కేసులో ఇడి దాడులు

ఢిల్లీ, హర్యానాల్లో సోదాలు

న్యూఢిల్లీ : ప్రైవేటు ఫైనాన్షియర్ల నుండి తీసుకున్న రుణాల విషయంలో బెదిరింపులు, బలవంతపు వసూళ్ళకు సంబంధించిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఢిల్లీ, హర్యానాల్లో 10చోట్ల సోదాలు నిర్వహించింది. ఈ రెండు రాష్ట్రాల్లో పోలీసులు, నిందితులపై నమోదు చేసిన 15కి పైగా ఎఫ్ఐఆర్‌లు, చార్జిషీట్‌ల ఆధారంగా దర్యాప్తులు ప్రారంభమయ్యాయి. ఇందర్‌జిత్ సింగ్ యాదవ్ ఆయన అనుచరులు, అపోలో గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్, ఇతర అనుబంధ సంస్థలు, వ్యక్తులకు సంబంధించిన నమోదైన మనీ లాండరింగ్ కేసులో ఇడి ఈ దర్యాప్తు చేపట్టింది. హత్య, బలవంతపు వసూళ్ళు, ప్రైవేటు వ్యక్తులు ఇచ్చిన రుణాల సెటిల్‌మెంట్లు, మోసం, అవినీతి, అక్రమంగా భూ కబ్జాలు వంటి పలు నేరపూరిత కార్యకలాపాల్లో ఇందర్‌జిత్ సింగ్ యాదవ్‌కు ప్రమేయం వుంది. ఇవే కాకుండా అనేక ఇతర కేసుల్లో కూడా హర్యానా పోలీసులు వెతుకుతున్నారు. ప్రస్తుతం పరారీలో వున్న యాదవ్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుండి తన పనులు చక్కబెడుతున్నాడని ఇడి తెలిపింది.

రాయ్‌పూర్-విశాఖపట్నం ఆర్థిక కారిడార్‌లోనూ ఇడి దాడులు

భరత్‌మాలా ప్రాజెక్టుకు సంబంధించి భూ సేకరణ కోసం నష్టపరిహారం చెల్లింపుల్లో జరిగిన అవకతవకలపై, మనీ లాండరింగ్‌పై దర్యాప్తులో భాగంగా సోమవారం ఉదయం చత్తీస్‌ఘడ్ వ్యాప్తంగా 9చోట్ల ఇడి ఒకేసారి దాడులు నిర్వహించింది. ప్రైవేటు వ్యక్తులు, వారి సహచరులు, ప్రభుత్వ అధికారులకు చెందిన పలు ప్రాంతాలకు ఇడి బృందాలు చేరుకుని దర్యాప్తు మొదలుపెట్టాయి. నేషనల్ హైవే అభివృద్ధికి కీలక భాగమైన రాయ్‌పూర్-విశాఖపట్నం ఆర్థిక కారిడార్‌కు నష్టపరిహారం చెల్లింపులో మోసం జరిగినట్లు అనుమానిస్తున్నారు. దీనిపై దృష్టి పెడుతూ పిఎంఎల్ఎ నిబంధనల కింద ఇడి ఆపరేషన్ చేపట్టింది. సైట్‌ల్లో ఆర్థిక రికార్డులను, డాక్యుమెంట్లను అధికారులు పరిశీలిస్తున్నారు. స్థానిక పోలీసుల సాయంతో రోజంతా సోదాలు జరిగాయని అధికారులు తెలిపారు. 2020-2024 మధ్య కాలంలో భూమి సేకరణ దశలో కోట్లాది రూపాయిలు స్వాహా అయ్యాయని అనేక ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వాటిపై రాష్ట్ర సంస్థలు గతంలో చేసిన దర్యాప్తులకు కొనసాగింపుగా ఇడి దాడులు చేపట్టింది.

కేరళ మోడల్

- అత్యంత పేదరిక నిర్మూలనకు ప్రత్యేక ప్రణాళికలు
- మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేరళ తరహాలో అత్యంత పేదరిక నిర్మూలన కోసం తెలంగాణ రాష్ట్రంలోనూ ప్రత్యేక ప్రణాళికలు రూపొందించనున్నట్టు, ఈ ప్రణాళికతో పేదవారిని గుర్తించి ఇళ్లు, ఉపాధి అవకాశాలు, వైద్య సంరక్షణ వంటి సహాయాలు అందించనున్నట్టు మహిళా, శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షుల సమావేశంలో ఆమె సర్పంచులను సన్మానించారు. జిల్లాల వారీగా నెల రోజులపాటు మహిళా సంఘాలు, సమాఖ్యలు నిర్వహించిన కార్యకలాపాలను ఆమె సమీక్షించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన వారిని మహిళా సంఘాలు గుర్తిస్తే, వారి అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్టు చెప్పారు. వారిని గుర్తించేందుకు అవసరమైన ప్రొఫార్మాను త్వరలోనే అందజేస్తామన్నారు. కేరళలో సర్వే ద్వారా 64,006 కుటుంబాల్లోని దాదాపు లక్ష మంది తీవ్రమైన పేదరికంలో ఉన్నట్టు గుర్తించి, ఆయా కుటుంబాల అవసరాలకు వీలుగా ప్రత్యేక మైక్రో ప్లాన్‌ను రూపొందించినట్టు వివరించారు. ఇదే తరహాలో తెలంగాణలోనూ మైక్రోప్లాన్ రూపొందిస్తామన్నారు. ఈ మైక్రోప్లాన్‌లో పేదలకు గుర్తింపు కార్డులు, ఇళ్లు, ఉపాధి అవకాశాలు, వైద్య సంరక్షణ వంటి సహాయాలు అందించనున్నట్టు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాలు, వలంటరీ ఆర్గనైజేషన్స్, ప్రజలను సమీకరించి కేరళ ఈ లక్ష్యాన్ని సాధించిందని, అదే తరహాలో తెలంగాణలో మహిళా సంఘాలు భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. జిల్లా మహిళా సమాఖ్యలు ఏర్పాటు చేసిన నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని కేక్‌కట్ చేసి మహిళా సంఘ సభ్యులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సిఇఒ దివ్య దేవరాజన్ తదితరులు పాల్గొన్నారు.

'శాంతి ఒప్పందం'పై అదే సందిగ్ధత

- అయితే ఒప్పందానికి చేరువగా ఉన్నామని ట్రంప్, జెలెన్స్కీ ఆశాభావం
- 'భూభాగం'పై అంగీకారం కుదరలేదన్న నేతలు

విలేకరులతో మాట్లాడుతున్న జెలెన్స్కీ, ట్రంప్

ఫ్లోరిడా : రష్యా-ఉక్రెయిన్ మధ్య త్వరలోనే శాంతి ఒప్పందంపై అదే సందిగ్ధత కొనసాగుతోంది. అమెరికా, ఉక్రెయిన్ అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్, జెలెన్స్కీ మధ్య తాజాగా జరిగిన సమావేశంలోనూ ఈ ఒప్పంద ఖరారు కాలేదు. అయితే ఈ ఒప్పందానికి అతి చేరువగా ఉన్నామని ఇరు నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరువురు నేతలు ఆదివారం ఫ్లోరిడాలోని మార్-ఏ-లాగో ఎస్టేట్‌లో సమావేశమయ్యారు. అనంతరం జెలెన్స్కీతో కలిసి ట్రంప్ విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రష్యా, ఉక్రెయిన్ దేశాలు శాంతి ఒప్పందానికి చేరువయ్యాయని తెలిపారు. అంతకుముందు ఆయన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ఫోన్‌లో సంభాషించారు. యుద్ధానికి ముగింపు పలికే విషయంలో ఎంతో పురోగతి సాధించామని ట్రంప్ చెప్పారు. గత వారం ట్రంప్ ప్రతిపాదించిన 20 సూత్రాల శాంతి ప్రణాళికపై 90 శాతం అంగీకారం కుదిరిందని జెలెన్స్కీ అన్నారు. ఉక్రెయిన్‌కు 15 ఏళ్లపాటు భద్రతా హామీని అమెరికా ఇచ్చిందని జెలెన్స్కీ తెలిపారు. కానీ, తాము 50 ఏళ్ల పాటు అమెరికా నుంచి భద్రతా హామీని ఇష్టపడతామని చెప్పారు. సరైనా భద్రతా హామీలు లేకుండా సంఘర్షణ ముగియదని జెలెన్స్కీ స్పష్టం చేశారు.

ఒకటి రెండు అంశాలు అపరిష్కృతంగానే ఉన్నాయి : ట్రంప్

ఆదివారం సమావేశంలో ఉక్రెయిన్ భూభాగంపై చర్చల సందర్భంగా ఎలాంటి పురోగతి కన్పించలేదని, ఒకటి రెండు సంక్లిష్టమైన అంశాలు అపరిష్కృతంగానే ఉన్నాయని ట్రంప్ అంగీకరించారు. తూర్పు డాన్‌బాస్ ప్రాంతంతో పాటు, కొన్ని భాగాలలో 'స్వేచ్ఛా ఆర్థిక మండలి'ని ఏర్పాటు చేయాలన్న అమెరికా ప్రతిపాదనపై ఒప్పందానికి ఇరు పక్షాలు చేరువయ్యాయని ట్రంప్ చెప్పారు. 'అంగీకారం కుదిరిందని నేను చెప్పలేను. అయితే దానికి చేరువయ్యాం. భూభాగాలు పెద్ద సమస్యలలో అది ఒకటి. అది పరిష్కారం కాలేదు' అని తెలిపారు.

భూభాగం సమస్యపై నిర్ణయం తీసుకోవాల్సింది ఉక్రెయిన్ ప్రజలేనన్న తన వైఖరిని జెలెన్స్కీ పునరుద్ఘాటించారు. శాంతి ప్రణాళికలోని పలు అంశాలను ప్రజల ముందు ఉంచి రిఫరెండం కోరతామని చెప్పారు. 'మా సమాజమే నిర్ణయం తీసుకోవాలి. ఎందుకంటే అది వారి భూమి. ఏ ఒక్కరిదో కాదు. అది మా దేశ భూభాగం...అనేక తరాలకు చెందింది' అని అన్నారు. కాగా, జెలెన్స్కీ ఫ్లోరిడా చేరుకోక ముందు పుతిన్‌తో ట్రంప్ గంటకు పైగా ఫోన్‌లో మాట్లాడారు. జెలెన్స్కీతో భేటీ తర్వాత మరోసారి మాట్లాడారు. పుతిన్‌తో మంచి సంభాషణ జరిగిందని, అది ఫలప్రదంగా ఉన్నదని తెలిపారు.

డిజిటల్ అరెస్ట్‌తో రూ. 3.71 కోట్లు మోసం

- గుజరాత్‌లో ఒకరు అరెస్టు

ముంబయి : డిజిటల్ అరెస్టు గురించి ఎవరెంతగా ప్రజలను చైతన్యవంతులను చేసినా ఉపయోగం వుండడం లేదు. తాజాగా ఈ కుంభకోణంలో ఒక మహిళ రూ.3.71కోట్లు పోగొట్టుకున్నారు. దక్షిణ ముంబయిలోని కొలాబా పోలీసు స్టేషన్‌కు చెందిన సిబ్బందిగా, అలాగే కేంద్ర దర్యాప్తు సంస్థల ఉద్యోగులుగా సైబర్ నేరస్తులు వలపన్ని ముంబయికి చెందిన 68ఏళ్ళ వృద్ధురాలి నుండి ఈ మొత్తాలను లాక్కున్నారు. పైగా బూటకపు ఆన్‌లైన్ కోర్టు విచారణను కూడా వారు నిర్వహించారు. అందులో ఒక వ్యక్తి జస్టిస్ చంద్రచూడ్ నంటూ బాధితురాలికి చెప్పి మరీ విచారణ సాగించాడని పోలీసు అధికారులు సోమవారం వెల్లడించారు. ఇందుకు సంబంధించి గుజరాత్‌కు చెందిన ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

మనీ లాండరింగ్ కేసులో డిజిటల్ అరెస్టయ్యారని, నిరంతర నిఘాలో వున్నారంటూ అంధేరి వెస్ట్‌లో వుండే బాధితురాలిని సైబర్ నేరగాళ్ళు భయపెట్టారు. ఆగస్టు 18న బ్యాంక్ ఖాతా నుండి మనీ లాండరింగ్ జరిగిందంటూ, కొలాబా పోలీసు స్టేషన్ నుండి మాట్లాడుతున్నామంటూ ఒక ఫోన్ కాల్ వచ్చింది. ఈ విషయం ఎవరికీ చెప్పొద్దంటూ ఆమెను బెదిరించి, బ్యాంక్ ఖాతా వివరాలు దుండగులు తీసుకున్నారు. దర్యాప్తును సిబిఐకి బదిలీ చేశామని,ఆ తర్వాత మిమ్మల్ని తాము నమ్ముతున్నామని, బెయిల్ వస్తుందని హామీ ఇచ్చాడని పోలీసులు వెల్లడించారు.. ఆ తర్వాత నేరగాళ్ల ఆమెను జస్టిస్ చంద్రచూడ్ అంటూ ఒక వ్యక్తి ముందు విచారణ కోసమని హాజరుపరిచారు. వివరాలను పరిశీలించాలంటూ పెట్టుబడుల వివరాలను అందచేయాలని చెప్పి బ్యాంకు ఖాతాల నుండి రెండు నెలల కాలంలో రూ.3.75కోట్లును ట్రాన్స్‌ఫర్ చేయించారని పోలీసులు తెలిపారు. తదనంతరం ఆమెకు ఎటువంటి కాల్స్ రాలేదు. దాంతో ఆమె ఆన్‌లైన్ మోసానికి బలయ్యానని గుర్తించి వెస్ట్ రీజియన్ సైబర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.. దర్యాప్తులో అనేక మ్యూల్ (బూటకపు) ఖాతాలకు డబ్బు బదిలీ అయినట్లు తేలింది. వాటిలో ఒకటి సూరత్‌లో వున్నట్లు వెల్లడైంది. ఈ రాకెట్ వెనుకగల సూత్రధారులు ప్రస్తుతం విదేశాల్లో ఉన్నారని పోలీసులు తెలిపారు.

బంగ్లాదేశ్ ఎన్నికల బరిలో తారిఖ్ రెహమాన్

- ఢాకా-17 నుంచి నామినేషన్ దాఖలు

ఢాకా: బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) తాత్కాలిక ఛైర్మన్, మాజీ ప్రధాని ఖలీదా జియా కుమారుడు తారిఖ్ రెహమాన్ రానున్న ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. ఈ మేరకు సోమవారం నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఢాకా-17 నియోజకవర్గం నుంచి రెహమాన్ నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట స్నేహితులు, బిఎన్‌పి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెహమాన్ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఉన్నావో అత్యాచార కేసులో సుప్రీం స్టే

(మొదటిపేజీ తరువాయి)

కింద 'ప్రజా సేవకుడు (పబ్లిక్ సర్వెంట్)' అనే పదానికి హైకోర్టు ఇచ్చిన వివరణ తప్పుగా ఉందని, చివరికి చట్టాన్ని రూపొందించేవారిని మినహాయింపుకు దారి తీస్తుందని సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. "చట్టపరమైన సమస్యను పరిగణనలోకి తీసుకోవాలి. ఈ ఉత్తర్వును జారీ చేసిన హైకోర్టు న్యాయమూర్తులు అత్యుత్తమ న్యాయమూర్తులు. కానీ మనమందరం తప్పులు చేసే అవకాశం ఉంది. దయచేసి పోక్సో కింద "పబ్లిక్ సర్వెంట్" అనేదానికి ఈ నిర్వచనాన్ని చూడండి. చట్టం ప్రకారం ఒక కానిస్టేబుల్ ప్రభుత్వ సేవకుడిగా ఉంటాడని, కానీ శాసనసభ సభ్యుడు మినహాయించడంపై మేము ఆందోళన చెందుతున్నాము" అని అత్యున్నత ధర్మాసనం పేర్కొంది. సిబిఐ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించగా సెంగార్ తరపున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ దవే, ఎన్. హరిహరన్‌లు వాదించారు.. ఉన్నావో అత్యాచారం కేసు బాధితురాలు స్పందిస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టు స్టే ఇవ్వడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. న్యాయ వ్యవస్థపై తనకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. "ఈ నిర్ణయంతో నేను చాలా సంతోషంగా ఉన్నాను. సుప్రీంకోర్టు నుండి నాకు న్యాయం లభించింది. నేను మొదటి నుంచీ న్యాయం కోసం నా గొంతును వినిపిస్తున్నాను" అని బాధితురాలు అన్నారు. "నేను ఏ కోర్టుపైనా ఎటువంటి ఆరోపణలు చేయను. నాకు అన్ని కోర్టులపై నమ్మకం ఉంది. కానీ సుప్రీంకోర్టు నాకు న్యాయం చేసింది. అలానే న్యాయం కోసం పోరాటం కొనసాగుతుంది" అని ఆమె అన్నారు.

ఇక 28 జిల్లాలు

(మొదటిపేజీ తరువాయి)

చేసే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు 2024 జనవరి 1 నుంచి 3.64శాతం డిఎ, డిఆర్ పెంపు అమలు చేస్తూ, 2025 అక్టోబర్ జీతం నుంచి ప్రయోజనం అందించేందుకు ఆమోదం తెలిపింది. ఎన్ఎస్ఎఫ్‌డిసి, ఎన్ఎస్‌కెఎఫ్‌డిసి సహకారంతో రుణం తీసుకున్న ఎస్‌సి లబ్ధిదారులకు రూ.41.61 కోట్ల బకాయి వడ్డీని 4 నెలల వ్యవవధి చెల్లించే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. అమరావతి రాజధానిలో అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణానికి రూపకల్పన, నిర్మాణ విధానంలో టెండర్ మంజూరు చేసే ఈ ప్రాజెక్టుకు రూ.137 కోట్ల పరిపాలనా ఆమోదం ఇచ్చింది. దీనిని టూబ్రో సంస్థకు కాంట్రాక్టు కేటాయించేందుకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ చేసిన ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఉండవల్లి వద్ద ఫ్లడ్ పంపింగ్ స్టేషన్-2కు 15 ఏళ్ల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనిని ఎల్ 1 బిడ్‌ను ఆమోదించేందుకు అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు అధికారం ఇచ్చింది. మంగళగిరి - తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌లో వికేంద్రీకరణ అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్, మురుగునీటి శుద్ధి కేంద్ర నిర్మాణానికి పురపాలక పట్టణాభివృద్ధి శాఖ చేసిన ప్రతిపాదనకు ఆమోదం. ఈ ప్రాజెక్టులను హైబ్రిడ్ అన్యూటీ మోడల్ కింద రెండు దశల్లో అమలు చేయనున్నారు. తిరుపతిలో లగ్జరీ హోటల్‌కు కేటాయించిన ఐదెకరాల ప్రభుత్వ భూమి లీజును రద్దు చేసింది. ఈ సమావేశంలో సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కెఎస్ విశ్వనాథన్ పాల్గొన్నారు.

ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో మంటలు

(మొదటిపేజీ తరువాయి)

అందిస్తామని డిఆర్ఎం తెలిపారు. రైల్వే క్లూస్ టీం, ఫోరెన్సిక్ టీం వారు రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. దర్యాప్తు అనంతరం ప్రమాదానికి కారణాలను వెల్లడిస్తామని డిఆర్ఎం తెలిపారు.

కదిలిన అనకాపల్లి జిల్లా యంత్రాంగం

రైలు ప్రమాదం విషయం తెలిసిన వెంటనే అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్‌పి తుహిన్ సిన్హా తమ పరివారంతో అక్కడకు వచ్చి పరిశీలించారు. స్థానిక రెవెన్యూ అధికారులు ప్రయాణికులకు అల్పాహారం అందించి, వారిని బస్సుల్లో పంపించే ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే డిఐజి బి.సత్య ఏసుబాబు, అనకాపల్లి ఆర్‌డిఒ షేక్ అయేషా, యలమంచిలి తహశీల్దార్ వరహాలరావు యలమంచిలి సిఐ ధనుజయరావు, ఎస్ఐ సావిత్రి, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

విజయవాడలో డిసెంబరు31, జనవరి1న విచారణ

టాటానగర్- ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో అగ్నిప్రమాదంపై దక్షిణ మధ్య రైల్వే విచారణకు ఆదేశించింది. రైల్వే భద్రతా కమిషనరు మాధవి నేతృత్వంలో ఈనెల 31న, జనవరి 1న విజయవాడ సత్యనారాయణపురంలోని ఎలక్ట్రిక్ ట్రాక్షన్ ట్రైనింగ్ సెంటర్ (ఇటిటిసి)లో చట్టబద్ధమైన విచారణ చేపట్టనున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు, సాక్ష్యాలు ఇవ్వాలనుకునే వారు విచారణ తేదీల్లో నేరుగా లేదా లేఖ రూపేణా తెలియజేయవచ్చని పేర్కొన్నారు. పోస్టల్‌లో వివరాలు తెలపాలనుకునే వారు రైల్వే భద్రతా కమిషనరు కార్యాలయం, సౌత్ సెంట్రల్ సర్కిల్, రైల్ నిర్మాన్ భవన్ (రైల్వే నిలయం ఎదురుగా) సరోజిని దేవి రోడ్డు, సికింద్రాబాద్ -500 025 లేదా ఫోన్ నెంబరు 040 27820104 నెంబరును సంప్రదించవచ్చని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది.

హెల్ప్‌లైన్ నెంబర్లు ఇవే:

రైలు ప్రమాదంలో బాధితుల గురించి సమాచారం తెలుసుకోవాలనుకునే వారి సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే హెల్ప్ లైన్‌ను ఏర్పాటు చేసింది. ఎలమంచిలి :7815909386, అనకాపల్లి :7569305669, తుని :7815909479, సామర్లకోట: 7382629990, రాజమండ్రి:9883 2420541/43, ఏలూరు:7563905268, విజయవాడ: 0866 2575167 నెంబర్లను ప్రకటించింది.

పిఎసిఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- వేలాదిగా తరలివచ్చిన ఉద్యోగులు
- పలు పార్టీలు, ప్రజా సంఘాల మద్దతు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సహకార సంఘాల ఉద్యోగుల నిరసనలో అభివాదం చేస్తున్న నాయకులు

సహకార సంఘాల ఉద్యోగుల నిరసనతో ధర్నా చౌక్ దద్దరిల్లింది. ఎపి రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్య వేదిక ఆధ్వర్యాన విజయవాడలోని ధర్నా చౌక్‌లో సోమవారం నిర్వహించిన మహాధర్నా కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి వేలాదిమంది సహకార సంఘాల ఉద్యోగులు తరలివచ్చారు. ధర్నాచౌక్ నిండిపోవడంతో రోడ్లపైనే అనేకమంది ఉద్యోగులు కూర్చుని నిరసన తెలిపారు. సాంబమూర్తి రోడ్డులో ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించి అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పిఎసిఎస్ ఉద్యోగులు ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించే వరకూ ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. తదుపరి కార్యాచరణ త్వరలోనే వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు. మహాధర్నానుద్దేశించి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఉద్యోగులను తొలగించడం దుర్మార్గమన్నారు. ఈ విధానానికి స్వస్తి పలకాలన్నారు. పిఎసిఎస్‌లలో హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు గ్రాట్యుటీ రూ.5 లక్షలు చెల్లించాలని కోరారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ.. అంగన్వాడీలు, ఆశాలు ఉద్యమాలు చేసి తమ హక్కులను సాధించుకున్నారని, పిఎసిఎస్ ఉద్యోగులు అదే తరహాలో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. దశాబ్దకాలంగా వేతన సవరణ లేకపోవడంతో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం గతంలో జారీ చేసిన జిఒలను వెంటనే అమలు చేయాలన్నారు. రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ.. ఉద్యోగుల ఉద్యమాలకు ఎపి రైతు సంఘం పూర్తి మద్దతు ఉంటుందన్నారు. సంయుక్త కిసాన్ మోర్చాలో సభ్యులుగా ఉన్న 500 సంఘాలు ఉద్యోగులకు అండగా ఉంటాయన్నారు. దుక్కిదున్నిన నాటి నుంచి పంట విక్రయించే వరకూ రైతులకు రుణ, రుణేతర సేవలను అందిస్తుంది సహకార సంఘాలు, వాటిలో పని చేసే ఉద్యోగులేనని అన్నారు. సహకార సంఘాలను కేంద్రం తన ఆధీనంలోకి తీసుకుని, వ్యవసాయాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే విధంగా మార్గదర్శకాలు ఇస్తుందన్నారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావుల రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. 42 కార్మిక చట్టాల స్థానంలో కేంద్రం 4 లేబర్ కోడ్లను గత నెల 21 నుంచి అమల్లోకి తెచ్చిందన్నారు. కార్మికులకు పని గంటలను 8 నుంచి 12కు పెంచిందని తెలిపారు. ఎపి స్టేట్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు పి.అజయ్ కుమార్ మాట్లాడుతూ.. జిఒ 36 ప్రకారం డిఎల్ఎస్ఎఫ్ ఏర్పాటు చేసి ఉద్యోగులందరికీ జీతభత్యాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్ మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా పిఎసిఎస్ ఉద్యోగులు పదోన్నతులు, ఇంక్రిమెంట్లు లేకుండా పని చేస్తున్నారని చెప్పారు. జెఎసి నాయకులు టి.వెంకటరామయ్య, రఘురామ్ మాట్లాడుతూ.. కుంటి సాకులతో జిఒ 36ను అమలును అడ్డుకుంటున్నారని తెలిపారు. సహకార శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆ శాఖ ప్రత్యేక కార్యదర్శికి సమస్యలు పరిష్కారించాలని సూచించినా ఇప్పటివరకూ పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ఉద్యోగులకు ప్రతి ఐదేళ్లకు తప్పనిసరిగా వేతన సవరణ చేయాలని, గ్రాట్యుటీ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ఉద్యోగ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, సహకార సంఘాల ఉద్యోగుల జెఎసి నాయకులు పి.సత్యనారాయణ, గంగరాజు, రామాంజనేయులు, వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

చైనాలో కంబోడియా, థాయిలాండ్ మంత్రుల భేటీ

బీజింగ్ : కంబోడియా, థాయిలాండ్ శాంతి చర్చల నిమిత్తం ఆ దేశాల మంత్రులు చైనాలోని యునాన్ ప్రావిన్స్‌లో రెండు రోజుల పాటు ఈ సమావేశమయ్యారు.. రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందంపై సంతకాలు జరిగిన తరువాత ఈ భేటీ జరగడం గమనార్హం. అలాగే, ఈ సమావేశం చైనా రాజధానిలో కాకుండా సరిహద్దులకు దగ్గరగా ఉన్న యునాన్‌లో జరగడం విశేషం. ఇది ఆగ్నేయాసియాకు, వివాదాలు జరుగుతున్న ప్రాంతానికి దగ్గరగా ఉంటుంది. ఈ త్రైపాక్షిక సమావేశానికి మధ్యవర్తిగా చైనా వ్యవహరించింది. థాయిలాండ్ మంత్రి సిహాసక్ పువాంగ్కెట్‌కియో, కంబోడియా మంత్రి ప్రాక్ సోఖోన్‌లతో సమావేశం తరువాత చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి విలేకరులతో మాట్లాడుతూ ప్రాంతీయ శాంతి, స్థిరత్వం, అభివృద్ధిని ప్రోత్సహించడానికి ఉమ్మడి ప్రయత్నాలకు పిలుపునిచ్చారు. యుద్ధ పరిస్థితులు తలెత్తకుండా, ఉద్రిక్తతలను తగ్గించుకోవడాని ఇరు దేశాలు అంగీకరించాయని తెలిపారు. అయితే గతంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సమక్షంలో రెండు దేశాలు కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్నా దాడులు ఆగలేదు. తాజాగా చైనా చొరవతో రెండు దేశాల నేతలు శాంతిని నెలకొల్పుతామని ప్రకటించడం గమనార్హం.

మెక్సికోలో పట్టాలు తప్పిన రైలు

- 13 మంది మృతి

మెక్సికో సిటీ : మెక్సికోలో రైలు పట్టాలు తప్పిన ప్రమాదంలో 13 మంది మృతి చెందారు. మరో 24 మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడినవారిలో ఐదుగురు పరిస్థితి విషమంగా ఉంది. దక్షిణ రాష్ట్రమైన ఓక్సాకాలో చివెలా, నిజాండా పట్టాల మధ్య ఈ ఇంటర్ ఓషియానిక్ రైలు ఆదివారం పట్టాలు తప్పినట్లు అధికారులు తెలిపారు. ప్రమాద సమయంలో ఈ రైలులో తొమ్మిది మంది సిబ్బంది, 241 మంది ప్రయాణికులు ఉన్నారు.

కర్నూలు సుందరయ్య సర్కిల్‌లో రెడ్‌డ్రెస్ వలంటీర్ల కవాతును ప్రారంభిస్తున్న ఎంఏ.గఫూర్

కర్నూలులో రెడ్ డ్రెస్ వలంటీర్ల కవాతు

జెండా ఊపి ప్రారంభించిన ఎంఎ గఫూర్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగర వీధులు ఎర్ర సంద్రాన్ని తలపించాయి. సిఐటియు మహాసభ విజయవంతానికి తమ ఐక్యతను చాటుతూ, కార్మిక లోకానికి పిలుపునిస్తూ నిర్వహించిన కవాతు నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంది. క్రమశిక్షణకు మారుపేరైన రెడ్‌షర్ట్ వలంటీర్లు, వందలాది మంది కార్మికులు ఎర్రచొక్కాలు ధరించి, జెండాలు చేతబూని క్రమశిక్షణతో సాగిన ప్రదర్శన మహాసభ విజయానికి నాంది పలికింది. 'సిఐటియు జిందాబాద్... సిఐటియు అఖిలభారత మహాసభను జయప్రదం చేయండి.... నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి... 12 గంటల పని విధానాన్ని రద్దు చేయాలి.' అంటూ కవాతులో కార్మికులు పెద్దఎత్తున నినాదాలు చేశారు.

కర్నూలు న్యూ సిటీ రెడ్‌షర్ట్ వలంటీర్ల కవాతును సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కవాతు కర్నూలు సుందరయ్య సర్కిల్ కొత్త బస్టాండ్ నుంచి ప్రారంభమై ఎస్‌ఎపి క్యాంప్ మీదుగా బళ్లారి చౌరస్తా నుంచి తిరిగి సుందరయ్య సర్కిల్‌కు చేరుకుంది. గఫూర్ మాట్లాడుతూ.. దేశవ్యాప్త కార్మిక సమస్యలపై గళం విప్పేందుకు ఈ మహాసభ వేదిక కానుందని పేర్కొన్నారు. కర్నూలు ఓల్డ్ సిటీ ఆధ్వర్యంలో చేపట్టిన కవాతు నగరంలోని జమ్మిచెట్టు నుండి వన్‌టౌన్ మండిబజార్, పెద్ద పార్కు మీదుగా జిల్లా పరిషత్తు గాంధీ విగ్రహం వరకు సాగింది. వందలాది మంది కార్మికులు ఎర్రచొక్కాలు ధరించి కవాతు చేశారు. ఇన్స్యూరెన్స్ రంగం రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు కవాతుకు అగ్రభాగాన నడిచారు.

CITU కళా, సాహిత్య, విజ్ఞాన వీచికలు

మూడో రోజూ ఆకట్టుకున్న 'శ్రామిక ఉత్సవ్'

ప్రజాశక్తి - భీమునిపట్నం, ఎంవిపి.కాలనీ విలేకరులు

సిఐటియు అఖిల భారత మహాసభ నేపథ్యంలో విశాఖ ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరుగుతున్న శ్రామిక ఉత్సవ్ మూడో రోజూ ఉత్సాహంగా సాగింది. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సైన్స్ ఎగ్జిబిషన్ చైతన్యం నింపింది. సాహిత్య వేదికపై 'జాతీయోద్యమంలో తెలుగు సాహిత్యం' అంశంపై సదస్సు జరిగింది. దీనిలో పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా 'ప్రతిదీ ప్రైవేటురా..ప్రజలపైన వేటు రా .. దేశానికి చేటు రా' అంటూ ప్రజానాట్య మండలి కళాకారులు అనిల్ పాడిన పాట సభికులను ఆలోచింపజేసింది. మన డబ్బుతో నిర్మించిన ఫ్యాక్టరీలు బహుళ జాతి సంస్థలకు పాలకులు ఎలా కట్టబెడుతున్నదీ పాట రూపంలో కళాకారులు వివరించారు అరకు, పద్మాపురం గ్రామానికి చెందిన గిరిజన మహిళలు, పురుషులు ప్రదర్శించిన "థింసా నృత్యం" గిరిజనుల ఐక్యతను చాటిచెప్పింది. వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ చిన్నారులు ప్రదర్శించిన 'మన జీవితాల్లో వెలుగులు నింపెను, వెలుగుల రాదారి' నృత్యం సభికులను ఆలోచింపజేసింది. ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోనే ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ప్రముఖ సినీ గేయ రచయిత, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ సందర్శించారు. పుస్తక ప్రదర్శనలోని వివిధ స్టాల్స్‌ను సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... పుస్తకం గొప్పతనాన్ని తెలియజెప్పారు. 'శ్రామిక ఉత్సవ్'కు జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ విచ్చేశారు. 'బాల్య వివాహాలను నిర్మూలిద్దాం' అనే అంశంపై ప్రదర్శించిన లఘుచిత్రాన్ని ఆయన వీక్షించారు.

కేరళ కళాకారిణి

చక చకా..

- ముమ్మరంగా ఏర్పాట్లు
- రేపటి నుండి ప్రారంభం కానున్న సిఐటియు మహాసభ
- దేశ వ్యాప్తంగా 1600 మంది ప్రతినిధుల రాక
- విశాఖకు చేరుకున్న సంఘం ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

కార్మికవర్గ పోరాట పతాక సిఐటియు అఖిల భారత మహాసభకు విశాఖపట్నంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. బుధవారం నుండి మహాసభ ప్రారంభం కానుండటంతో సిఐటియు విశాఖ జిల్లా కమిటీ ఏర్పాట్ల పనులలో నిమగ్నమైంది. ఇప్పటికే విశాఖ నగరం అంతా ఎక్కడ చూసినా ఎర్రెర్రని తోరణాలు, జెండాలే కానవస్తున్నాయి. ప్రధాన కూడళ్లన్నీ ఎరుపుమయంగా మారాయి. మరోవైపు మహాసభకు ప్రతినిధుల రాక కూడా ప్రారంభమైంది. సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ సోమవారం విశాఖకు చేరుకున్నారు. వివిధ రాష్ట్రాల నుండి వస్తున్న ప్రతినిధులకు వాలంటీర్లు రెడ్‌సెల్యూట్‌లతో స్వాగతం పలుకుతున్నారు.

ఏర్పాట్లు ఇలా..

సిఐటియు మహాసభ నేపథ్యంలో విశాఖ నగరం ఎర్రబారుతోంది. మహాసభలకు మొత్తంగా 1600 మంది ప్రతినిధులు దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి విచ్చేస్తున్నారు. ప్రతినిధుల కోసం 38 హోటళ్లు, 750 రూములను ఇప్పటికే సిద్ధంగా ఉంచారు. మహాసభ 31న ప్రారంభమయ్యే బీచ్‌రోడ్డులోగల ఎయు కన్వెన్షన్ హాల్ లోపల ప్రత్యేక ఆకర్షణలతో ఎల్ఇడి లైట్లు, బయట వెయ్యి మంది వీక్షించేందుకు వీలుగా స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. తొలి రోజు అత్యధికమంది హాజరుకానుండడంతో బయట టెంట్‌లను వేస్తున్నారు. తొలి రోజు సభకు దేశంలోని 10 సోదర కార్మిక సంఘాలు హాజరుకానున్నాయి. వీటిలో ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, హెచ్‌ఎంఎస్, ఎస్ఇవిఎ వంటి తదితర సంఘాలు ఉన్నాయి. దేశం వెలుపలి నుంచి వర్కింగ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రానున్నారు. 4న విశాఖలోని పోర్టు ఏరియాలోగల ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ (పాత) స్టేడియంలో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

పనుల నిర్వహణకు కమిటీలు : ఆర్‌కెఎస్‌వి.కుమార్

మహాసభ ఏర్పాట్ల కోసం 15 కమిటీలు వేశామని ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ తెలిపారు. రిజిస్ట్రేషన్ కమిటీ, అకామడేషన్, ట్రాన్స్‌పోర్ట్, డెకరేషన్, ఫుడ్, హాల్, రైల్వే, ఎయిర్ పోర్టు రిసెప్షన్, మెడికల్ అసిస్టెన్స్ కమిటీ, సావనీర్ కమిటీలు వేశామన్నారు. రాష్ట్ర కేంద్రం విజయవాడ నుంచి విచ్చేసిన నాయకత్వం వీటన్నిటినీ ప్రత్యక్షంగా, పరోక్షంగా పర్యవేక్షణ చేస్తోందన్నారు. ఆహ్వాన సంఘానికి ఛైర్మన్‌గా సిహెచ్.నర్సింగరావు, కోశాధికారిగా ఎవి.నాగేశ్వరరావు వ్యవహ రిస్తున్నారన్నారు.

మహాసభ జరుగనున్న ఎయు కన్వెన్షన్ సెంటర్

నేడు డబ్ల్యుఎఫ్‌టియు ప్రధాన కార్యదర్శి రాక

విశాఖపట్నం : వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (డబ్ల్యుఎఫ్‌టియు) ప్రధాన కార్యదర్శి క్రిస్టస్ చరలాంబస్ నేడు (మంగళవారం) విశాఖకు రానున్నారు. సైప్రస్ నుండి బయలుదేరిన ఆయన నేటి ఉదయం విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. విశాఖలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న సిఐటియు జాతీయ మహాసభలో ఆయన పాల్గొంటారు.

తపన్‌సేన్‌కు సాదర స్వాగతం

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)

ఈ నెల 31 నుంచి విశాఖలో ప్రారంభమయ్యే సిఐటియు 18వ అఖిల భారత మహాసభ కోసం సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ విశాఖకు చేరుకున్నారు. విశాఖ ఎయిర్‌పోర్టులో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, ఉపాధ్యక్షులు కందారపు మురళి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సాదర స్వాగతం పలికారు. శ్రామిక ఉత్సవ్‌కు విచ్చేసిన ప్రముఖ కవి సుద్దాల అశోక్ తేజకూ అపూర్వ స్వాగతం లభించింది.

చరిత్ర పుటల నుంచి.. పోరాట క్షేత్రాల వరకు

శ్రామిక ఉత్సవ్‌లో ఆకట్టుకుంటున్న ఫొటో ఎగ్జిబిషన్

గతకాలపు ఘనతల నుండి వర్తమాన పోరాట క్షేత్రాల వరకు ఎన్నో చరిత్రాత్మక దృశ్యాలకు సిఐటియు జాతీయ మహాసభ సందర్భంగా నిర్వహిస్తున్న ఫోటో ఎగ్జిబిషన్ అద్దం పట్టింది. శ్రామిక ఉత్సవ్‌లో భాగంగా ఆంధ్ర యూనివర్శిటీ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఈ ఫోటోల ప్రదర్శన కేవలం చిత్రాల సమాహారమే కాదు.. శ్రమజీవుల స్వేదం, రక్తం, ఆశయాల సాక్షిగా సాగుతున్న ఒక నిరంతర ప్రయాణానికి దర్పణంగా నిలుస్తోంది. ఇక్కడి చిత్రాలు కేవలం నిశ్శబ్దంగా గోడలకు వేలాడటం లేదు. అవి మనతో మాట్లాడుతున్నాయి. గతన్ని గుర్తుచేస్తున్నాయి. వర్తమానంలోని అసమానతలను, దోపిడిని ప్రశ్నిస్తున్నాయి. భవిష్యత్ బాటలనూ చూపుతున్నాయి. స్ఫూర్తిని రగిలించే ఆ ఎగ్జిబిషన్ గురించి క్లుప్తంగా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం శ్రామిక మహిళ నేత పి.మణి పోరాటం, నిరసనలతో కూడిన చిత్రాలు

ఎగ్జిబిషన్ లో కనిపించే 1930 రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ ఫొటో కేవలం ఒక సమావేశం మాత్రమే కాదు.. అది భారతదేశ రాజకీయ భవిష్యత్తును, అణగారిన వర్గాల ప్రాతినిధ్యాన్ని నిర్ణయించిన కీలక ఘట్టంగా నిలుస్తుంది. నిర్వాహకులు కూడా అదే విషయాన్ని పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యంతో పాటు సామాజిక న్యాయం కూడా ఎంత అవసరమో ఈ చిత్రం వివరిస్తుంది. విశాఖ ఏజెన్సీలో చంద్రయ్య నాయుడు వంటి తొలితరం ఆదివాసీ యోధుల చిత్రాలు గిరిజన ప్రాంతాల్లో బ్రిటిష్ వ్యతిరేక భావజాలాన్ని రగిలించిన తొలిరోజులను గుర్తుచేస్తాయి . గురజాడ, శ్రీశ్రీ, ఆరుద్ర వంటి సాహితీ దిగ్గజాల చిత్రాలు కేవలం వారిని గౌరవించడమే కాకుండా సాహిత్యం ఎలా విప్లవానికి ఆయుధంగా మారుతుందో విశ్లేషించి చెప్పాయి. 'నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను' అన్న శ్రీశ్రీ మాటలు ఇక్కడ ప్రతి ఫొటోలోనూ ధ్వనించాయి 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' అనేది కేవలం నినాదం కాదు, అది ఒక జాతి భావోద్వేగం. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా లక్షలాది మంది కార్మికులు, స్థానికులు ఐక్యంగా చేస్తున్న పోరాటాన్ని, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చేస్తున్న ఉద్యమాన్ని తెలియజెబుతూ ఈ ఎగ్జిబిషన్‌లో చిత్రాలు కొలువుదీరాయి. ఉక్కు రక్షణ కోసం శ్రామిక మహిళ సంఘం నేత పి.మణి శిరోముండనం చేసుకున్న చిత్రం కార్మిక నేతలు వర్కర్ల కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధమనే సందేశాన్ని తెలిపింది.

వెట్టి చాకిరికి వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటం భారత చరిత్రలో భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తికోసం సాగిన అతిపెద్ద రైతాంగ విప్లవం. తెలంగాణ సాయుధ పోరాటంలో ఆయుధాలు పట్టి మహిళలు కదులుతున్న పోటో నారీలోకపు ఆత్మవిశ్వాసాన్ని, పోరాట స్ఫూర్తిని కళ్లకు కడుతుంది. కార్మిక చట్టాల విధ్వంసం నేపథ్యంలో 44 కార్మిక చట్టాలను 4 కోడ్లుగా మార్చడం ద్వారా కార్మికులను మళ్లీ బానిసత్వంలోకి నెట్టే ప్రయత్నాలను ఎగ్జిబిషన్ తీవ్రంగా ప్రశ్నించింది. 8 గంటల పనిదినం అనేది దాతృత్వం కాదు, అది పోరాడి సాధించుకున్న హక్కు అని ఇక్కడి చిత్రాలు చాటిచెబుతున్నాయి. అభివృద్ధి పేరుతో అదానీ వంటి సంస్థలకు కట్టబెడుతున్న ప్రాజెక్టుల వెనుక ఉన్న పర్యావరణ విధ్వంసాన్ని మరికొన్ని ఫొటోలు ఎండగట్టాయి. గూగుల్ డేటా సెంటర్ వల్ల వచ్చే సమస్యలు, అదానీ అంబుజా సిమెంట్ వ్యతిరేక పోరాటాలు ఈ ఫొటోల్లో కనిపిస్తాయి. ఇండిగో విమానాల రద్దు, ఇతర విమానయాన సంస్థల దోపిడీకి సంబంధించిన విశ్లేషణ, విపత్తులను కూడా పెట్టుబడిదారులు లాభాలుగా ఎలా మార్చుకుంటారో మరొక చిత్రం వివరించింది. కేరళలో పేదరిక నిర్మూలన, అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల హక్కుల కోసం సాగుతున్న పోరాటాలు ప్రత్యామ్నాయ రాజకీయాల అవసరాన్ని నొక్కి చెప్పే చిత్రాలు సందర్శకులను ఆలోచింపజేశాయి.

తెలంగాణ సాయుధ పోరాట చిత్రాలు

నాలుగు దశాబ్దాల క్రితమే...

శ్రీవారి చెంత సిఐటియు రెపరెపలు

3,600 మంది ఒక్కరోజే పర్మినెంట్ అర్చకులు సైతం 'పోరు'బాట

అన్ని శాఖల్లోనూ విస్తరించిన 'సిటు'

తిరుమల తిరుపతి దేవస్థానంలో ఉద్యమాల వేగుచుక్క 'సిఐటియు'.. పూలదండలో దారంలా డిప్యూటీ ఈవో నుంచి అటెండర్ స్థాయి వరకూ ఉద్యోగ కార్మికుల హక్కుల సాధనకై నాలుగు దశాబ్దాల క్రితమే సిఐటియు జెండా చేతబట్టారు.. శ్రీవారి అర్చకులు సైతం ఎర్రజెండా చేతబట్టి 'పోరుబాట' పట్టడం హైలెట్.. నిత్యం గోవిందనామ స్మరణ ఉండే ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుమల మాడావీధుల్లో సిఐటియు జిందాబాద్ నినాదాలు మార్మోగాయి.. సిఐటియు అప్పటి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నండూరి ప్రసాదరావు సారథ్యంలో దశలవారీ చేసిన పోరాటాల ఫలితంగా ఒక్కరోజే బోర్డు, ప్రభుత్వం స్పందించి 3,600 మంది కార్మికులను పర్మినెంట్ చేయడంతో వారి జీవితాల్లో వెలుగులు నిండాయి.

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

1979లో టిటిడిలో పర్మినెంట్ ఉద్యోగులనేవే లేవు. శాఖల వారీగా పనులు చేసుకుంటూ రోజు కూలి రూ.14.95 అందుకునేవారు. నెలకు సరాసరి 485 రూపాయలు అందేది. ఏడాదిలో ఆరు నెలలు పనులు ఉంటే, మరో ఆరు నెలలు పనులు ఉండేవి కావు. తొలుత నిరంతరం పనులు కల్పించాలంటూ ఉద్యమాలు జరిగేవి. సిఐటియు జిల్లా నాయకులు (తిరుమల ఇన్‌ఛార్జి) జిఆర్‌బాబు కొండపై టీ అంగడి నడుపుకుంటూ కార్మికుల సంఘటితం కోసం నడుం బిగించారు. అప్పట్లో ఎన్‌ఎంఆర్‌లుగా ఉన్న ఎం.నాగార్జున, కెవి రమణ, జి.వెంకటేశం, మునిరాజు, మునస్వామి, గోవిందయ్య, సుబ్రమణ్యం తదితరులంతా సిఐటియు నాయకత్వంలో సంఘం పెట్టాలని అనుకున్నారు. 1985లో టిటిడి ఫారెస్టు వర్కర్స్ యూనియన్‌గా ఏర్పాటయ్యింది. 585 మంది అప్పట్లో పనిచేస్తున్నారు. బ్యాంకుల ద్వారా కాకుండా వాళ్ల పనులు చేసే చోటకే వెళ్లి మస్టర్ల ద్వారా జీతాలను చెల్లించేవారు. అప్పట్లో ఇది సరికాదని, అందరినీ పర్మినెంట్ చేయాలని, బ్యాంకుల ద్వారా జీతాలివ్వాలని నండూరి ప్రసాదరావు ఆధ్వర్యంలో తిరుపతిలో నెలరోజుల పాటు మకాం వేసి దీర్ఘకాలిక ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఉద్యమం తీవ్రతరం కావడంతో జడిసిన టిటిడి యాజమాన్యం అన్ని విభాగాల్లోని వందలాది మంది కార్మికులను నిలిపివేసింది. దీంతో పోరాటం మరింత ఉవ్వెత్తున లేచింది. అన్ని శాఖల్లో పని చేసుకునే ఎన్‌ఎంఆర్‌లు అందరినీ కలుపుకుని ధర్నాలు, ర్యాలీలు, తిరుమల రామకోటి వద్ద దీక్షలు చేపట్టింది. టిటిడి వర్కర్స్ అండ్ యునైటెడ్ స్ట్రగుల్స్ పేరుతో ఈ ఆందోళనలు దీర్ఘకాలికంగా కొనసాగాయి. ఉద్యమం ఉధృతి నేపథ్యంలో 1988లో తిరుమల ఎస్‌వి గెస్ట్‌హౌస్ వద్ద బోర్డు సమావేశం జరిగిన సందర్భంగా నండూరి ప్రసాదరావు నాయకత్వంలో ర్యాలీగా వెళ్లారు. అప్పట్లో స్వాతంత్రోద్యమ పోరాటంలో పాల్గొని, కార్మికుల పక్షాన నిలబడే నాయకునిగా నండూరి ప్రసాదరావు అందరిలో తలలో నాలుకలా ఉండేవారు. అప్పట్లో టిటిడి ఛైర్మన్‌గా ఉన్న దేవినేని సీతారామయ్య బయటకు వచ్చి నండూరి ప్రసాదరావు దగ్గరకు వచ్చి 'మీరా' అంటూ సంబోధిస్తూ 'మీ డిమాండ్లను అంగీకరిస్తున్నాం' అని ప్రకటించారు. అప్పటినుంచి నిరంతరం పని కల్పించారు. ఆ తరువాతా ఉద్యమాలు కొనసాగాయి. 1991లో మే 6వ తేదీన 389, 390, 391 జీవోల ప్రకారం టిటిడిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 3,600 మందిని ఒకేరోజు పర్మినెంట్ చేస్తూ జీవో విడుదల చేశారు. ఇక టిటిడి కార్మికుల్లో ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. తిరుమల మాడావీధుల్లోనూ సిఐటియు జెండా చేతబట్టి విజయోత్సవాలు జరుపుకున్నారు. అప్పటినుంచి తిరుమల తిరుపతి దేవస్థానంలో సిఐటియు జెండా పాతుకుపోయింది. ఫారెస్టు, అన్నదానం క్యాంటిన్, ఇంజినీరింగ్, గార్డెన్, వాటర్ వర్క్స్, సెక్యూరిటీ, ఎలక్ట్రిసిటీ తదితర విభాగాల్లో సిఐటియూ అనుబంధ యూనియన్లు ఏర్పడి బలపడ్డాయి. వీటన్నింటిని టిటిడి స్టాఫర్స్ అండ్ యునైటెడ్ ఫ్రంట్ గైడ్ చేస్తోంది. 2004లో సిఐటియు ఆధ్వర్యంలోనే టిటిడిలోని అన్ని సంఘాలనూ కలుపుకుని ఐక్యపోరాట సంఘంగా ఎదిగి టిటిడి ఉద్యోగులకు యూనియన్ ఎలక్షన్ పెట్టాలని, ఉద్యోగులు చనిపోతే వారి పిల్లలకు ఉద్యోగాలివ్వాలని, ఇళ్లస్థలాలివ్వాలని తదితర తొమ్మిది డిమాండ్లతో ఆందోళనలు చేయగా డిమాండ్లన్నీ సాధించారు. ఎన్నికల్లోనూ యునైటెడ్ ఫ్రంట్‌దే పైచేయి. ప్రస్తుతం రెగ్యులర్ ఉద్యోగుల సమస్యలపై పోరాడుతూనే గత ఇరవై ఏళ్లుగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్లపైనా పోరాటాలను కొనసాగిస్తూనే ఉంది.

పోటు కార్మికుల ఉద్యమమూ చరిత్రే

తిరుమల శ్రీవారి లడ్డూ తయారు చేసే కార్మికులకూ కష్టం వచ్చింది. ఎన్టీ రామారావు అధికారంలోకి రాగానే మిరాశీ పద్ధతి (వారసత్వం) రద్దు చేయడంతో అర్చకులు పోరుబాట పట్టారు. అన్ని రాజకీయ పార్టీలనూ తమకు న్యాయం చేయాలని కోరారు. టిటిడిలో అప్పట్లో ఉన్నతస్థాయిలో ఉన్న అధికారి 'ఏ పార్టీ మీకు న్యాయం చేయదు.. సిఐటియు తప్ప' అని అర్చకులకు చెప్పడంతో వారంతా 1996లో సిఐటియు జెండా చేతబట్టారు. దశలవారీ ఉద్యమం చేపట్టారు. అర్చకులు ఎర్రజెండా చేతబట్టి పురవీధుల్లో తిరిగారు. ప్రభుత్వం స్పందించి అర్చకులు ఆందోళన చేయడం ఏంటంటూ పోటు కార్మికులను (లడ్డూ తయారీ కార్మికులు) 180 మందిని పర్మినెంట్ చేయించింది.

కార్మికులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న నండూరి ప్రసాదరావు (ఫైల్)

టిటిడి ఉద్యోగుల అర్ధనగ్న ప్రదర్శన (ఫైల్)

సొంత డబ్బులతో కదుల్తున్న మైన్స్ కార్మికులు

ప్రజాశక్తి- గరివిడి (విజయనగరం జిల్లా)

సిఐటియు మహాసభ విజయవంతానికి తాము సైతం అంటూ స్కీం వర్కర్లతో పాటు వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఎవరికి వారే సొంత డబ్బులతో బస్సులను ఏర్పాటు చేసుకొని సమాయత్తం అవుతున్నారు. గరివిడి పారిశ్రామిక ప్రాంతంలోని 500 మంది డిఎఫ్ఎన్ మైన్స్ కార్మికులు సొంతంగా పది బస్సులు ఏర్పాటు చేసుకున్నారు. ఈ ఏడాది గరివిడి మండలం దేవాడ మైన్స్ లీజు ఒప్పందం పూర్తి అయిన నేపథ్యంలో స్థానిక కార్మికుల తొలగింపు చర్యలు సిఐటియు పోరాటంతో ఆగాయి. ఈనేపథ్యంలో వీరంతా రెట్టింపు ఉత్సాహంతో బహిరంగ సభకు తరలివెళ్లేందుకు సిద్ధమయ్యారు. జిల్లా అంతటా అంగన్‌వాడీలతో సిఐటియు నాయకులు సమావేశాలు నిర్వహించి బహిరంగసభకు సమాయత్తం చేశారు. పూసపాటిరేగలో జాతీయ రహదారి బ్రిడ్జి నుంచి తాహశీల్దార్ కార్యాలయం మీదుగా కోనాడ జంక్షన్ వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. బొబ్బిలి నియోజకవర్గంలో ఆటో ప్రచారం నిర్వహించారు. వంగర మండలంలోని పలు గ్రామాల్లో ఆటో ప్రచారం చేపట్టారు.

మైన్స్ కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టివి రమణ

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68